ఆదివారం
22•12•2019
కరీంనగర్
• వెల. రూ. 8.00
• సంపుటి 9 • సంచిక 177
• పేజీలు : 14 + 16 + 32 పేజీల ఆదివారం అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW.NTNEWS.COM
/NTDAILYONLINE







# పౌర ఆగ్రహజ్వాల



పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా బీహార్‌లో శనివారం ప్రతిపక్ష ఆర్జేడీ నిర్వహించిన రాష్ట్ర బంద్ సందర్భంగా పాట్నా రోడ్లపై టైర్లను తగులబెడుతున్న ఆందోళనకారులు

సీఏఏకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కొనసాగుతున్న నిరసనలు

- మళ్లీ మండిపోయిన ఉత్తరప్రదేశ్
- రాష్ట్రంలో భారీ విధ్వంసం, హింస
- కాన్పూర్, రాంపూర్‌లలో అల్లర్లు
- పోలీస్‌పోస్ట్‌తోపాటు పలు వాహనాలకు నిప్పు
- మళ్లీ రోడ్డెక్కిన జామియా విద్యార్థులు
- రెండురోజుల్లో 16కు చేరిన మృతుల సంఖ్య
- బీహార్‌కూ పాకిన ఆందోళనలు
- ఆర్జేడీ ఆధ్వర్యంలో బీహార్ బంద్
- క్రమంగా సద్దుమణుగుతున్న ఢిల్లీ
- బెంగాల్, అసోంలో శాంతియుత నిరసనలు

5

**వివాదాస్పద** పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ మరోసారి అల్లర్లతో అట్టుడికిపోయింది. కాన్పూర్‌లో పోలీస్‌పోస్ట్‌కు ఆందోళనకారులు నిప్పుపెట్టారు. రాంపూర్‌లో పోలీసులపైకి రాళ్లురువ్వారు. పలు వాహనాలను తగలబెట్టారు. పోలీసులు బాష్పవాయు గోళాలను ప్రయోగించి నిరసనకారులను చెదరగొట్టారు. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. యూపీలో గత రెండురోజులుగా చోటుచేసుకున్న హింసాకాండలో మృతిచెందిన వారి సంఖ్య 16కు చేరుకున్నది. అల్లర్లలో ఇప్పటివరకు 260 మందికిపైగా పోలీసులు గాయపడ్డారని, 57 మందికి బుల్లెట్ గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. ఆందోళనల నేపథ్యంలో పలు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలను సోమవారం వరకు నిలిపివేశారు. నాలుగురోజులు ప్రశాంతంగా కనిపించిన అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలో మళ్లీ నిరసనలు మొదలయ్యాయి. మరోవైపు ఆందోళనలు బీహార్‌కు విస్తరించాయి. శనివారం బీహార్‌లో ప్రతిపక్ష ఆర్జేడీ రాష్ట్రవ్యాప్త బంద్ నిర్వహించింది. దీంతో రోడ్డు, రైలు సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆందోళనకారులు పలుచోట్ల హింసకు దిగారు. బంద్‌ను ధిక్కరించి రోడ్డుపైకి వచ్చిన రిక్షా, ఆటోల అద్దాలను ధ్వంసం చేశారు. దేశ రాజధానిలో పరిస్థితులు క్రమంగా సద్దుమణుగుతున్నాయి. శుక్రవారం అల్లర్లు చోటుచేసుకున్న పాత ఢిల్లీ, సీమాపురి ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టంచేశారు. శుక్రవారంనాటి హింసకు సంబంధించి భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ సహా 26 మందిని అరెస్ట్‌చేశారు. పశ్చిమబెంగాల్, అసోంలలో ప్రజలు శాంతియుత నిరసనలు చేపట్టారు. మేఘాలయలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించారు. కేరళ, తమిళనాడులోనూ నిరసనలు చోటుచేసుకున్నాయి. చెన్నై, కోజికోడ్‌లలో పలువురు నిరసనకారులను పోలీసులు అరెస్ట్‌చేశారు. మరోవైపు, సీఏఏకి మద్దతుగా ముంబైలో వందలమంది ర్యాలీ నిర్వహించారు. దేశ, విదేశాలకు చెందిన సుమారు 1,100 మంది ప్రొఫెసర్లు సీఏఏకి మద్దతుగా ఒక సంయుక్త ప్రకటన విడుదలచేశారు. కాగా, సీఏఏని విమర్శిస్తూ మలేసియా ప్రధాని మహతీర్ మహమ్మద్ చేసిన వ్యాఖ్యలపై భారత్ అభ్యంతరం తెలిపింది. ఢిల్లీలోని ఆ దేశ రాయబారిని పిలిపించుకున్న విదేశాంగ శాఖ.. సీఏఏ తమ అంతర్గత విషయమని స్పష్టంచేసింది.



పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో నిర్వహించిన భారీ బహిరంగసభలో మాట్లాడుతున్న మజ్లిస్ అధినేత, ఎంపీ అసదుద్దీన్

## సీఏఏను వెనక్కి తీసుకోవాలి

స్వార్థపూరిత ఆలోచనలను కేంద్రం మానుకోవాలి

మజ్లిస్ అధినేత, ఎంపీ అసదుద్దీన్ డిమాండ్

హైదరాబాద్‌లో భారీ సభ

5



శనివారం రాత్రి హెచ్‌ఐసీసీలో టీవీ9 ఆధ్వర్యంలో నిర్వహించిన టీవీ9 నవ నక్షత్ర సన్మానం కార్యక్రమంలో దర్శక దిగ్గజం కే విశ్వనాథ్‌కు జీవన సాఫల్య పురస్కారం అందజేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో టీటీడీ బోర్డు సభ్యుడు జూపల్లి రామేశ్వర్‌రావు, ప్రముఖ సినీహీరోలు చిరంజీవి, నాగార్జున కూడా ఉన్నారు.

# సినిమా హబ్‌గా హైదరాబాద్

- పరిశ్రమ సమస్యల పరిష్కారానికి త్వరలో సమావేశం
- మీడియా సామాజిక కోణంలో పనిచేయాలి
- మంచిని ప్రోత్సహించాలి
- టీవీ9 నవ నక్షత్ర సన్మాన కార్యక్రమంలో.. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌ను ఫిల్మ్ హబ్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలిపారు. సినిమా పరిశ్రమల సమస్యలను పరిష్కరించడానికి త్వరలో ఒక సమావేశం ఏర్పాటుచేస్తానని చెప్పారు. శనివారం రాత్రి హెచ్‌ఐసీసీలో టీవీ9 ఆధ్వర్యంలో నిర్వహించిన నవ నక్షత్ర సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం కేసీఆర్.. ప్రఖ్యాత సినీ దర్శకుడు.. కళాతపస్వి కే విశ్వనాథ్‌ను జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించారు. విశ్వనాథ్ తెలుగు సినీరంగంలో గొప్పవ్యక్తి అని, ఆయన సినిమాల ద్వారా సమాజాన్ని చైతన్యవంతంచేశారని కొనియాడారు. డైరెక్టర్ త్రివిక్రమ్ వంటి వారు తెలుగు సినీరంగంలో ఉండటం గర్వకారణమని ప్రశంసించారు. సినీ దర్శకులు నలుగురికి

మిగతా 3వ పేజీలో

# మందుల స్కాంలో మరో ఇద్దరి అరెస్ట్



భూపాల్‌రెడ్డి



నాగేందర్‌రెడ్డి

- కుంభకోణంలో 21కి చేరిన అరెస్టుల సంఖ్య
- తాజాగా విశాల్ ఎంటర్‌ప్రైజెస్ భూపాల్‌రెడ్డి, వసుధ మార్కెటింగ్ నాగేందర్‌రెడ్డి జైలుకు
- 25 షెల్ కంపెనీలను సృష్టించినట్టు ఆధారాలు
- కొనసాగుతున్న ఏసీబీ ఆరా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐఎంఎస్ (ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్) మందుల కొనుగోలు కుంభకోణంలో అరెస్టుల పర్వం కొనసాగుతున్నది. శనివారం మరో ఇద్దరిని ఏసీబీ అధికారులు అరెస్టుచేశారు. ఐఎంఎస్ మాజీ డైరెక్టర్ డాక్టర్ దేవికారాణి, మరికొన్ని ఫార్మా కంపెనీల ప్రతినిధులతో కుమ్మక్కై డొల్ల కంపెనీలు సృష్టించి భారీ మొత్తంలో ప్రభుత్వ సొమ్ము కాజేసినట్టు ఆధారాలు లభించడంతో సికింద్రాబాద్‌లోని విశాల్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన పందిరి భూపాల్‌రెడ్డి, వసుధ మార్కెటింగ్ కంపెనీకి చెందిన రెడ్డిమల్లి నాగేందర్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్టుచేశారు. ఈ ఏడాది అక్టోబర్ 31న నమోదైన కేసులో భాగంగానే ఈ ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు అధికారులు తెలిపారు. వీరిపై 13(1)(సీ)(డీ), 7(ఏ), 13(1)(ఏ), 13(2), 477(ఏ), 465, 468, 471, 420 రెడ్‌విత్ 120-బీ, 34 ఐపీసీ సెక్షన్ల కింద అభియోగాలు నమోదుచేశారు. వీరిని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచిన అనంతరం చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఏసీబీ అధికారులు వివరించారు. భూపాల్‌రెడ్డి, రెడ్డిమల్లి నాగేందర్‌రెడ్డి అరెస్టుతో ఈ కేసులో అరెస్టయినవారి సంఖ్య 21కి చేరింది. ఏసీబీ అధికారులు అరెస్టుచేసిన విశాల్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన పందిరి భూపాల్‌రెడ్డి, వసుధ మార్కెటింగ్ కంపెనీకి చెందిన రెడ్డిమల్లి నాగేందర్‌రెడ్డి.. తేజాఫార్మా ఎండీ పీ రాజేశ్వర్‌రెడ్డి, అతడి సోదరుడు పీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి డొల్ల కంపెనీలు సృష్టించినట్టు అధికారులు

మిగతా 2వ పేజీలో

# పిల్లలు ఏం తింటున్నారు?



దేశవ్యాప్తంగా ఒకటి నుంచి 19 ఏండ్ల మధ్య వయస్కుల ఆరోగ్య పరిస్థితి

| అంశం | 1-4 ఏండ్లు | 5-9 ఏండ్లు | 10-19 ఏండ్లు |
|---|---|---|---|
| రక్తహీనత (బాలికలు) | 36.5 | 27.7 | 46 |
| రక్తహీనత (బాలురు) | 39.3 | 26.9 | 18.5 |
| ఇనుము లోపం | 33.4 | 22.7 | 26 |
| బీ విటమిన్ లోపం | 46.8 | 45.8 | 63.7 |
| బీ12 విటమిన్ లోపం | 12.4 | 13.2 | 29.1 |
| విటమిన్ డీ లోపం | 9.6 | 5.5 | 8.8 |
| విటమిన్ ఏ లోపం | 26.5 | 35 | 19.7 |
| జింక్ లోపం | 10.1 | 9.3 | 27.9 |
| అయోడిన్ లోపం (ప్రతి వెయ్యి మందిలో) | 299 | 290 | 254 |

లోపిస్తున్న విటమిన్లు.. తగ్గుతున్న ఎదుగుదల

ఆకుకూరలు తినిపిస్తలేం • గుడ్డుకు దూరంచేస్తున్నాం • ధాన్యాలు, గింజలు లేవు

మాంసం, చికెన్ పదార్థాలపైనే మోజు • చేపల వినియోగమూ తక్కువే

మటన్‌లో మనకు సాటిలేదు: సమగ్రజాతీయ పౌష్టికాహార సర్వేలో విశ్లేషణ

**తంగళ్ళపల్లి సంపత్, హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

హాలీడే వచ్చేసిందంటే.. జాలీడే.. పిల్లలతో షికార్లు.. సినిమాలు.. గేమింగ్స్.. చివరకు మెక్‌డొనాల్డ్స్‌లో బర్గర్లు.. డామినోస్‌లో పిజ్జాలు.. రెస్టారెంట్‌లో చికెన్, మటన్ బిర్యానీలు, చైనా వంటలు.. సూపర్.. అంతా హ్యాపీ.. వీకెండ్ అంటేనే జాయ్‌ఫుల్‌డే.. ఓకే.. మిగతా వారంరోజులైనా ఏం తింటున్నారు? పిల్లలకు ఏం తినిపిస్తున్నారు? అంతా హడావుడి.. పొద్దున్నే.. తోచిందేదో వండేసి.. టిఫిన్‌డబ్బాల్లో కుక్కేసి స్కూళ్లకు.. కాలేజీలకు పంపించేస్తున్నాం.. అవి తిన్నంత తింటారు. లేకుంటే ఆ బాక్సులు అలాగే వెనక్కు వచ్చేస్తాయి. రోజూ సరైన తిండి తినకుండా.. వారం చివర్లో జంక్‌ఫుడ్‌ను పొట్టనిండా నింపేస్తూ.. తల్లిదండ్రులే పిల్లలను ఆరోగ్యానికి దూరం చేస్తున్నారు. అనారోగ్యాన్ని తెచ్చిపెడుతున్నారు. హాస్పిటళ్లకు.. మందులకు.. సంపాదనంతా ధారపోస్తున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు మాంసం, చికెన్ తప్ప మిగతా పోషకాహారాన్ని గురించి ఆలోచించడంలేదు. పండ్లు పెట్టడంలేదు. కూరగాయల ఊసేలేదు. ధాన్యాలు, చిరుధాన్యాలు, గింజల గురించిన పట్టింపేలేదు. పాలు.. దాని అనుబంధంగా ఉత్పత్తి అయ్యే పదార్థాలను కూడా తినిపించడంలేదు. శరీరాన్ని దృఢంగా, ఆరోగ్యకరంగా ఉంచే ఆహారాన్ని పక్కనపెట్టి.. పూర్తిగా మాంసం, చికెన్‌లతో సరిపుచ్చుతున్నారు. మన రాష్ట్రంలోనే కాదు. దేశమంతటా తల్లిదండ్రులది.. వారి గారాబంలో పెరుగుతున్న పిల్లలది ఇదే పరిస్థితి. జాతీయస్థాయిలో నిర్వహించిన సమగ్ర జాతీయ పోషకాహార సర్వేలో పిల్లల్లో పౌష్టికాహారం, విటమిన్ల లోపం ఏ స్థాయిలోఉన్నదో బయటపడింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదలచేసిన పోషకాహార సర్వేలో అనేక అంశాలు వెల్లడయ్యాయి. పిల్లలకు పెడుతున్న ఆహారం కారణంగానే వాళ్లలో విటమిన్ల లోపం తీవ్రస్థాయిలో తలెత్తుతున్నదని ఈ సర్వేలో తేలింది.

**ఆమోదయోగ్యమైన ఆహారం లేదు**

శిశువు పుట్టిన తర్వాత ఆరునెలల నుంచి 23 నెలల వరకు చిన్నారులకు ఆమోదయోగ్యమైన ఆహారం ఇవ్వడంలో

మిగతా 2వ పేజీలో

మహారాష్ట్ర రైతులకు

## 2 లక్షల వరకు రుణమాఫీ

- అసెంబ్లీలో ప్రకటించిన సీఎం ఉద్ధవ్‌ఠాక్రే
- మహాత్మాజ్యోతిరావు పూలే రుణమాఫీ పథకంగా అమలు
- ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వోద్యోగులకు ఈ స్కీమ్ వర్తించదు

5

**చికెన్ ధరలు** (వెన్‌కాబ్) (రూ.)

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 93.00 | రిటైల్ లైవ్ | 115.00 |
| డ్రెస్డ్ | 167.00 | స్కిన్‌లెస్ | 190.00 |


**గుడ్ల ధరలు** (వందకు) (రూ.)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 410.00 | రంగారెడ్డి | 410.00 |
| మెదక్ | 410.00 | కరీంనగర్ | 413.00 |
| వరంగల్ | 413.00 | డజన్ ధర | 66.00 |

# పుస్తకం పిలుస్తున్నది

రేపట్నుంచి జాతీయ పుస్తక ప్రదర్శన

- వారంపాటు ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహణ
- బహుభాషా పుస్తకాలతో స్టాళ్ల ఏర్పాటు
- పది లక్షలమంది హాజరవుతారని అంచనా




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో..' పుస్తకం ఏమిస్తుంది? పుస్తకం బతుకునిస్తుంది. బతుకనిస్తుంది. విజ్ఞానాన్నిస్తుంది. వివేకాన్ని పెంచుతుంది. పుస్తకాల ప్రపంచంలో మునిగి జ్ఞానసముపార్జనచేస్తున్నవారికి పుస్తకాల జాతర స్వాగతం చెప్తున్నది. హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి జనవరి 1 వరకు ఎన్టీఆర్ గ్రౌండ్స్ (తెలంగాణ కళా భారతి)లో కొలువుదీరుతున్న పుస్తకాలు ఆహ్వానం పలుకుతున్నాయి. దాదాపుగా పది లక్షల మంది వరకు పుస్తక ప్రేమికులు ఈ జాతీయ పుస్తక ప్రదర్శనకు వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. పుస్తకం ఒక మంచి స్నేహితుడులాంటిదని పెద్దలు చెప్తారు. ప్రతి వ్యక్తి విజయం వెనుక ఒక మంచి పుస్తకం ఉంటుందని కూడా అంటారు. ప్రపంచ కుబేరుడు వారెన్ బఫెట్ ప్రతిరోజు 500 పేజీలు చదువుతారట. అధిక సమయాన్ని పుస్తక పఠనానికే కేటాయిస్తారట. అమెరికాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మార్క్ క్యూబన్ రోజుకు మూడు గంటలు చదువుతారు. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఏడాదికి యాభై పుస్తకాలు లక్ష్యంగా పెట్టుకొని చదువుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి కేసీఆర్ ఇలా.. జీవితంలో ఉన్నతశిఖరాలు అధిరోహించిన వారందరి విజయం వెనుక పుస్తకం ఉంటుందని వారి అనుభవాలే మనకు చెప్తాయి. మన జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు పుస్తకాలు పరిష్కారం చూపుతాయి. పుస్తకాలు చదివే అలవాటున్నవారికి ఎలాంటి సమస్యలనైనా

మిగతా 3వ పేజీలో



**ముఖ్యమంత్రి** కేసీఆర్‌కు పుస్తకాలంటే ఎంతో ఇష్టం. పఠనాసక్తి, అధ్యయనంచేసే శక్తి ఆయనకున్న బలం. వేల సంఖ్యలో పుస్తకాలను చదివారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు బాట వేయడంలో ఆ పుస్తకాలు జీవధారగా ఉపయోగపడ్డాయి. పుస్తకాలు ఏమి చేస్తాయంటే.. ఒక రాష్ట్రాన్ని కూడా తీసుకువస్తాయంటాను.

– జూలూరు గౌరీశంకర్, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు

## సుందర్ పిచాయ్‌కి బంపర్ ఆఫర్



- 242 మిలియన్ డాలర్ల వార్షిక వేతనం
- వచ్చే ఏడాది నుంచి అమలు
- ప్రకటించిన అల్ఫాబెట్

7

ఎన్‌కౌంటర్ మృతులకు

## ఎయిమ్స్ వైద్యులతో రీ పోస్ట్‌మార్టం

అనంతరం మృతదేహాలు బంధువులకు అప్పగించాలి

కేస్ డైరీ, లాగ్‌బుక్స్, వెపన్స్ సీజ్‌చేయాలి: హైకోర్టు ఆదేశం

2

## భారీగా డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

epaper.ntnews.com




# ఫిల్మ్‌సిటీ ఓ మినీ భారత్

- కష్టం, సృజనాత్మకతకు ప్రతీక
- రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ట్వీట్
- నేడు రాజ్‌భవన్‌లో రాష్ట్రపతికి విందు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చిత్ర నిర్మాతలు, కళాకారుల కష్టం, సృజనాత్మకతకు రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రతీక అని, అది ఒక మినీ భారత్‌ను తలపిస్తున్నదని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కొనియాడారు. శీతాకాల విడిది కోసం హైదరాబాద్ వచ్చిన ఆయన శనివారం అబ్దుల్లాపూర్‌మెట్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీని సందర్శించారు. అనంతరం తన మనోగతాన్ని ట్విట్టర్‌లో పంచుకున్నారు. 'హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీని సందర్శించాను. అనేక ఏండ్లుగా గొప్ప భాషల్లో వందల చిత్రాలు, టీవీ సీరియల్స్ చిత్రీకరణ ఇక్కడ జరిగింది. ఈ ఫిల్మ్‌సిటీ మినీ భారతాన్ని తలపిస్తున్నది' అని ప్రశంసించారు. కాగా, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఆదివారం రాత్రి రాజ్‌భవన్‌లో విందు ఇవ్వనున్నారు. ఈ విందు కార్యక్రమానికి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుతోపాటు రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి తెలంగాణ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక యాప్‌ను ఆవిష్కరించనున్నారు.



జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ట్విట్టర్‌లో ఫొటోను పోస్ట్‌చేసిన కేటీఆర్



జగన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫొటోను షేర్‌చేసిన సంతోష్‌కుమార్

# జగన్‌కు కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు ట్విట్టర్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఏపీని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని, యంగ్ అండ్ డైనమిక్ చీఫ్ మినిస్టర్ అంటూ రాజ్యసభసభ్యుడు సంతోష్‌కుమార్ ట్విట్టర్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.

# భూముల విలువ సవరణపై సర్వే

## వారంలో ప్రభుత్వానికి నివేదిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో భూముల విలువను హేతుబద్ధీకరించడానికి స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో తాజా పరిస్థితిని అంచనా వేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల్లో బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరలు, అధికారిక రేట్లకు తేడా ఎంత ఉన్నది? భారీ వ్యత్యాసాన్ని ఎలా తగ్గించాలనేదానిపై దృష్టిసారించారు. వ్యవసాయ భూములు, ఓపెన్‌ప్లాట్లు, వ్యక్తిగత గృహాలు, అపార్ట్‌మెంట్లు ఇలా నాలుగు రకాలుగా వర్గీకరించి సర్వే నిర్వహిస్తున్నారు. అధికారిక ధరలకు, బహిరంగ మార్కెట్‌లోని ధరలకు తేడా ఎంత ఉన్నది? భూముల విలువను ఏ విధంగా మదింపు చేయాలి? అనే అంశాలపై అధికారులు వారంరోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్టు తెలిసింది. శాస్త్రీయ పద్ధతిలో భూముల విలువను పెంచడం వల్ల సామాన్యులకు మేలు జరుగడంతోపాటు రాష్ట్ర రాబడి కూడా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.



# భారీగా డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో 24 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీచేస్తూ తెలంగాణ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న తొమ్మిదిమంది డిప్యూటీ కలెక్టర్లు ప్రభుత్వానికి రిపోర్టుచేయాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. ప్రస్తుతం ఖమ్మం డీఆర్వోగా పనిచేస్తున్న ఐఏఎస్ అధికారి అనురాగ్ జయంతిని సాధారణ పరిపాలనా విభాగంలో రిపోర్టు చేయాలని పేర్కొన్నది. వివిధ విభాగాల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న కొంతమంది డిప్యూటీ కలెక్టర్ల డిప్యుటేషన్‌ను ప్రభుత్వం రద్దుచేసి డిప్యూటీ కలెక్టర్లుగా బదిలీచేసింది.

# మందుల స్కాంలో మరో ఇద్దరి అరెస్ట్

- కుంభకోణంలో 21కి చేరిన అరెస్టుల సంఖ్య
- తాజాగా విశాల్ ఎంటర్‌ప్రైజెస్ భూపాల్‌రెడ్డి, వసుధ మార్కెటింగ్ నాగేందర్‌రెడ్డి జైలుకు
- 25 షెల్ కంపెనీలను సృష్టించినట్టు ఆధారాలు
- కొనసాగుతున్న ఏసీబీ ఆరా



భూపాల్‌రెడ్డి



నాగేందర్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐఎంఎస్ (ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్) మందుల కొనుగోలు కుంభకోణంలో అరెస్టుల పర్వం కొనసాగుతున్నది. శనివారం మరో ఇద్దరిని ఏసీబీ అధికారులు అరెస్టుచేశారు. ఐఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ దేవికారాణి, మరికొన్ని ఫార్మా కంపెనీల ప్రతినిధులతో కుమ్మక్కై డొల్ల కంపెనీలు సృష్టించి భారీ మొత్తంలో ప్రభుత్వ సొమ్ము కాజేసినట్టు ఆధారాలు లభించడంతో సికింద్రాబాద్‌లోని విశాల్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన పందిరి భూపాల్‌రెడ్డి, వసుధ మార్కెటింగ్ కంపెనీకి చెందిన రెడ్డిమల్లి నాగేందర్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్టుచేశారు. ఈ ఏడాది అక్టోబర్ 31న నమోదైన కేసులో భాగంగానే ఈ ఇద్దరు నిందితులను అరెస్టుచేసి వీరిపై వివిధ సెక్షన్ల కింద అభియోగాలు నమోదుచేశారు. వీరిని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచిన అనంతరం చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఏసీబీ అధికారులు వివరించారు. వీరి అరెస్టుతో ఈ కేసులో అరెస్టయినవారి సంఖ్య 21కి చేరింది. ఏసీబీ అధికారులు అరెస్టుచేసిన విశాల్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన పందిరి భూపాల్‌రెడ్డి, వసుధ మార్కెటింగ్ కంపెనీకి చెందిన రెడ్డిమల్లి నాగేందర్‌రెడ్డి.. తేజాఫార్మా ఎండీ పీ రాజేశ్వర్‌రెడ్డి, అతడి సోదరుడు పీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి డొల్ల కంపెనీలు సృష్టించినట్టు అధికారులు గుర్తించారు. వీరంతా కలిసి మొత్తం 25 షెల్ కంపెనీలను సృష్టించినట్టు ఆధారాలు లభించాయి. ఈ కంపెనీల నుంచి మందు లు సరఫరా చేస్తున్నట్టుగా సృష్టించిన కొటేషన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఐఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ దేవికారాణి సూచనల మేరకు సనత్‌నగర్ ఈఎస్‌ఐ దవాఖానలోని ఫార్మసిస్ట్ నాగలక్ష్మి ద్వారా ఈ వ్యవహారం మొత్తాన్ని నడిపినట్టు కీలక ఆధారాలను ఏసీబీ సేకరించింది. ఈ కుంభకోణంలో భారీ మొత్తంలో దండుకున్న సొమ్ముతో భూపాల్‌రెడ్డి, రెడ్డిమల్లి నాగేందర్‌రెడ్డి కామారెడ్డి జిల్లా బిక్నూర్‌లో వ్యవసాయ భూములు కొనుగోలు చేసినట్టు ప్రాథమిక ఆధారాలు లభించాయి. శనివారం అరెస్టు అయిన ఇద్దరు నిందితులు ఎంతమేరకు ఈ స్కాంలో భాగస్వాములుగా ఉన్నారు.. వారు సృష్టించిన ఇండెంట్లు, పర్చేజ్ ఆర్డర్లు, ఇతర నగదుల లావాదేవీల అంశాలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు.

## ఎయిమ్స్ వైద్యులతో

# రీ పోస్ట్‌మార్టం

- రేపు సాయంత్రం 5 గంటల వరకు గడువు
- అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించాలి
- కేస్ డైరీ, లాగ్‌బుక్స్, వెపన్స్‌ను సెంట్రల్ ఫోరెన్సిక్‌ల్యాబ్‌కు పంపాలి
- అన్ని ఆధారాలు త్రిసభ్య కమిషన్‌కు సమర్పించాలి
- దిశ నిందితుల మృతదేహాలపై హైకోర్టు కీలక ఆదేశం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

హైదరాబాద్ గాంధీ హాస్పిటల్ మార్చురీలో భద్రపరిచిన దిశ నిందితుల మృతదేహాలకు ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యులతో రీపోస్ట్‌మార్టం నిర్వహించాలని హైకోర్టు శనివారం ఆదేశించింది. మృతదేహాలు, ఇతర ఆధారాల సేకరణపై హైకోర్టే నిర్ణయం తీసుకుంటుందని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో విచారణచేపట్టిన చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం.. కీలక ఉత్తర్వులు జారీచేసింది. అత్యంత సీనియర్లయిన ముగ్గురు ఎయిమ్స్ ఫోరెన్సిక్ వైద్య నిపుణులతో మెడికల్ బోర్డు ఏర్పాటుచేయాలని తెలిపింది. ఇందుకోసం ఢిల్లీలోని ఎయిమ్స్ సూపరింటెండెంట్‌కు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి విజ్ఞప్తి పంపాలని సూచించింది. ఎయిమ్స్ మెడికల్ బోర్డు సభ్యులను విమానంలో తీసుకువచ్చి, సాధ్యమైనంత త్వరగా మృతదేహాలకు రీపోస్ట్‌మార్టంచేయాలని ఆదేశించింది. ఇప్పటికే మృతదేహాలు 50 శాతం డీకంపోజ్ అయ్యాయని కోర్టుకు హాజరైన గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్‌కుమార్ వెల్లడించినందున.. సమయం ఎక్కువగా లేదని.. ఈ నేపథ్యంలో ఈ నెల 23 సాయంత్రం 5 గంటల వరకు రీపోస్ట్‌మార్టం పూర్తిచేయాలని స్పష్టంచేసింది. రీపోస్ట్‌మార్టం అనంతరం మెడికల్ బోర్డు సేకరించిన ఆధారాల ప్రకారం స్వతంత్రంగా ముగింపు అభిప్రాయాన్ని వెల్లడించాలని తెలిపింది. రీపోస్ట్‌మార్టం మొత్తాన్ని వీడియో రికార్డుచేసి.. ఆ ఫుటేజితోపాటు పోస్ట్‌మార్టం రిపోర్డులను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు సమర్పించాలని పేర్కొన్నది. పోస్ట్‌మార్టం పూర్తయిన తర్వాత అంత్యక్రియలకోసం మృతదేహాలను గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్, పోలీసుల సమక్షంలో కుటుంబసభ్యులకు అప్పగించాలని సూచించింది. కేస్ డైరీ, లాగ్‌బుక్స్, వెపన్ ఎంట్రీలు, దిశ హత్యాచారం ఘటన నుంచి ఎన్‌కౌంటర్ జరిగే వరకు పోలీసుల కదలికల వివరాల రిపోర్టులు, ఎన్‌కౌంటర్‌లో వినియోగించిన ఆయుధాలను సీజ్‌చేయాలని రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఆదేశించింది. వీటిని సమగ్ర పరిశీలన కోసం సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపాలని తెలిపింది. కాల్ రికార్డులు, నిందితులను తీసుకెళ్లిన పోలీస్‌స్టేషన్ సీసీ టీవీ ఫుటేజి, సెల్‌టవర్ లొకేషన్ వివరాలను కూడా సేకరించాలని సిట్‌ను ఆదేశించింది. ఇతర ఆధారాలను సేకరించి సుప్రీంకోర్టు నియమించిన త్రిసభ్య కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించింది.

## ఇక్కడివారితోనే చేయించాలి: ఏజీ

**రీపోస్ట్‌మార్టం** చేయడానికి రాష్ట్రప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని.. కానీ, ఇది రాష్ట్రానికి చెందిన నిపుణులతో జరుగాలని అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ కోరారు. బయటి నిపుణులతో చేయిస్తే రాష్ట్రానికి చెందిన నిపుణుల సామర్థ్యంపై అనుమానం వస్తుందన్నారు. దీనిపై అమికస్ క్యూరీ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి స్పందిస్తూ ప్రస్తుత అంశం సామర్థ్యం, నైపుణ్యానికి సంబంధించిన అంశం కాదని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు న్యాయవాది వృందా గ్రోవర్ తన వాదనలు వినిపిస్తూ ఆధారాల సేకరణ అంటే కేవలం మృతదేహాల నుంచి సేకరించే ఆధారాలు మాత్రమే కాదని, ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన అన్నింటికీ వర్తిస్తుందని అన్నారు.

# బతుకమ్మ చీరెల తయారీకి సన్నాహాలు

- యజమానులు, ఆసాముల సమావేశంలో చేనేత జౌళిశాఖ డైరెక్టర్ శైలజారామయ్యర్



శైలజారామయ్యర్

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** బతుకమ్మ చీరెల తయారీని పనులు ఈ నెలలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు చేనేత జౌళిశాఖ డైరెక్టర్ శైలజారామయ్యర్ చెప్పారు. చీరెల ఆర్డర్లు మళ్లీ సిరిసిల్ల కార్మికులకే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈసారి సిల్వర్, గోల్డ్ కలర్ జరీ అంచులతో చీరెలను రూపొందించనున్నట్టు పేర్కొన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరెలు, ఆర్వీఎం వస్త్ర ఉత్పత్తులపై మరమగ్గాల యజమానులు, ఆసాములతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బతుకమ్మ చీరెలను మరింత నాణ్యతతో తయారుచేయనున్నట్టు చెప్పారు. కార్మికులకు నెల వేతనం రూ.15 వేల నుంచి రూ.20 వేలకు పెరిగేలా సర్కారు చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. బోనస్‌గా యార్న్ సబ్సిడీ పది శాతం.. కార్మికులకే చెల్లిస్తుందన్నారు. కార్మికుల ఖాతాల్లోనే నేరుగా డబ్బు జమ చేయనున్నట్టు చెప్పారు.

# లైంగికదాడి.. ఇద్దరి అరెస్ట్



ఆంథోని జార్జి



విజయ్‌కుమార్

**గౌతంనగర్:** లైంగికదాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను మల్కాజ్‌గిరి పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్జాలగూడలో నివాసం ఉండే చిన్నప్ప ఆంథోని జార్జి (50), విజయ్‌కుమార్ (53) పెయింటర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 17వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో భిక్షాటన చేస్తున్న ఓ మహిళను (60) మద్యం తాగేందుకు రమ్మని పిలిచి ఆంథోని ఇంటికి తీసుకెళ్లారు. మోతాదు మించి మద్యం తాగిపించడంతో సదరు మహిళ అపస్మారకస్థితికి చేరుకొన్నది. ఆ సమయంలో ఆమెపై లైంగికదాడికి పాల్పడి తీవ్రంగా కొట్టారు. రక్షించాలంటూ సదరు మహిళ కేకలు వేయడంతో ఇరుగుపొరుగువారు వచ్చి ఆమెను రక్షించి డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. దాంతో మల్కాజ్‌గిరి పోలీస్‌స్టేషన్ పెట్రోలింగ్ ఇంచార్జి కే నర్సింహులు, డ్రైవర్ కానిస్టేబుల్ రాము సంఘటనాస్థలానికి చేరుకొని బాధితురాలిని గాంధీ దవాఖానకు తరలించి కేసు నమోదు చేశారు. నిందితులు ఆంథోని జార్జి, విజయ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# పిల్లలు ఏం తింటున్నారు?

మొదటిపేజీ తరువాయి...

తల్లిదండ్రులు వెనుకబడుతున్నారు. కావాల్సిన మోతాదులో, కావాల్సిన విధంగా బలమైన ఆహారాన్ని అందించలేకపోతున్నారు. పాలు, పండ్లు, తాజా కూరగాయలు, ఆకుకూరలను సరైన పద్ధతిలో తినిపించడంలేదని జాతీయ పోషకాహార సర్వే తెలిపింది. తెలంగాణలో కేవలం 3.6 శాతం మంది తల్లిదండ్రులే సరైన ఆహారాన్ని అందిస్తున్నారని వెల్లడయింది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మిజోరం వంటి రాష్ట్రాలు మనకంటే తక్కువగా కేవలం ఒకటి నుంచి రెండుశాతం లోపే ఉన్నాయి.

## పాలు కూడా ఇవ్వడం లేదు


పుట్టిన శిశువులకు చాలామంది తల్లులు పాలు కూడా ఇవ్వడంలేదు. ఈ విషయంలో మన రాష్ట్రం వెనుకబడింది. రెండేండ్ల నుంచి తొమ్మిదేండ్ల వయసు వరకు పిల్లలకు సరైన ఆహారం ఇవ్వడంలేదు. సరైన మోతాదులో పాలు, పాల సంబంధిత ఆహార పదార్థాలు తినిపించకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ విషయంలో తెలంగాణ దేశవ్యాప్తంగా 67.3 శాతంతో 23వ స్థానంలో నిలిచింది. అంటే మన రాష్ట్రంలో పిల్లలకు తల్లిపాలు పట్టడంలేదన్నమాట. అంతేకాదు.. ధాన్యం, కందమూలాలు, గింజలు, దుంపలు తినిపించడంలేదని సర్వే పేర్కొన్నది. కొన్ని రాష్ట్రాల్లో మాత్రం ఉదయంపూట ధాన్యం గింజలు, కందలు, దుంపలతో కూడిన ఆహారాన్ని ఇస్తున్నారు. మన రాష్ట్రంలో మాత్రం వాటిని చాలా తక్కువగా వాడుతున్నాం.

## చేపలపై అనాసక్తి

శరీరం పూర్తిస్థాయిలో ఎదగాలంటే మాంసకృత్తులు ఎంతో దోహదపడుతాయి. ఇందుకు అనుగుణంగా అన్నిరకాల మాంసాహారాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. తెలంగాణలో మాత్రం చికెన్, మటన్ తినేందుకే ఎక్కువగా ఆసక్తిచూపిస్తున్నారు. విటమిన్ ఏ, ఈ, డీ వంటి ముఖ్య పోషకాలు ఉండే చేపలను విస్మరిస్తున్నారు. చేపలంటేనే చులకనభావంతో చూస్తున్నారు. 19 ఏండ్ల వయసు వచ్చేవరకు పిల్లలకు చేపల రుచి చూపించడంలేదు. పిల్లల్లో పోషకాహార లోపానికి ఇది కూడా ఒక కారణమని జాతీయ పోషకాహార సర్వే తెలిపింది.

## మటన్‌లో మనమే మేటి

మటన్, చికెన్ తిండి తినడంలో తెలుగు రాష్ట్రాల పిల్లలను మించినవారు లేరని జాతీయ పోషకాహార సర్వే తెలిపింది. 19 ఏండ్ల చిన్నారుల్లో చికెన్, మటన్ వినియోగానికి సంబంధించి ఏపీ, తెలంగాణ అగ్రస్థానంలో నిలిచాయి. ఆకుకూరలు, పండ్లు, కూరగాయల అంశంలో వెనకబడిన రాష్ట్రాలు చికెన్, మటన్ వినియోగంలో మాత్రం ముందున్నాయి. ఐదేండ్ల నుంచి 19 ఏండ్ల వరకు మాంసాహారం ఎక్కువగా తీసుకుంటున్నారు. పదేపదే మటన్, చికెన్ తినడంతో ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని తేలింది.




## బిర్యానీ సమస్యలు

**ప్రతినెలలో** సగటున ఏడు రోజులు చికెన్, నాలుగైదుసార్లు మటన్ తినిపించడం చిన్నారుల ఆరోగ్యాలకు ప్రమాదకరంగా మారుతున్నట్లు విశ్లేషిస్తున్నారు. నాన్‌వెజ్ బిర్యానీలు చిన్నారుల శరీరాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తున్నాయని జాతీయ పోషకాహార సర్వే హెచ్చరించింది.

## అసలు వయసులోనే నిర్లక్ష్యం

రాష్ట్రంలో 2 నుంచి 19 ఏండ్ల లోపు చిన్నారులు ఎదుగుదల, విటమిన్ల లోపం, ఐరన్ లేకపోవడం వంటి సమస్యలతో ఉన్నట్లు జాతీయ స్థాయి సర్వేలో తేలింది. వీటన్నింటికీ ప్రధాన కారణం పోషకాహారం తీసుకోకపోవడమేనని గుర్తిస్తున్నారు. బాల్యం నుంచి కౌమారదశ వరకు ఎదుగుదల, బలం చాలా అవసరం. ఈ కౌమార దశలో తీసుకునే ఆహారం వల్లనే.. మిగిలిన జీవితంలో ఆరోగ్యంగా ఉంటామా.. లేదా అనేది నిర్ణయం అవుతుందని నిపుణులు అంటున్నారు. కానీ ఈ వయస్సుల్లోనే బలవర్ధకమైన ఆహారం విషయంలో తెలంగాణతోపాటు ఏపీ, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో కూడా తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రధానంగా ఎదిగే వయసులో ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, చేపలు వంటివి పిల్లలకు ఎక్కువగా పెట్టాల్సి ఉంటుందని ఆహార నిపుణులు పేర్కొంటున్నారు. కానీ, 10 నుంచి 19 ఏండ్ల లోపు వారు ఆకుకూరలు, పండ్లు ముట్టుకోవడం లేదు. ఈ వయస్సులో కూడా మాంసాహారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్లు సర్వేలో తేలింది. దీనివల్ల చిన్న వయస్సులోనే జబ్బులకు గురికావాల్సివస్తున్నది.

**దేశవ్యాప్తంగా ఒకటి నుంచి 19 ఏండ్ల మధ్య వయస్కుల ఆరోగ్య పరిస్థితి**

| అంశం | 1-4 ఏండ్లు | 5-9 ఏండ్లు | 10-19 ఏండ్లు |
|---|---|---|---|
| రక్తహీనత (బాలికలు) | 36.5 | 27.7 | 46 |
| రక్తహీనత (బాలురు) | 39.3 | 26.9 | 18.5 |
| ఇనుము లోపం | 33.4 | 22.7 | 26 |
| బీ విటమిన్ లోపం | 46.8 | 45.8 | 63.7 |
| బీ12 విటమిన్ లోపం | 12.4 | 13.2 | 29.1 |
| విటమిన్ డీ లోపం | 9.6 | 5.5 | 8.8 |
| విటమిన్ ఏ లోపం | 26.5 | 35 | 19.7 |
| జింక్ లోపం | 10.1 | 9.3 | 27.9 |
| అయోడిన్ లోపం (ప్రతి వెయ్యి మందిలో) | 299 | 290 | 254 |

# ఇదీ మన ఫుడ్

| తిండి రకాలు | టాప్ 6 రాష్ట్రాలు | 2-4 ఏండ్లు | | 5-9 ఏండ్లు | | 10-19 ఏండ్లు |
|---|---|---|---|---|---|---|
| ధాన్యాలు, దుంపలు | జార్ఖండ్ | 99.9 | రాజస్థాన్ | 100.0 | పంజాబ్ | 100 |
| | ఒడిశా | 99.3 | నాగాలాండ్ | 100.0 | ఉత్తరాఖండ్ | 100 |
| | ఛత్తీస్‌గఢ్ | 99.3 | ఒడిశా | 100.0 | హర్యానా | 100 |
| | హర్యానా | 98.5 | మధ్యప్రదేశ్ | 100.0 | నాగాలాండ్ | 100 |
| | బీహార్ | 98.4 | బీహార్ | 100.0 | బీహార్ | 99.9 |
| | తెలంగాణ | 89.6 | తెలంగాణ | 92.6 | తెలంగాణ | 91.3 |
| పాలు, పాల పదార్థాలు | పంజాబ్ | 91.9 | హర్యానా | 95.3 | హర్యానా | 94.8 |
| | హిమాచల్‌ప్రదేశ్ | 88.7 | రాజస్థాన్ | 89.7 | రాజస్థాన్ | 88.7 |
| | హర్యానా | 86.6 | తమిళనాడు | 89.7 | తమిళనాడు | 87.5 |
| | ఢిల్లీ | 86.4 | గుజరాత్ | 87.4 | ఢిల్లీ | 87.1 |
| | సిక్కిం | 84.3 | ఢిల్లీ | 85.7 | జమ్ముకశ్మీర్ | 86.3 |
| | తెలంగాణ | 67.3 | తెలంగాణ | 78.6 | తెలంగాణ | 70.4 |
| మాంసాహారం (చికెన్, మాంసం) | మేఘాలయ | 77.2 | ఆంధ్రప్రదేశ్ | 74.7 | ఆంధ్రప్రదేశ్ | 75.3 |
| | మణిపూర్ | 64.7 | తెలంగాణ | 62.1 | తమిళనాడు | 68.3 |
| | అరుణాచల్‌ప్రదేశ్ | 62.0 | తమిళనాడు | 61.1 | త్రిపుర | 63.8 |
| | సిక్కిం | 59.2 | అసోం | 59.9 | తెలంగాణ | 63.5 |
| | జమ్ముకశ్మీర్ | 51.7 | జమ్ముకశ్మీర్ | 51.9 | జమ్ముకశ్మీర్ | 55.8 |
| | తెలంగాణ | 13.7 | త్రిపుర | 49.0 | అసోం | 54.9 |
| విటమిన్ ఏ కూరగాయలు | మేఘాలయ | 93.6 | తెలంగాణ | 91.4 | మధ్యప్రదేశ్ | 92.6 |
| | సిక్కిం | 86.1 | తమిళనాడు | 91.3 | ఉత్తరాఖండ్ | 90.1 |
| | మిజోరం | 83.4 | ఒడిశా | 88.1 | జార్ఖండ్ | 90.1 |
| | అరుణాచల్‌ప్రదేశ్ | 83.1 | కేరళ | 86.0 | తమిళనాడు | 86.7 |
| | మణిపూర్ | 79.4 | ఆంధ్రప్రదేశ్ | 85.4 | వెస్ట్ బెంగాల్ | 86.0 |
| | తెలంగాణ | 30.4 | కర్ణాటక | 84.1 | తెలంగాణ | 56.1 |
| పండ్లు, తాజా కూరగాయలు (ఆకు కూరలు) | కేరళ | 77.3 | మహారాష్ట్ర | 91.3 | మేఘాలయ | 92.5 |
| | మేఘాలయ | 67.1 | కర్ణాటక | 88.7 | మణిపూర్ | 92.3 |
| | పంజాబ్ | 71.5 | ఒడిశా | 87.4 | జమ్ముకశ్మీర్ | 89.4 |
| | సిక్కిం | 64,4 | జమ్ముకశ్మీర్ | 85.6 | ఒడిశా | 88.9 |
| | హిమాచల్‌ప్రదేశ్ | 62,4 | ఉత్తరాఖండ్ | 83.8 | ఆంధ్రప్రదేశ్ | 86.7 |
| | తెలంగాణ | 31.6 | తెలంగాణ | 74.2 | తెలంగాణ | 75.2 |
| కోడిగుడ్లు | మేఘాలయ | 70.5 | తమిళనాడు | 84.6 | ఆంధ్రప్రదేశ్ | 83.3 |
| | కేరళ | 47.0 | ఆంధ్రప్రదేశ్ | 83.2 | తమిళనాడు | 80.5 |
| | తమిళనాడు | 45.1 | తెలంగాణ | 75.3 | గోవా | 74.7 |
| | జమ్ముకశ్మీర్ | 45.0 | గోవా | 75.1 | త్రిపుర | 74.4 |
| | సిక్కిం | 43.4 | కేరళ | 72.8 | తెలంగాణ | 72.4 |
| | తెలంగాణ | 20.7 | ఒడిశా | 68.6 | ఒడిశా | 64.5 |
| పప్పుధాన్యాలు, చిక్కుళ్లు, గింజలు | ఒడిశా | 69.2 | తమిళనాడు | 96.1 | తమిళనాడు | 96.3 |
| | అసోం | 59.3 | ఒడిశా | 95.0 | ఆంధ్రప్రదేశ్ | 94.7 |
| | సిక్కిం | 53.5 | మహారాష్ట్ర | 94.3 | మేఘాలయ | 94.4 |
| | కేరళ | 53.6 | తెలంగాణ | 94.3 | ఢిల్లీ | 93.9 |
| | మేఘాలయ | 50.6 | ఉత్తరప్రదేశ్ | 94.2 | తెలంగాణ | 90.8 |
| చేపలు | | | కేరళ | 79.9 | గోవా | 80.8 |
| | | | గోవా | 79.8 | త్రిపుర | 80.1 |
| | | | అసోం | 76.9 | అసోం | 76.0 |
| | | | వెస్ట్ బెంగాల్ | 62.2 | కేరళ | 70.2 |
| | | | త్రిపుర | 61.4 | తమిళనాడు | 61.3 |
| | | | తెలంగాణ | 19.3 | తెలంగాణ | 18.8 |

**5 ఏండ్లలోపు చిన్నారులకు సంబంధించిన శారీరక స్థితి**

| శారీరక స్థితి | బాలురు | బాలికలు | గ్రామీణ | పట్టణం | మొత్తం |
|---|---|---|---|---|---|
| ఎదుగుదల లోపం | 28.1 | 30.1 | 15.7 | 38.2 | 29.3 |
| తీవ్ర ఎదుగుదలలోపం | 10.1 | 7.3 | 4.6 | 11.5 | 8.7 |
| ఎత్తుకు తగ్గ బరువులేకపోవడం | 19.7 | 16 | 17.8 | 18 | 17.9 |
| తీవ్రంగా బరువులోపం | 5.9 | 5.3 | 5.1 | 5.9 | 5.6 |


## ఐదేండ్లకే అధిక బరువు

జంక్‌ఫుడ్ ఎక్కువగా తినిపించడం, అసలైన పౌష్టికాహారాన్ని తినిపించకపోవడం వల్ల పిల్లలు ఐదేండ్లకే మోయలేని బరువును మోస్తున్నారు. ఐదేండ్ల వయస్సుల్లోనే 50 కిలోలకు పైగా బరువుండే పిల్లలు దేశంలో 39 శాతం ఉండగా.. తెలంగాణలో 20 శాతానికిపైగా ఉన్నట్లు సర్వేలో వెల్లడయింది. ఊబకాయం సమస్యలతో చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆడపిల్లల్లోనూ అధికబరువు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నది. దేశవ్యాప్తంగా 4.8%.. 10-19 ఏండ్ల మధ్య వయసున్న ఆడపిల్లలు అధిక బరువు సమస్యను ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 5.7 శాతంగా అధికబరువు సమస్య ఆడపిల్లల్లో కనిపిస్తున్నది.

**5-9 ఏండ్లలోపువారిలో ఊబకాయం**

| బాలురు | బాలికలు | పట్టణ | గ్రామీణ | మొత్తం |
|---|---|---|---|---|
| 5.5 | 4.2 | 11 | 1.5 | 4.9 |

## ముహూర్తం



సూర్యోదయం: 6.45 గంటలకు



సూర్యాస్తమయం: 5.38 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, కృష్ణపక్షం ఏకాదశి మధ్యాహ్నం 3.22 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: స్వాతి సాయంత్రం 6.38 వరకు, తదుపరి విశాఖ, అమృతఘడియలు: ఉదయం 10.16 నుంచి 11.48 వరకు, రాహుకాలం: సాయంత్రం 4.17 నుంచి 5.38 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.11 నుంచి 4.55 వరకు, వర్జ్యం: సోమవారం అర్ధరాత్రి 12.01 నుంచి 1.33 వరకు.

## లోకం పోకడ



మీరు వచ్చి చచ్చినా సరే.. చచ్చి వచ్చినా సరే.. మీ ఇష్టం!



శనివారం రాత్రి హెచ్ఐసీసీలో నిర్వహించిన 'టీవీ9 నవ నక్షత్ర సన్మానం' కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో కళాతపస్వి కే విశ్వనాథ్, హీరో చిరంజీవి, మై హోమ్స్ అధినేత, టీటీడీ బోర్డు సభ్యుడు జూపల్లి రామేశ్వరరావు కూడా ఉన్నారు. సీఎం కేసీఆర్ నుంచి అవార్డులు అందుకొంటున్న ఎల్వీ ప్రసాద్ నేత్రవైద్యశాల వ్యవస్థాపకులు డాక్టర్ జీ నాగేశ్వర్‌రావు, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, సినీ నటి సమంత, హీరో విజయ్ దేవరకొండ.. వ్యాపారవేత్త శ్రీకాంత్‌ను అభినందిస్తున్న సీఎం కేసీఆర్. డీఆర్డీవో చీఫ్ సతీశ్‌రెడ్డికి అవార్డు అందజేస్తున్న మంత్రులు జీ జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్

# సినిమా హబ్‌గా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి...

ఉపయోగపడేవిధంగా సినిమాలు తీయాలని కోరారు. హైదరాబాద్ రామోజీ ఫిల్మ్‌సిటీ ఏర్పాటైన తర్వాత సినీ పరిశ్రమ వృద్ధిలోకి వచ్చిందన్నారు. దేశంలో సంపద ఎట్లా పెరుగుతున్నదో అశ్లీలత కూడా అంతేస్థాయిలో పెరుగుతున్నదని.. ఈ పరిణామాన్ని నిరోధించడానికి మీడియా సహకరించాలని కోరారు. న్యూస్ పేపర్స్ న్యూస్ పేపర్లుగానే ఉండాలి తప్ప వ్యూస్ పేపర్లుగా మారొద్దని, అది సమాజానికి మంచిది కాదని సీఎం అన్నారు. సమాజంలో గుర్తింపు లేకుండా ఉన్నవాళ్లను మీడియా వెలుగులోకి తీసుకురావాలని కోరారు. సమాజంలో మంచి కంటే చెడు ఎక్కువగా ఉంటుందని, మంచిని ప్రోత్సహించేందుకు మీడియా అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రజాప్రతినిధులుగా తాము ప్రజాసేవలో ఎప్పుడూ బిజీగా ఉంటామని, ఇలాంటి ఆహ్లాదకరమైన కార్యక్రమంలో పాలుపంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. వెలుగులోకి రానటువంటి గొప్ప వ్యక్తులను గుర్తించి వారికి అవార్డులు ఇచ్చి ప్రోత్సహించే కార్యక్రమానికి టీవీ9 శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. సంచలనాలవైపు వెళ్ళకుండా సామాజిక కోణంలో మీడియా పనిచేయాలని ఆయన హితవు పలికారు. ఎర్రవెల్లిలో జరిగిన సంఘటన ఆధారంగా కంటివెలుగు కార్యక్రమాన్ని తీసుకువచ్చి లక్షలమందికి చికిత్సలు చేయడమే కాకుండా కంటి అద్దాలు అందజేస్తే.. అలాంటి మంచి కార్యక్రమాలను కూడా మీడియా వక్రీకరించిందని సీఎం గుర్తుచేశారు. మీడియా మంచిని ప్రోత్సహించాలన్నారు. 17 ఏండ్లుగా టీవీ9 తెలుగువారి అభ్యున్నతికోసం కృషిచేస్తున్నదని అభినందించారు. ఆధ్యాత్మికత, మహిళలను ప్రోత్సహించే విధంగా కార్యక్రమాలను చేపట్టాలని, మంచిని మరింత ముందుకు తీసుకెళ్ళాలని సూచించారు. అనంతరం సీఎం కేసీఆర్ సినీ దర్శకుడు కే విశ్వనాథ్‌కు జీవన సాఫల్య పురస్కారం అందజేసి ఘనంగా సన్మానించారు. సినీ హీరో విజయ్‌దేవరకొండ, హీరోయిన్ సమంతను ముఖ్యమంత్రి సన్మానించారు. తొమ్మిది క్యాటగిరీలకు సంబంధించిన అవార్డులు అందుకున్న పోలీస్‌అధికారి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, వ్యాపారవేత్త శ్రీకాంత్ బొల్లా, సామాజిక సేవకులు మీరా సనాయి, డీఆర్డీవో చీఫ్ సతీశ్‌రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త రామాంజనేయులు, ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వ్యవస్థాపకులు గుళ్లపల్లి నాగేశ్వర్‌రావు, క్రీడాకారిణి పీవీ సింధు, మెదక్‌జిల్లా మూసాయిపేట రైలు ప్రమాదం నుంచి విద్యార్థులను కాపాడిన రుచితగౌడ్, పలువురు సినిమా నటులు, వారితోపాటు టీవీ9 యాజమాన్యం తరఫున జూపల్లి రామేశ్వర్‌రావును సీఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఈటల రాజేందర్, శ్రీనివాసగౌడ్, కొప్పుల ఈశ్వర్, మల్లారెడ్డి, సబితాఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ప్రముఖ సినీ నటులు చిరంజీవి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



రుచితగౌడ్‌ను సత్కరిస్తున్న మంత్రులు మల్లారెడ్డి, సత్యవతి రాథోడ్.. సామాజిక సేవకురాలు మీరా సనాయికి అవార్డు అందజేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సినీ నిర్మాత దిల్‌రాజ్.. వ్యవసాయ శాస్త్రవేత్త జీవీ రామాంజనేయులుకు అవార్డు అందజేస్తున్న మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

# మహిళలకు పెద్దపీట

- మహిళా సదస్సులో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- మహిళకే మేయర్ పదవి: మంత్రి మల్లారెడ్డి

**బోడుప్పల్:** ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మహిళలకు అన్నిరంగాల్లో సముచితస్థానం దక్కుతున్నదని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. వీహబ్ ద్వారా త్వరలో 7,500 మంది మహిళలు వ్యాపారవేత్తలుగా మారబోతున్నారని, ఇందుకోసం రాష్ట్ర ప్రభు త్వం రూ.కోట్లు వెచ్చించిందని తెలిపారు. మాజీ జెడ్పీటీసీ మంద సంజీవరెడ్డి అధ్యక్షతన శనివారం బోడుప్పల్‌లోని ఎస్‌ఎస్‌ఎస్ గార్డెన్‌లో జరిగిన మహిళా సదస్సుకు మంత్రి సబితతోపాటు కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సబిత మాట్లాడుతూ.. మహిళల కోసం టీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను కూడా డ్వాక్రా మహిళలకే అప్పజెప్పేందుకు సీఎం కేసీఆర్ త్వరలో నిర్ణయం తీసుకోనున్నారని చెప్పారు. 'దిశ' ఘటనను మంత్రి సబిత ప్రస్తావిస్తూ.. మార్పు మన ఇంటినుంచే మొదలవ్వాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను సభ్యత, సం స్కారం, క్రమశిక్షణతో పెంచినప్పుడు ఇలాంటి దారుణాలు జరుగవన్నారు. అన్నివర్గాల ప్రజలకు సముచితస్థానం కల్పిస్తున్న టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అభివృద్ధి, ప్రజాసంక్షేమం రెండు కండ్లని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మహిళలకు సీఎం కేసీఆర్ అన్నిరంగాల్లో ప్రత్యేకస్థానం కల్పిస్తున్నారని, మేయర్ పదవిని కూడా మహిళకే ఇచ్చి గౌరవించుకొందామన్నారు. సదస్సులో మాజీ జెడ్పీటీసీ మంద సంజీవరెడ్డి, బీఎంసీడబ్ల్యూఏఎఫ్ చైర్మన్ రాపోలు రాములు, పట్టణ టీఆర్‌ఎస్ అధ్యక్షుడు చెర్ల ఆంజనేయులు, సుదర్శన్‌రెడ్డి, గోరంట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బోడుప్పల్‌లోని మహిళా సదస్సులో మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి. చిత్రంలో మంత్రి మల్లారెడ్డి ఉన్నారు.

## ఉపకారవేతనాలకు దరఖాస్తు చేయండి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న కార్మికులు, వారి పిల్లలకు ఉపకారవేతనాలు అందజేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్టు తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతిభ ఆధారంగా ఉపకారవేతనాలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నది. దరఖాస్తులు సహాయ కార్మిక కమిషన్ కార్యాలయంలో పొందవచ్చునని, వీటిని వచ్చే ఏడాది ఫిబ్రవరి 15వ తేదీలోపు కార్మికశాఖ కార్యాలయంలో సమర్పించాలని వెల్లడించింది. ఎంపికైనవారికి మేడేనాటికి వారి బ్యాంక్ ఖాతాల్లో ఉపకారవేతనాలనుజ మచేస్తారనిపేరొ ్కన్నది.

## వొకేషనల్ కోర్సులకు నోటిఫికేషన్ జారీ

దరఖాస్తుల స్వీకరణకు గడువు జనవరి 17

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో 2020-21 విద్యాసంవత్సరానికి సంబంధించిన స్వల్పకాలిక వొకేషనల్ కోర్సులు (ఫటాఫట్ నౌకరీ కోర్సులు) అందించడానికి ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ చర్యలు తీసుకొన్నారు. దరఖాస్తులు కోరుతూ శనివారం స్పెల్-1 కింద ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ సయ్యద్ ఒమర్ జలీల్ నోటిఫికేషన్ జారీచేశారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ప్రక్రియ ఈ నెల 23 నుంచి ప్రారంభం అవుతుందని, జనవరి 17 వరకు దరఖాస్తు చేయవచ్చన్నారు. పూర్తి వివరాల కోసం www.sive.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలనితెలిపా రు.

**మార్చి 27, 28న పరీక్షలు**

స్వల్పకాలిక వొకేషనల్ కోర్సుల తరగతులు ఈ నెల 23 నుంచి మార్చి 23 వరకు కొనసాగుతాయి. ఈ కోర్సుల పరీక్షలను మార్చి 27, 28 తేదీల్లో నిర్వహిస్తారు.

# పుస్తకం పిలుస్తున్నది



హైదరాబాద్‌లోని తెలంగాణ కళా భారతి వద్ద 33వ పుస్తక ప్రదర్శన కోసం శనివారం షెడ్లు ఏర్పాటుచేస్తున్న దృశ్యం

మొదటిపేజీ తరువాయి...

ఎదుర్కొనే గుండెధైర్యం కలుగుతుంది. ఇప్పుడు విద్యార్థులు పాఠ్యపుస్తకాలు తప్ప వేరే పుస్తకాలను ముట్టుకోవడంలేదు. వారి వ్యక్తిత్వాన్ని వికసింపజేసే పుస్తకాలను చదువటంలేదు. ర్యాంకులు, ఉద్యోగాలు, సంపాదన కోసం చేసే పోరాటంలో పుస్తకాలు దూరమయ్యాయి. దీనివల్ల చిన్న సమస్యలకే కుంగిపోతున్నారని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. పుస్తకాలను బహుమతులుగా ఇచ్చే సంస్కృతిని పెంపొందించాలని పుస్తక ప్రదర్శన నిర్వాహకులు కోరుతున్నారు. దీన్నొక సంప్రదాయంగా మలచాలని సూచిస్తున్నారు. చిన్నారులు విజయాలు సాధించినపుడు వారిని అభినందిస్తూ పుస్తకాలు అందజేయాలని, అలా చిన్నతనం నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేయాలని సూచిస్తున్నారు.

## వచ్చే ఏడాది రెండువేల ప్రదర్శనలు



జాతీయ పుస్తక ప్రదర్శనను గ్రామ స్థాయిలో తీసుకువెళ్లేందుకు కృషిచేస్తున్నాం. వచ్చేఏడాది రాష్ట్రవ్యాప్తంగా రెండువేల పుస్తక ప్రదర్శనలు నిర్వహిస్తాం. పోలీస్‌స్టేషన్లు, గ్రామ పంచాయతీలు, పాఠశాలల నుంచి అన్ని గ్రామాల వరకు ఈ ప్రదర్శనలు తీసుకుపోవాలన్నదే మా లక్ష్యం. విద్యాసంస్థల్లో పుస్తకాలు చదివే పీరియడ్ ప్రారంభించి సమీక్షలు రాయించడం చిన్నప్పటినుంచే అలవాటుచేయాలి. పుస్తకాలు అధ్యయనంచేయడం వల్ల ఉత్తమపౌరులు తయారవుతారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పుస్తకాలంటే ఎంతో ఇష్టం. పఠనాసక్తి, అధ్యయనంచేసే శక్తి ఆయనకున్న బలం. వేల సంఖ్యలో పుస్తకాలను చదివారు. తెలంగాణ రాష్ట్రసాధనకు బాట వేయడంలో ఆ పుస్తకాలు జీవధారగా ఉపయోగపడ్డాయి. ప్రజాఉద్యమాన్ని మలిచి తలవంచకుండా, తలదించకుండా ముందుకుసాగారు. 'పుస్తకాలు ఏమి చేస్తాయంటే.. ఒక రాష్ట్రాన్ని కూడా తీసుకువస్తాయంటాను. ఉమ్మడి ఏపీలో బుక్ ఫెయిర్స్‌కి నాటి ప్రభుత్వాలు అంతగా సహకరించలేదు. కాని ముఖ్యమంత్రి కేసీఆర్ సంపూర్ణ సహకారాలు అందిస్తున్నారు. ఎన్టీఆర్ స్టేడియం (తెలంగాణ కళాభారతి)ని ప్రదర్శనకు ఉచితంగా ఇస్తున్నారు. సాంస్కృతికశాఖ నుంచి ఆర్థికసాయం అందిస్తున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, కన్నడ, మలయాళం, తమిళం, ఉర్దూ, బెంగాలీ.. తదితర అన్ని భాషలకు సంబంధించిన పుస్తకాలతో 33వ జాతీయ పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నాం.

- జూలూరు గౌరీశంకర్, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు



అచ్చంపేటలోని దవాఖానలో విచారణ చేస్తున్న జేడీ బృందం.. బాధితురాలు స్వాతి

# పిండానికి అసైటీస్!

- ఐదో నెలలోనే తొలగించాలని సూచించిన రెయిన్‌బో
- ప్రసవ సమయంలో వైద్యులకు వాస్తవాలు చెప్పని బంధువులు!
- నిలకడగానే బాధితురాలు స్వాతి ఆరోగ్యం
- అచ్చంపేట ఘటనపై ఉన్నతాధికారుల విచారణ
- ఐయూడీ కేసుల్లో ఇలాంటి ఘటనలు: వీవీపీ కమిషనర్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/చార్మినార్:** అచ్చంపేట దవాఖానలో పిండం తల ఊడిపోయిన ఘటనలో కొత్త కోణాలు వెలుగుచూస్తున్నాయి. గర్భిణి స్వాతి కడుపులో పిండానికి 'అసైటీస్' ఉన్నట్టు ఐదో నెలలోనే రెయిన్‌బో దవాఖాన వైద్యులు గుర్తించి పిండాన్ని తొలగించాలని సూచించినట్టు తెలిసింది. కానీ ఈ విషయాన్ని బంధువులు సీరియస్‌గా తీసుకోకుండా ప్రసవ సమయంలోనూ వైద్యులకు వాస్తవాలను చెప్పకుండా దాచి ఉంచినట్టు సమాచారం. ఐదో నెలలోనే పిండాన్ని తొలగించినట్టయితే ప్రస్తుత సమస్య వచ్చేది కాదని నిపుణులు అంటున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని పేట్లబుర్జు దవాఖాన చికిత్స పొందుతున్న బాధితురాలు స్వాతి ఆరోగ్యం నిలకడగానే ఉన్నదని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న దవాఖాన సూపరింటెండెంట్ సహా వైద్యురాలిని సస్పెండ్‌చేసిన విషయం తెలిసిందే. కాగా, ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ నిర్వహించారు. బాధిత కుటుంబం, వైద్యుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట్ మండలం నడింపల్లికి చెందిన సాయిబాబు భార్య స్వాతి 35 వారాల గర్భిణి. ఈ నెల 18న పురుటి నొప్పులు రావడంతో అచ్చంపేట దవాఖానలో చేర్పించారు. శుక్రవారం నొప్పులు అధికమవడంతో వైద్యులు ప్రసవం కోసం లేబర్ రూంకు తీసుకెళ్లారు. వైద్యులు స్కానింగ్ రిపోర్ట్‌లు అడుగగా తమ వద్ద లేవని బంధువులు చెప్పారు. ఎమర్జెన్సీ కేసు కావడంతో కాన్పు కోసం ప్రయత్నిస్తుండగా శిశువు తల భాగం శరీరం నుంచి విడిపోయి బయటకు వచ్చింది. దీంతో షాక్ తిన్న వైద్యులు తల్లి ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశంతో బాధితురాలిని వెంటనే హైదరాబాద్‌లోని పేట్లబుర్జు ప్రసూతి దవాఖానకు తరలించారు. పరీక్షించిన పేట్లబుర్జు వైద్యులు అత్యవసర చికిత్సకు ఏర్పాట్లుచేశారు. అప్పటికే గర్భంలో ఉన్న శిశువు మృతి చెంది తల లేకుండానే భుజంతోపాటు రెండు చేతులు బయటకు వచ్చి ఉండటం, బాధితురాలు హై డీహైడ్రేషన్ పరిస్థితిలోకి చేరుకోవడంతో విషయాన్ని స్వాతి బంధువులకు చెప్పారు. స్వాతి ప్రాణాలు కాపాడేందుకు డాక్టర్ సంగీత శస్త్రచికిత్స ద్వారా గర్భంలోని మృత శిశువును తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నదని, క్రమంగా కోలుకుంటున్నట్టు దవాఖాన ఆర్‌ఎంవో డాక్టర్ స్వరూప తెలిపారు. ముందస్తు వైద్య పరీక్షలతోపాటు తగిన జాగ్రత్తలపై అవగాహన లేకపోవడం వల్లే స్వాతికి 35వ వారంలో పురిటి నొప్పులు వచ్చి ఉంటాయన్నారు.

### ఐదో నెలలోనే గుర్తింపు!

ఐదో నెలలో స్వాతి స్కానింగ్ కోసం సెప్టెంబర్ 16న హైదరాబాద్‌లోని రెయిన్‌బో బర్త్‌రైట్ దవాఖానకు బంధువులు తీసుకెళ్లినప్పుడు పిండంలోకి నీరు చేరి 'అసైటీస్'కు గురైందని, కాబట్టి గర్భం తొలగించడం అవసరమని వైద్యులు సూచించినట్టు తెలిసింది. అసైటీస్ వల్ల పిండం అధిక బరువుతోపాటు అబ్‌నార్మల్‌గా ఉన్నదని స్కానింగ్ రిపోర్ట్‌లో బయటపడినట్టు సమాచారం. దీనిని పరిశీలించిన వైద్యులు వెంటనే పిండాన్ని తొలగించాలని, లేనిపక్షంలో తల్లిప్రాణానికి కూడా ప్రమాదమని హెచ్చరించినప్పటికీ స్వాతి కుటుంబసభ్యులు పట్టించుకోలేదు. 8వ నెలలో (గత నెల 18న) అచ్చంపేటలోని సాధిక స్కానింగ్ సెంటర్‌లో కూడా స్కానింగ్ చేయించినా ఇదే విషయం తేలినప్పటికీ సీరియస్‌గా తీసుకోలేదు. ఈ ఘటనపై అనుమానం వచ్చిన పేట్లబుర్జ్ వైద్యులు స్వాతి స్కానింగ్ రిపోర్టులపై గట్టిగా ప్రశ్నించడంతో అసలు విషయం బయటపడింది. ఐయూడీ (గర్భంలో పిండం మృతి చెందడం) కేసుల్లో శిశువు శరీరభాగాలు మెత్తబడుతాయని వీవీపీ కమిషనర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి తెలిపారు. ఇలాంటి సందర్భాల్లో మృతశిశువు శరీర భాగాలను పట్టుకొని లాగినప్పుడు అవి శరీరం నుంచి విడిపోతాయన్నారు. అచ్చంపేట ఘటనలో ఇదే జరిగి ఉండవచ్చన్నారు. ఈ ఘటనలో అచ్చంపేట దవాఖాన సూపరింటెండెంట్ తారాసింగ్, డాక్టర్ సుధారాణిని సస్పెండ్ చేసినట్టు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాస్‌రావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### ఘటనపై విచారణ

**అచ్చంపేట, నమస్తే తెలంగాణ:** అచ్చంపేట ఘటనపై శనివారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు విచారణచేశారు. వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జాయింట్ డైరెక్టర్ పద్మజ, గైనకాలజిస్ట్ ప్రొఫెసర్లు మాలతి, మాధవితో కూడిన బృందం విచారణ నిర్వహించింది. దవాఖాన సిబ్బంది, స్టాఫ్ నర్సు, డాక్టర్లు, ఏఎన్‌ఎంల నుంచి వివరాలు సేకరించారు. బాధిత కుటుంబసభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నది. గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్త, ఆశ కార్యకర్తలను విచారించింది. గర్భిణి తొమ్మిది నెలల్లో పరీక్షలు చేయించుకున్న రికార్డులు, కేసీఆర్ కిట్ నమోదుచేసిన వివరాలపై ఆరా తీసింది. నివేదికను రాష్ట్ర కమిషనర్‌కు అందించనున్నట్టు బృందం సభ్యులు తెలిపారు.

## సెలవుల మంజూరు అధికారం హెచ్‌ఎంలకే

- పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు
- ఉపాధ్యాయసంఘాల హర్షం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకే సెలవులు మంజూరుచేసే అధికారం కల్పిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు వెంటనే చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ జిల్లా విద్యాధికారులకు ఆదేశాలు జారీచేశారు. టీచర్లకు సెలవులు మంజూరు చేసే అధికారాన్ని స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు ఇస్తూ గత వారంలో జీవో జారీచేశారు. దీనివల్ల క్షేత్ర స్థాయిలో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో తాజాగా విద్యాశాఖ సవరణ ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ నిర్ణయంపై పీఆర్టీయూ టీఎస్ నాయకులు శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు, పీఆర్టీయూ నాయకులు మారెడ్డి అంజిరెడ్డి, చెన్నయ్య, తెలంగాణప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు హనుమంతరావు, సురేశ్ హర్షం వ్యక్తంచేశారు.

# హైదరాబాద్ మెట్రో ప్రపంచంలోనే బెస్ట్

ఎల్‌అండ్‌టీ జీఎం ఎంవై కొండలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ప్రపంచంలోని మెట్రోరైల్ ప్రాజెక్టులన్నింటిలో హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్టు అత్యుత్తమమైనదని ఎల్‌అండ్‌టీ మెట్రోరైలు ఆర్వోబీ అండ్ వయాడక్ట్ హెడ్, జనరల్ మేనేజర్ ఎంవై కొండలు స్పష్టంచేశారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన గొప్ప ప్రాజెక్ట్ అని అభివర్ణించారు. పీపీపీ పద్ధతిలో నిర్మించడమంటే పెద్ద సవాల్ వంటిదని, ఎల్ అండ్‌టీ సంస్థ కాకుండా మరే ఇతరసంస్థ ఇంత పెద్ద ప్రాజెక్టును చేపట్టలేదని చెప్పారు. ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్‌లో డాక్టర్ ఏ రామకృష్ణ స్మారకోపన్యాసం సందర్భంగా 'ఓవర్‌వ్యూ ఆఫ్ హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్టు కన్‌స్ట్రక్షన్' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ.. జేబీఎస్- ఎంజీబీఎస్ కారిడార్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, సంక్రాంతి తర్వాత ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. మెట్రోరైల్ నిర్మాణం వందేండ్లకుపైగా ఎలాంటి ఢోకాలేకుండా ఉంటుందని అన్నారు. రామకృష్ణ వంటి వ్యక్తి యుగానికొకరు పుడతారని, హైటెక్‌సిటీ ఆయన ఇంజినీరింగ్ ప్రతిభకు నిదర్శనమని, దానిచుట్టూ నెక్లెస్‌లా నిర్మించిన మెట్రో రైల్ నిర్మాణం కూడా ఆయన ఆలోచనలకు ప్రతిరూపం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్ డాక్టర్ జీ రామేశ్వర్‌రావు, కార్యదర్శి ఇంజినీర్ టీ అంజయ్య, సంయుక్త కార్యదర్శి ప్రొఫెసర్ రమణనాయక్ బానోతు తదితరులు పాల్గొన్నారు.

## హరితహారానికి రెండు కోట్ల పెద్దమొక్కలు

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వచ్చే వానాకాలంలో ప్రారంభం కానున్న తెలంగాణకు హరితహారం కార్యక్రమంకోసం ప్రతి గ్రామంలో ఒక నర్సరీని ఏర్పాటుచేయడానికి యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లుచేయాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి అధికారులను ఆదేశించారు. హరితహారం కోసం కనీసం రెండు కోట్ల పెద్దమొక్కలను సిద్ధం చేయాలని చెప్పారు. త్వరలో రెండో విడుత 'పచ్చదనం-పరిశుభ్రత' ప్రారంభం కానున్న క్ర మంలో హరితహారం పర్యవేక్షణ, సమన్వయ కమిటీ సమావేశాన్ని శనివారం అరణ్యభవన్‌లో నిర్వహించారు. ఇందులో పీసీసీఎఫ్ ఆర్ శోభ, ముఖ్యమంత్రి ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, పురపాలకశాఖ ఉన్నతాధికారి టీకే శ్రీదేవి, అదనపు పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియాల్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో ఒక నర్సరీని ఏర్పాటుచేయాలని రాజేశ్వర్ తివారి ఆదేశించారు.

# కాళేశ్వరం ఇంజినీర్లకు పదోన్నతులు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని లింక్-1, లింక్-2 నిర్మాణ పనులను పూర్తిచేయడంలో ప్రతిభ కనబర్చిన ఐదుగురు ఇంజినీర్లకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. లింక్-1లోని లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్, పంపుహౌస్ నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు కృషిచేసిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ రమణరెడ్డితోపాటు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం రాజుకు, నంది, గాయత్రీ పంపుహౌస్‌లను విజయవంతంగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషిచేసిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూనె శ్రీధర్‌కు, సరస్వతి (అన్నారం) బరాజ్ నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు కృషిచేసిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ యాదగిరికి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీ రవిచంద్రకు పదోన్నతులు (ఆక్సిలరేటెడ్) కల్పించారు. కొన్ని కారణాల వల్ల నీటిపారుదలశాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మొదలుకొని ఇంజినీర్-ఇన్-చీఫ్ వరకు పదోన్నతుల ప్రక్రియ చాలాకాలం నుంచి పెండింగ్‌లో ఉన్నదని, దీంతో తాత్కాలిక ప్రాతిపదికన షరతులకు లోబడి ఐదుగురు ఇంజినీర్లకు ఇంచార్జీలుగా పదోన్నతులు కల్పిస్తున్నామని, వీరికి ప్రస్తుతమున్న పే-స్కేల్లే కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టంచేసింది.

నమస్తే తెలంగాణ
కరీంనగర్
ఆదివారం 22 డిసెంబర్ 2019
WWW.NTNEWS.COM

# భారత ప్రతిష్ఠకే దెబ్బ

విశ్లేషణ



మాధవరం నాగేందర్

బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, భారతీయ జీవన విధానాన్ని భంగపరిచే విధంగా వివాదాస్పదమైన పౌరసత్వ సవరణ చట్టం తీసుకొచ్చింది. రాజకీయ ప్రయోజనాలను ఆశించి మత విద్వేషాలను రెచ్చగొడుతూ హిందూ ఓటు బ్యాంకు రాజకీయాలకు తెరలేపింది. స్వదేశంలో ఉంటున్న పౌరులు మత విశ్వాసాల ఆధారంగా రాజ్యహింసకు గురైతే చాలా పాశ్చాత్య దేశాలు పౌరసత్వాన్ని ఇస్తాయి. ప్రభుత్వానికి భారత సరిహద్దు దేశాల్లో ఉన్న మైనారిటీలను రక్షించాలని ఉద్దేశం ఉంటే పాశ్చాత్య దేశాల్లో ఉన్నట్లుగా ప్రస్తుతం ఉన్న చట్టాన్ని మరింత మెరుగుపరుచవచ్చు. భారత స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటిష్ ప్రభుత్వంతో సహకరించినవారు, జాతీయ జెండాను, జాతీయగీతాన్ని గుర్తించ నిరాకరించిన వారు, పాకిస్థాన్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించినవారు, మహాత్మాగాంధీ హత్యలో వివాదస్పదమైన పాత్ర నిర్వహించినవారు దేశభక్తిపై ఉపన్యాసాలు ఇస్తున్నారు. కళ్ల ముందున్న చరిత్రను కనుమరుగు చేసేందుకు ప్రచారం ఆయుధంగా, వాస్తవాలపై ముసుగు వేసి ప్రతి భారతీయుడు వీరి నుంచి దేశభక్తి గురించి సర్టిఫికెట్లు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించే వారినందరిని పాకిస్థాన్ ఏజెంట్లుగా ముద్ర వేస్తూదేశద్రోహులుఅ ంటున్నారు.

హిందూ మహాసభ నాయకుడు, బీజేపీ మూల పురుషుడు వినాయక దామోదర్ సావర్కర్ 1911లో అరెస్టయి అండమాన్ జైలులో ఉన్నప్పుడు బ్రిటిష్ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తానని క్షమాభిక్ష విజ్ఞాపనలు చేశాడు. ముఖ్యంగా 1920 మార్చి 30న సమర్పించిన క్షమాభిక్ష పిటిషన్‌లో బ్రిటిష్ ప్రభుత్వాన్ని వేడుకుం టూ నేను, నా సోదరుడు బ్రిటిష్ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తామని పోలీసులకు పూర్తిగా సహకరిస్తామని అభ్యర్థించాడు. స్వాతంత్ర్యోద్యమ కార్యకలాపాలలో పాల్గొని తప్పుచేశామని, పూర్తిగా మారిపోయామని ఇకముందు రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనబోమని క్షమాభిక్ష ప్రసాదించాలని ప్రాధేయపడ్డాడు. సావర్కర్ సమకాలీకుడు భగత్‌సింగ్ 1930 అక్టోబర్ 7న ఉరిశిక్ష పడిన తర్వాత బ్రిటిష్ ప్రభుత్వానికి లేఖరాస్తూ ప్రభుత్వంపైన మేం యుద్ధం చేస్తూ పట్టుబడ్డ భారతీయ సైనికులం కాబట్టి మమ్మల్ని ఉరితీయకుండా యుద్ధనీతి ప్రకారం కాల్చిచంపండని కోరాడు. క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించిన వినాయక దామోదర్ సావర్కర్‌ను వీర సావర్కర్‌గా పేరుమార్చి ఛత్రపతి శివాజీతో పోలుస్తూ భారతరత్న ఇచ్చి, భగత్‌సింగ్ సిద్ధాంతాలను ఆచరించేవాళ్లను పాకిస్థాన్ ఏజెంట్లుగా, దేశద్రోహులుగా ముద్రవేస్తున్నారు. 1939 అక్టోబర్ 9న వైస్రాయ్ లార్డ్ లిన్‌లిత్‌గోతో సమావేశమైన హిందూ మహాసభ బ్రిటిష్ వాళ్ల ప్రయోజనాలు పరిరక్షించుకోవడానికి కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ 1939లో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివిధ రాష్ట్రాల్లో పరిపాలన నుంచి వైదొలిగితే హిందూ మహాసభ ముస్లిం లీగ్‌తో కలిసి రాష్ట్రాల్లో మంత్రివర్గంలో చేరింది. సింధు రాష్ట్రంలో గులాం హుస్సేన్ హిదాయతుల్ల ఆధ్వర్యంలో హిందూ మహాసభ భాగస్వామిగా ఉన్న ముస్లిం లీగ్ ప్రభుత్వం, 1943 మార్చిలో, పాకిస్థాన్ దేశం ఏర్పడాలని దేశంలోనే మొట్టమొదటిసారిగా సింధు అసెంబ్లీలో తీర్మానం చేసింది. బ్రిటిష్ ప్రభుత్వం, హిందూ ముస్లిం మతవాదుల వికృత శిశువే పాకిస్థాన్.

వందల మంది సామాజిక శాస్త్రవేత్తలతో ఎన్నికల నిపుణులతో ఏర్పాటుచేసుకున్న అధునాతన ఎన్నికల విభాగం చేస్తున్న సూచనల మేరకే మోదీ ఈ చర్యలను తీసుకుంటున్నాడు. ఇతర పార్టీల దగ్గర అపారమైన నిధులున్నాయని భ్రమపడి వాటిని నిరుపయోగం చేయడానికి డిమానిటైజేషన్ తెచ్చాడు. రష్యా పుతిన్, అమెరికా ట్రంప్, ఇజ్రాయెల్ నెతన్యాహు స్ఫూర్తితో విధానాలను రూపొందిస్తున్నాడు. పుతిన్ దారిలో ప్రతిపక్ష పార్టీలకు నిధులను సమకూర్చే వ్యాపారవేత్తలను ఆదాయపు పన్ను ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ద్వారా వేధిస్తున్నాడు. ముఖ్యంగా కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీకి చెందిన శివకుమార్‌ను జైలులో పెట్టిన విధానం వ్యాపారవేత్తలను కలచివేసింది. ప్రతిపక్ష పార్టీలకు నిధులు ఇవ్వడానికి వ్యాపారవేత్తలు భయపడే పరిస్థితి సృష్టించబడింది. దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం మోదీ తీసుకుంటున్న అనేక చర్యలలో పౌర సవరణ చట్టం ఒక భాగమే.

అమెరికాలో ట్రంప్ సరిగ్గా ఇలాంటి చట్టమే తెచ్చి ముస్లిం దేశాల నుంచి వచ్చే పర్యాటకులపై ఆంక్షలు విధించాడు. న్యాయస్థానాలు ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమని తీర్పునిచ్చాయి. ఈ చట్టం వల్ల భారతదేశంలో ప్రస్తుతం ఉన్న ముస్లింలకు ఎలాంటి నష్టం లేదని వారి పౌరసత్వాన్ని రద్దుచేయడం లేదని బీజేపీ వాదిస్తున్నది. పొరుగు ముస్లిం దేశాల్లో హిందువులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు కాబట్టి వారి క్షేమం దృష్ట్యా ఈ చట్టం తీసుకువచ్చినట్టు కేంద్ర ప్రభుత్వం చెబుతున్నది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం పన్నేండ్లు భారతదేశంలో నివాసం ఉండి, సరైన కారణాలు చూపిస్తే కేంద్ర హోం శాఖ సంతృప్తి చెందిన తర్వాత మాత్రమే విదేశీయులకు పౌరసత్వం ఇస్తున్నది. పన్నెండేండ్లు వేచిచూసే కాలం సుదీర్ఘమైనదని అనుకున్నప్పుడు ఐదేండ్లకు తగ్గించాల్సిన అవసరం ఉన్నది. బీజేపీ అధీనంలో ఉన్న హోం శాఖ విదేశీయులకు పౌరసత్వం ఇవ్వడంలో ప్రధాన పాత్ర వహిస్తున్నది. అలాంటప్పుడు అసందర్భంగా మతం ఆధారిత పౌరసత్వం ఇవ్వడం జరుగుతున్నదని చట్టం చేయాల్సిన అవసరం ఏమున్నది? ముస్లింలు ప్రతిపక్షాల ప్రోత్సాహంపై నిరసన ప్రదర్శనలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో హిందువులు ఎందుకు ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారు వారు చెప్పగలరా? ఈ చట్టం అమల్లోకి వస్తే అస్సాంతో పాటు ఈశాన్య రాష్ట్రాలలోని స్థానికులు బంగ్లాదేశ్ నుంచి వచ్చే వలసల వల్ల మైనారిటీ కావలసి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఈ చట్టం తేవడంలో ప్రేరణ ఇచ్చిన ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ గురించి ప్రస్తావించాలి.

**షేక్ హసీనా నాయకత్వంలో బంగ్లాదేశ్‌లో హిందువులకు పూర్తి రక్షణ ఉన్నది. అక్కడి ప్రభుత్వానికి ఇబ్బందికరంగా ముస్లిం తీవ్రవాదాన్ని ప్రోత్సహించేవిధంగా భారతదేశ చర్యలు అవకాశం కల్పిస్తున్నాయి. భారతదేశానికి మద్దతు ఇస్తున్న బంగ్లాదేశ్ ఇప్పుడు తన వైఖరిని మార్చుకొని చైనా ప్రభావంలోకి వెళ్లే అవకాశం ఉన్నది. శ్రీలంక నుంచి దశాబ్దాల కింద వచ్చిన శరణార్థులకు ఈ చట్టం ఎలాంటి ప్రయోజనం కలిగించడం లేదు. ఈ చట్టం వలన మన దేశంలో దిగజారుతున్న ఆర్థిక పరిస్థితి నుంచి, పెరుగుతున్న పేదరికం నిరుద్యోగం నుంచి ప్రజల దృష్టిని తాత్కాలికంగా మళ్లించి రాజకీయ ప్రయోజనం పొందవచ్చు కానీ అంతర్జాతీయంగా దేశానికి నష్టం కలుగుతుంది.**

అంతర్జాతీయ న్యాయసూత్రాలకు విరుద్ధంగా విదేశాల నుంచి వచ్చిన యూదు శరణార్థులకు పాలస్తీనీయుల భూ భాగంలో ప్రభుత్వమే అక్రమంగా ఇల్లు కట్టించి ఇస్తున్నది. కేవలం రష్యా దేశం నుంచి వచ్చిన యూదు శరణార్థులు ఇజ్రాయెల్ జనాభాలో 20 శాతం ఉన్నారు. నెతన్యాహూ దుందుడుకు విధానాలకు ఆకర్షితులైన వలసదారులు ఆయన నాయకత్వాన్ని మూకుమ్మడిగా బలపరుస్తున్నారు. వలసదారుల మద్దతు వలననే నెతన్యాహూ పార్టీ గత సెప్టెంబర్లో జరిగిన ఎన్నికల్లో 25.1 శాతం ఓట్లతో అధికారంలో ఉన్నది. వలసదారులలో ఉన్న అభద్రతా భావమే ఆయన అధికారంలో కొనసాగడానికి అవకాశం కల్పిస్తున్నది. నెతన్యాహూ మార్గంలోనే సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో బంగ్లాదేశ్, పాకిస్థాన్ నుంచి హిందువులను తీసుకొనిరావడం, హిందువుల్లో లేని అభద్రతభావాన్ని కలిగించడం, హిందూ మత ఛాందసవాదాన్ని ప్రేరేపించి ఓటు బ్యాంకు రాజకీయాలు నడపడం మోదీ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తుంది. కొత్తగా వచ్చిన వలసదారుల్లో కొంతమందిని ప్రచారం కోసం జమ్ముకశ్మీర్ ఈ ప్రాంతంలో నివాసం ఏర్పర్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు.

షేక్ హసీనా నాయకత్వంలో బంగ్లాదేశ్‌లో హిందువులకు పూర్తి రక్షణ ఉన్నది. అక్కడి ప్రభుత్వానికి ఇబ్బందికరంగా ముస్లిం తీవ్రవాదాన్ని ప్రోత్సహించేవిధంగా భారతదేశ చర్యలు అవకాశం కల్పిస్తున్నాయి. భారతదేశానికి మద్దతు ఇస్తున్న బంగ్లాదేశ్ ఇప్పుడు తన వైఖరిని మార్చుకొని చైనా ప్రభావంలోకి వెళ్లే అవకాశం ఉన్నది. శ్రీలంక నుంచి దశాబ్దాల కింద వచ్చిన శరణార్థులకు ఈ చట్టం ఎలాంటి ప్రయోజనం కలిగించడం లేదు. ఈ చట్టం వలన మన దేశంలో దిగజారుతున్న ఆర్థిక పరిస్థితి నుంచి, పెరుగుతున్న పేదరికం నిరుద్యోగం నుంచి ప్రజల దృష్టిని తాత్కాలికంగా మళ్లించి రాజకీయ ప్రయోజనం పొందవచ్చు కానీ అంతర్జాతీయంగా దేశానికి నష్టం కలుగుతుంది. పాకిస్థాన్ పరిధిని దాటి భారత ప్రతిష్ఠ పెరిగిపోయింది. అణు రంగంలో అంతర్జాతీయ ఒప్పందాలు జరిగాయి. మోదీ విధానాల వలన పాకిస్థాన్ స్థాయికి దిగజారిపోయాం. మత ఛాందసవాదంలో పోటీ పడుతున్నాం. ఆర్థికవృద్ధి రేటు పెరుగుదలలో బంగ్లాదేశ్, నేపాల్ దేశాలు భారత్ కంటే మెరుగైన పరిస్థితిలో ఉన్నాయి. యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వం వివాదాస్పద విధానాల ద్వారా యువకుల సమయాన్ని ఆందోళనల వైపు మళ్లిస్తున్నది. మోదీ నాయకత్వంలో ఆర్థిక పునరుజ్జీవనానికి అవకాశాలు కనిపించడం లేదు.

(వ్యాసకర్త:సీనియర్ రాజకీయ విశ్లేషకులు, వాషింగ్టన్ డీసీ)

# 'జేజమ్మ' నోట సారా పాట

సారా



కొండె సమ్మయ్య

దొంగ పిల్లి కళ్లు మూసుకొని సారా తాగుతూ నన్నెవరూ చూడటం లేదు అనుకుంటుందట. 'సారా' జహాసే అచ్చా పాలమూరు హమారా' అంటూ వలసజీవులకు సర్కార్ సారా, విదేశీ మద్యం విచ్చలవిడిగా తాగించి బలిసిన ప్రబుద్ధులే నేడు జెండా, ఎజెండా మార్చుకొని నీతులు వల్లిస్తున్నారు. మద్యనిషేధం అంటూ స్వయంగా హంతకులే సంతాపసభలు పెడుతున్నారు. ప్రస్తుతం తెలంగాణలో సారా రాజకీయాలు బరితెగించాయి. తగుదునమ్మా అని మద్యనిషేధ గీతాలుఆ లపిస్తున్నాయి.

ఒకప్పుడు సారా ఏరులై పారించినవారే నేడు మద్యనిషేధం విధించాలంటూ కపట దీక్షలతో నీతిబోధ చేస్తున్నారు. ఎద్దు నోట్లో గొట్టం పెట్టి బలవంతంగా పసరు మందు పోసినట్లు జనాలకు నోట్లో గొర బిగించి మద్యం తాగించినోళ్లే మద్యం బంద్ కావాలని రాగాలు తీస్తున్నారు. పీపాలు తాగించి పాపాలు చేయొద్దని శ్రీరంగ నీతులు బోధిస్తున్నారు.

నిజాం రాజుల నుంచి నేటిదాకా పాలమూరు జిల్లాలో, పక్కజిల్లాలో సారాపై గుత్తాధిపత్యం నెరపుతున్నది ఆ కుటుంబమే. ఈ నాయకురాలి మామ సత్తా ఏంటో అందరికీ తెలుసు. భర్తగారి దాష్టీకం జగమంతా విదితమే. జర్నలిస్టులకు కొట్టిన పిండే. వీరి తండ్రి ఎందుకు నక్సలైట్ల చేతిలో హతమైనాడో ఒక్కసారి నెమరు వేసుకుంటే గ్రామాలు గతంలో రక్తంలో,క న్నీళ్లలో ఎంత తడిసాయోఅ వగతమవుతుంది.

పాలమూరు జిల్లాలో సర్కార్ సారా కాంట్రాక్ట్ తీసుకున్న ఈ నాయకురాలి భర్త అధికారం అడ్డం పెట్టుకొని ఆబ్కారీ శాఖను, పోలీస్ శాఖను తనకు సేవకగణంగా వాడుకున్నాడు. తరతరాలుగా ఇప్ప పువ్వు సారా కాస్తున్న చెంచుల మీద దాడి చేసి సర్కారు సారాయే తాగించాడు. వంశపారంపర్యంగా తండాల్లో బెల్లం పులుసుతో సారా కాసుకొని తాగుతున్న లంబాడీల మీద నాటుసారా నిషేధం విధించాడు. చెంచులు, లంబాడాలు ప్రసాదు (ప్రభుత్వ సారాయి దుకాణం)కే వెళ్లి మత్తెక్కేదాకా కుతికెల దాకా తాగి తన గల్లా పెట్టెనే నింపాలని శాసనం అమలుచేశాడు. గద్వాల, కొడంగల్, మఖ్తల్ నియోజకవర్గాల్లో, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా గీత కార్మికుల సొసైటీలు ఏర్పడకుండా ఆంక్షలు విధించాడు. కల్లుగీస్తే కళ్లు పీకేస్తానని హెచ్చరికలుజా రీచేశాడు.

ఇప్పసారా, బెల్లం సారా కాయడానికి వీల్లేదు. ప్రభుత్వ సారాయి మాత్రమే కొనితాగాలి. ఒకవేళ సొంతంగా సారా కాస్తే వారికి చిత్రహింసలు తప్పవు. ఈ సారా ఆంక్షలపై బాలకిష్టాపురం తండాతో పాటు అనేక చెంచు పెంటలు ఎదురుతిరిగాయి. తరతరాలుగా తామే సారా కాసుకొని తాగుతున్నామని మా సారా మేమే కాసుకుంటామని తిరుగబడ్డారు. దీంతో ఈ సారా కాంట్రాక్టర్ వారిని చిత్రహింసలు పెట్టాడు. అక్రమంగా సారా కాస్తున్నారని బాలకిష్టాపురం తండాపై గూండాలతో దాడి చేయించాడు. చెంచులను తీసుకెళ్లి తన ఇంటి ముందు కట్టేసిచిత్రహ ంసలు పెట్టాడు.

బాలకిష్టాపూర్ తండాలో 1988లో గుడుంబా తయారుచేస్తున్నారనే నెపంతో తన గూండాలను పంపి లంబాడీ స్త్రీలను కూడా తన పంచాయితీకి ఈడ్చుకొచ్చాడు ఈమె భర్త. లంబాడీ పురుషులను, స్త్రీలను చిత్రహింసలకు గురిచేశాడు. ఈ సంఘటనను ధైర్యంగా చిత్రించి, వార్త పంపిన 'ఉదయం' విలేకరి రాధాకృష్ణను కూడా పట్టుకొచ్చి రోజుకొక ఊరుచొప్పున తిప్పి చిత్రహింసలు పెట్టి చంప చూశాడు. ఈమె భర్త సాగిస్తున్న సారా దందాకు వ్యతిరేకంగా వార్త రాసి చిత్రహింసల పాలైన నాటి జర్నలిస్టు మహబూబ్‌నగర్ జిల్లా అప్పంపల్లి వాసి రాధాకృష్ణ నేటికీ సజీవసాక్ష్యం. 'ఉదయం' పత్రికలో ఆత్మకూరులో 'సారా రాజుల రాజ్యం' శీర్షికతో వార్త రాసినందుకు వీరి గూండాలు రాధాకృష్ణను 1988 అక్టోబర్ 31న కిడ్నాప్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ అంతటా 'ఉదయం' పత్రికా సిబ్బంది, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం నాయకత్వంలో వారి కుటుంబానికి వ్యతిరేకంగా భారీ ప్రదర్శనలు సాగాయి. జర్నలిస్టు రాధాకృష్ణను కిడ్నాప్ చేసిన నిందితులపై చర్య తీసుకోవాలని కోరుతూ జర్నలిస్టులంతా పెన్‌డౌన్ చేశారు. రోడ్లపైకి వచ్చారు. ధర్నాలు, ర్యాలీలతో రాష్ట్రం అట్టుడికింది.

జర్నలిస్టుల పోరాటానికి నాటి పీపుల్స్‌వార్ పార్టీ మద్దతు ప్రకటించింది. జర్నలిస్టు రాధాకృష్ణను కిడ్నాప్ చేయడాన్ని పీపుల్స్‌వార్ ఖండించింది. పీడిత ప్రజలపై, ముఖ్యంగా గ్రామీణులపై అఘాయిత్యాలు చేయడమే కాకుండా కొట్టడం, ఆస్తులు ధ్వంసం చేయడం, చంపడం, ఆఖరికి విలేకరులను కిడ్నాప్ చేయడం వంటి అప్రజాస్వామిక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ ప్రకటించింది. జర్నలిస్టు రాధాకృష్ణపై ఎలాంటి అఘాయిత్యం జరిగినా, లేక జరిపినా దానికి ప్రత్యక్షంగా లేక పరోక్షంగా ఈ సారా కాంట్రాక్టర్ ప్రధాన బాధ్యత వహించాల్సి వస్తుందని పీపుల్స్‌వార్ ఆ ప్రకటనలో హెచ్చరించింది.

**బాలకిష్టాపూర్ తండాలో 1988లో గుడుంబా తయారుచేస్తున్నారనే నెపంతో తన గూండాలను పంపి లంబాడీ స్త్రీలను కూడా తన పంచాయితీకి ఈడ్చుకొచ్చాడు ఈమె భర్త. లంబాడీ పురుషులను, స్త్రీలను చిత్రహింసలకు గురిచేశాడు. ఈ సంఘటనను ధైర్యంగా చిత్రించి, వార్త పంపిన 'ఉదయం' విలేకరి రాధాకృష్ణను కూడా పట్టుకొచ్చి రోజుకొక ఊరుచొప్పున తిప్పి చిత్రహింసలు పెట్టి చంప చూశాడు. ఈమె భర్త సాగిస్తున్న సారా దందాకు వ్యతిరేకంగా వార్త రాసి చిత్రహింసల పాలైన నాటి జర్నలిస్టు మహబూబ్‌నగర్ జిల్లా అప్పంపల్లి వాసి రాధాకృష్ణ నేటికీ సజీవసాక్ష్యం.**

జర్నలిస్టుల పోరాటం, పీపుల్స్‌వార్ హెచ్చరికలు నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు ఇబ్బంది కలిగించాయి. దీంతో సారా కాంట్రాక్టర్‌పై ఎన్టీఆర్ అగ్రహోదగ్రుడయ్యాడు. ఆయన ఆదేశంతో అప్పటి హైదరాబాద్ రేంజ్ పోలీస్ డీఐజీ పేర్వారం రాములు సవివరంగా దర్యాప్తు చేసి ఈ సారా కాంట్రాక్టర్ రాక్షసత్వాన్ని కళ్లారా చూసి కన్నెర్రజేశాడు. రెండు రోజులు మహబూబ్‌నగర్‌లో పర్యటించారు పేర్వారం. ఆత్మకూరులో విలేకరి రాధాకృష్ణ ఫొటోస్టూడియోను, కిడ్నాప్ జరిగిన బాలకిష్టాపూర్ తండాను సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో కేసు పూర్వాపరాలు పరిశీలించారు. రాధాకృష్ణ రాసిన వార్తలు, ఆయన కిడ్నాప్ ఉదంతం నిజమేనని దర్యాప్తులో తేలింది. రాధాకృష్ణ కిడ్నాప్ ఘటనలో ప్రధాన నిందితుడైన సారా కాంట్రాక్టర్‌ను అరెస్టు చేశారు. కిడ్నాప్, అక్రమ నిర్బంధం, హత్యాప్రయత్నం కేసులు నమోదు చేసి నాన్‌బెయిలబుల్ వారెంట్‌తో అరెస్టు చేశారు. పోలీసుల దాడితో రాధాకృష్ణ విముక్తుడయ్యాడు. ఇంత ఘనచరిత్ర గల కుటుంబం ఇప్పుడు గోల్కొండ కోట శిఖరం ఎక్కి మద్యం నిషేధమంటూ పెడబొబ్బలు పెడుతున్నది. జీవహింస పాపమని ఎనకటికి ఎలుకలు తినేవాని దగ్గరికి వచ్చి ఏనుగులు తినేవాడు ధర్మోపన్యాసం చేశాడట. సరిగ్గా ఈ కుటుంబానికి ఈ కథ అతికినట్టు ఉంటుంది.

1988 అక్టోబర్ 31న ఉదయం దినపత్రికలోని వార్త చూశాక మద్యనిషేధంపై మాట్లాడే అర్హత నేటి బీజేపీ నాయకురాలికి కించిత్ కూడా లేదు. నాటి ఎమ్మెల్యే సోదరుడు, ఈమె భర్త ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గవర్నమెంట్ అరక్ ఏకైక కాంట్రాక్టర్. నేడు కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా ఈ కుటుంబానికి చెందిన లిక్కర్ వ్యాపారం మూడుపువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతుండటం విశేషం.




దేశ వ్యతిరేక భావనలను ప్రోత్సహించవద్దని న్యూస్‌చానెల్స్‌కు ప్రభుత్వం 'సూచనలు' జారీచేసింది. కానీ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న 'కుహనా జాతీయ' చానెల్సే సీఏఏ వ్యతిరేక నిరసన ప్రదర్శకులను దేశ వ్యతిరేకిగా చిత్రీకరిస్తున్నాయి. మొదట మీ ఇంటిని చక్కబెట్టుకోండి.

**రాజ్‌దీప్ సర్దేశాయ్**




నాకు మతంపై నమ్మకం లేదు. సాంస్కృతిక బహుళత్వాన్ని విశ్వసిస్తాను. అయ్యా.. ఒక్కసారి మన సైన్యం వైపు చూడండి. మన సైనిక విభాగాలు భిన్నమతాల నిలయాలు. ఒకరి మతాన్ని మరొకరు సహించడమే కాదు, ఇతర మతస్తుల కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**బర్ఖాదత్**



లైంగికదాడికి పాల్పడిన కుల్దీప్ సెంగార్‌కు న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. ఆయన ఎంత తొందరగా 'అనారోగ్యానికి' గురై దవాఖానలో చేరుతాడో చూద్దాం.

**జావేద్ అఖ్తర్**



నితీశ్ కుమార్, నవీన్ పట్నాయక్ పార్లమెంటులో పౌరసత్వ సవరణ బిల్లుకు ఓటేయడమేమిటి, ఆ తర్వాత ప్రజల్లో నిరసన వ్యక్తం కావడంతో దానికి వ్యతిరేకంగా మాట్లాడటమేమిటి? అత్యంత హీనమైన రాజకీయ హిపొక్రసీ. కొద్దిరోజుల్లోనే సిగ్గులేకుండా మాట మార్చడం!.

**సంజయ్ ఝూ**

# భావి పుస్తకం: ఒక స్వప్నం

పుస్తకం



డాక్టర్ నాగసూరి వేణుగోపాల్

2019 ముగుస్తుండగా భాగ్యనగరంలో పుస్తక ప్రపంచం ప్రదర్శనగా విచ్చుకుంటున్నది. ఇది ముప్పై మూడేండ్లుగా క్రమం తప్పకుండా సాగుతూ జనాలకు జ్ఞానాన్ని పంచుతున్నది. అంతేకాదు ఈ పుస్తకాలతో పాటు నగ రం విస్తృతమైంది. టెక్నాలజీ ఊతంతో ప్రపంచీకర ణ వెల్లువైంది. బుల్లితెర తెలుగు మాటలతో లెక్కలేనన్ని హొయలు పోతూ నర్తించడం మొదలు పెట్టింది. టెలిఫోన్ ఇంట్లో బల్లమీదనో, మరోచోటనో కాకుండా జేబులోకి మారిపోయింది. ఇంటర్‌నెట్ కంప్యూటర్ దాటి అరచేతిలోకి వచ్చింది. ఇవి చాలక సోషల్‌మీడియా మనసులను, మొదళ్లను కొల్లగొట్టడం ప్రారంభించింది. ముప్పై మూడేండ్ల కాలంలో ఈ మార్పులు హైదరాబాద్‌లోనే కాదు చిన్నపల్లెలో కూడా సంభవించాయి. హైదరాబాద్ పుస్తక ప్రదర్శన 1986లో మొదలైనప్పటి నుంచి ఇన్ని పరిణామాలు స్పష్టంగా కండ్లు కడుతున్నాయి. అశోక్‌నగర్ సిటీ లైబ్రరీలో మొదలై నిజాం కాలేజీ గ్రౌండ్స్, పబ్లిక్ గార్డెన్స్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, కేశవ మెమోరియల్ హైస్కూల్ గ్రౌండ్స్, నెక్లెస్‌రోడ్ పిమ్మట తెలంగాణ కళా భారతి (ఎన్టీఆర్ స్టేడియం)లో కుదురుకున్నది.

పుస్తక ప్రదర్శన సమయంలో ఇంతస్థాయి చర్చ అవసరం ఏమిటని కొందరికి అనిపించవచ్చు. పుస్తకం అంటే జ్ఞానం; పుస్తకం అంటే భావ ప్రసారం; పుస్తకం అంటే సమానత్వ సాధన; పుస్తకం అంటే దిశానిర్దేశనం; పుస్తకం అంటే భవిష్యత్ సాధన! వెరసి పుస్తకం అంటే జీవితానికి ఓ పెద్ద ఊతం! నేటికీ ఇంటర్‌నెట్ లేదా వికీపీడియా సమాచారం ప్రామాణికంగా తీసుకోలేకపోతున్నాం. అది పుస్తకంగా ఉంటేనే ఆ స్థాయి గౌరవం. గోడౌన్ లాంటి ఇంటర్‌నెట్‌లో ఎవరు ఎలాగైనా జోక్యం చేసుకోవచ్చు. కనుకనే పుస్తకం హస్తభూషణం, మస్తక కిరీటం!

పుస్తకం దారిచూపే ధ్రువతారగా ఎలా మారిందో గమనించడం ఆసక్తిగా ఉంటుంది. సుమేరియన్లు తొలుత అక్షరాలు దిద్దారని చెబుతారు. అంతకుముందు ఆలోచన కలిగి ఉండటమే మనిషిని జంతు ప్రపంచం నుంచి వేరుచేసింది. ఆలోచన వ్యక్తీకరణ చేయాలనే ప్రయత్నానికి ఊపిరిపోసింది. తత్ఫలితంగా భావప్రసారం లేదా కమ్యూనికేషన్ ప్రక్రియ మొదలైంది. తొలుత అతి ప్రాథమికంగా ఉండవచ్చు.

అక్షరాలు, రాత వగైరా రాకముందు అంతా వాక్ ఆధారమే! జ్ఞానాన్ని దాచుకోవడానికి జ్ఞాపకశక్తి తప్ప మరో సాధనం లేదు. వ్యక్తీకరణకు నోరు తప్ప మరో ఊతం లేదు. నేటి పుస్తకం, ఈ-పుస్తకం దాకా వ్యక్తీకరణ ప్రయాణాన్ని గమనిస్తే ఇందులో ఎంతటి టెక్నాలజీ ఉందో బోధపడుతుంది. ఇసుకలో వేలితో అక్షరాలు దిద్దడం మనకు నేడు చాలా సరళంగా అనిపించవచ్చు. కానీ ఈ ఆలోచన రావడానికి ఎంతకాలం పట్టి ఉంటుంది. తాళపత్రాలు రాకమాత్రం చిన్న విషయమా? పత్రాలలో తాళపత్రాలు రాయడానికి అనుకూలంగా మాత్రమే కాక దీర్ఘకాలికంగా మన్నుతాయని గమనించడం వృక్షశాస్త్ర అంశమే! దానికి తగిన కలాన్ని రూపొందించుకోవడం టెక్నాలజీ కాగా; అలా వినియోగించుకోవాలనే ఆలోచన సైన్స్! తాళపత్రం రాకముందు జ్ఞానం అంటే గురుముఖంగా నేర్చుకున్నదే! గుర్తుపెట్టుకోవడానికి సౌలభ్యంగా దారులు ఏర్పడ్డాయి, స్థిరపడ్డాయి. ఛందస్సు అలా ఏర్పడి, మనం గుర్తుపెట్టుకోవడానికీ; మననం చేసుకోవడానికీ దోహదపడిందే!

కాగితం, పెన్నులు, ఇంకు తయారీ.. ఇవన్నీ టెక్నాలజీ ఫలితాలే! తాళపత్రాలు దాటి అచ్చుకాగితాలు రావడంతో పుస్తకాలు రావడం మొదలైంది. అచ్చుపని మెరుగవడంతో పుస్తకాల నుంచి పత్రికలు ప్రారంభమయ్యాయి. ఈ పరిణామం దినపత్రిక రాకతో తారస్థాయిని అందుకున్నది. ఈ దినపత్రికల పంపిణీ కూడా సైకిల్ ఆవిష్కరణ, అది మెరుగవ్వడంతో మరింత వేగాన్ని సాధించింది.

మాట పుస్తకంగా పరిణమించి సాగిపోవడం ఒక దారి కాగా; మాట మాటగా చేరడం మరో టెక్నాలజీ పథం. టెలిఫోన్, రేడియో, సినిమా, టెలివిజన్, ఇంటర్‌నెట్– వీటిమధ్య ధ్వని ముద్రణా సౌలభ్యాలు– ఇది మరో గమనం. జ్ఞానం, పాండిత్యం, ప్రతిభ ఏదో ఒకదారిలో సాగడంగా మారిపోయింది. ఏది ఏ మోతాదులో వినియోగించుకోవడం దానికి ఎంతో కొంత ఈస్థటిక్ పరిమళాలు అద్దడం అదనపు కళా, పరమార్థం!

ఒక రేడియో ప్రసంగం. ఒక టెలివిజన్ కార్యక్రమం. ఒక నాటకం. ఒక పాట, ఒక పుస్తకం–ఇలా ఏవైనా భావప్రసారానికి సహకరించేవి ఒక మౌలిక రూపానికి వేర్వేరు వ్యక్తీకరణలే! ఈ మౌలిక రూపమైంది రాత! అది మస్తిష్కంలోనా, లేదా అక్షరరూపంలోనా అనేది తర్వాతిస్థాయి. వీటన్నిటికీ నేడు పుస్తకం ఒక పెద్దన్న పాత్ర పోషిస్తున్నది. ఆధునిక టెక్నాలజీ ఆయుధంగా ఈ–పుస్తకంగా మారి–భౌతికరూపం నుంచి అపురూపంగా అందివచ్చింది. కేసెట్ రికార్డర్ వచ్చినపుడు రేడియోకు కాలం చెల్లిందన్నారు; టెలివిజన్ పెద్దస్థాయిలో ప్రవేశించినపుడు ఇక సినిమాకు చెల్లుచీటి అన్నారు; న్యూస్‌ఛానళ్ళు వచ్చినపుడు దినపత్రికలకు తిలోదకాలు అన్నారు. ఇంటర్నెట్ విచ్చుకున్నపుడు పుస్తకాలకూ, లైబ్రరీలకూ అంతే సంగతులు అన్నారు. ఇందులో ఏదీ నిజం కాలేదు. పైపెచ్చు ఒక దానికొకటి దోహదపడటం పెరిగింది. టీవీలో సినిమా చూసి తృప్తి పడక పెద్ద స్క్రీన్ అని థియేటర్‌కు వెళ్లాలనిపిస్తుంది. న్యూస్ ఛానళ్ల వార్తల గందరగోళంతో దినపత్రికల్లో సమాచారాన్ని సరిచూసుకోవాలనిపిస్తోంది.

పుస్తక ప్రపంచానికి సంబంధించి మరికొన్ని పరిణామాలున్నాయి. పుస్తకాల ధరలు పెరుగడంతో పాటు రవాణా ఖర్చులు పెరిగాయి. పుస్తకాలు పత్రికలుగా మారి పాఠకులను చేరాయి. పుస్తకాలకన్న పత్రికలకు పోస్టల్ ఖర్చు తక్కువ. మరోవైపు పట్టణం నగరంగా, మహానగరంగా మారిపోవడంతో షికారుగా వీధిలోకి రావడమే సమస్య అయిపోయింది. జీవితంలో ఒత్తిడి పెరిగిపోయింది. శ్రీమతితో పాటు నెలసరి వస్తువులు తీసుకురావడానికి వెళ్లే సదుపాయాన్ని ఒకవైపు టీవీ, మరోవైపు ట్రాఫిక్ అడ్డగించింది. లేకపోతే అన్ని వస్తువులతో పాటు పత్రికలు, పుస్తకాలు కొనే అలవాటు ఇప్పుడు మూడు ఇరువైల వయసుకు అటూఇటూ ఉన్న వారందరికీ గుర్తుండే ఉంటుంది. టీవీ రాకతో లెండింగ్ లైబ్రరీలు క్రమంగా మూతబడ్డాయి, పుస్తకాల కొట్లు పలచబడ్డాయి. ఇంటర్‌నెట్‌లో పుస్తకాల సంత అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ద్వారా సాగుతున్నది. ఏదో పత్రికలో మంచి పుస్తకం గురించి చదివి నెట్‌లో తెప్పించుకుందామని మరిచిపోయిన సందర్భాలు అందరికీ ఉన్నాయి. ఈ పరిణామాల దృష్ట్యా పుస్తక ప్రదర్శనలు నేడు కీలకంగా మారాయి.

33వ హైదరాబాద్ పుస్తక ప్రదర్శన డిసెంబర్ 23న తెలంగాణ కళా భారతిలో మొదలవుతోంది. ఈ నేపథ్యంలో ఇంకా దృష్టిపెట్టాల్సిన విషయాలు ఏమిటో చూద్దాం..

చదివే పుస్తకాలు మాత్రమే కాక, చదవాల్సిన పుస్తకాలను అందరికీ అందుబాటులోకి తెచ్చి ప్రేరేపించాలి. పుస్తక ప్రదర్శన ఏటా ఒకేచోటా, ఒకే తేదీల్లో ఉండాలి. ఇదేరీతిలో జిల్లా, మండలం, గ్రామస్థాయిలో క్రమంగా నిర్దిష్ట తేదీలతో, నిర్దిష్ట ప్రాంతాల్లో జరుగాలి. ఒక పాతిక ఊళ్లను ఎంచుకొని ప్రతి పదిహేను రోజులకు ఒకచోట పట్టణ స్థాయి పుస్తక ప్రదర్శనలు ఉండాలి. హైదరాబాద్‌లో పుస్తకప్రదర్శన జరిగినచోట ఏడాది పొడవునా నడిచేలా గ్రంథాలయం ఉండాలి. కేవలం ఉద్యోగార్థులకు పనికివచ్చేవి మాత్రమే కాకుండా జీవితాంతం దోహదపడే పుస్తక పఠనం పెరగాలి. ఎన్ని తెలుగు పుస్తకాలు ఏటా ప్రచురింపబడుతున్నాయో వాటి వివరాలు వెబ్‌సైట్‌లో ఎల్లవేళలా ఉండాలి. పుస్తకాలంటే కథలు, కవిత్వం మాత్రమే కాదు, జీవితానికి ఊతంగా నిలిచే వ్యవసాయం, చరిత్ర, సామాజిక శాస్త్రాలు, ఫిలాసఫీ, టెక్నాలజీ, వైద్యం ఇలా చాలా ఉన్నాయని గమనించాలి.

చివరగా మానవజ్ఞానం ఎలా నిక్షిప్తమౌతూ, రూపం మార్చుకుంటూ వస్తున్నదో వివరించే, సరైన దృక్పథం కలిగించేరీతిలో దృశ్యమానంగా నడిచే మ్యూజియం కూడా నిర్మాణం కావాలి.

ఇదీ పుస్తకానికి సంబంధించిన నా ప్రస్తుత కల!

**నేడు పుస్తకం ఒక పెద్దన్న పాత్ర పోషిస్తున్నది. ఆధునిక టెక్నాలజీ ఆయుధంగా ఈ-పుస్తకంగా మారి-భౌతికరూపం నుంచి అపురూపంగా అందివచ్చింది. కేసెట్ రికార్డర్ వచ్చినపుడు రేడియోకు కాలం చెల్లిందన్నారు; టెలివిజన్ పెద్దస్థాయిలో ప్రవేశించినపుడు ఇక సినిమాకు చెల్లుచీటి అన్నారు; న్యూస్‌ఛానళ్ళు వచ్చినపుడు దినపత్రికలకు తిలోదకాలు అన్నారు. ఇంటర్నెట్ విచ్చుకున్నపుడు పుస్తకాలకూ, లైబ్రరీలకూ అంతే సంగతులు అన్నారు. ఇందులో ఏదీ నిజం కాలేదు.**

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

## సీఏఏ నిరసనలతో మాకు ముప్పు!


భారత్ ఎలాంటి ఆపరేషన్ చేపట్టినా తగిన జవాబిస్తాం: ఇమ్రాన్



**ఇస్లామాబాద్:** దేశంలో నెలకొన్న అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు భారత్ లేనిది ఉన్నట్లుగా చూపే ప్రయత్నం చేస్తున్నదని పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోపించారు. భారత ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు. పాక్‌కు ముప్పు తలపెట్టే పరిస్థితి వస్తే, తాము దీటుగా స్పందిస్తామని శనివారం ఇమ్రాన్ వరుస ట్వీట్లు చేశారు. 'హిందూ దేశ సాధన దిశగా ఫాసిస్ట్ విధానాలతో మోదీ ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. పౌరసత్వ సవరణ చట్టానికి(సీఏఏ) వ్యతిరేకంగా ఆ దేశ ప్రజలంతా ఏకమై ఆందోళన చేపట్టారు. త్వరలో ఇదో ఉద్యమంగా మారబోతున్నది. దీనివల్ల పాక్‌కు ముప్పు పెరిగే అవకాశం ఉంది' అని ఇమ్రాన్ అన్నారు.

## సీఏఏను విమర్శించిన మలేషియా ప్రధాని

ఆగ్రహం వ్యక్తం చేసిన భారత్



**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) విమర్శిస్తూ మలేషియా ప్రధాని మహతీర్ మహమ్మద్ చేసిన వ్యాఖ్యలపై భారత్ తీవ్ర అభ్యంతరం తెలిపింది. సీఏఏ తమ అంతర్గత విషయమని స్పష్టం చేసింది. మహతీర్ శనివారం మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ భారత్‌లో మైనారిటీల సమస్యలను ప్రస్తావించడమేకాకుండా సీఏఏను విమర్శించారు. దీంతో వెంటనే స్పందించిన భారత్ ఇతర దేశాల అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడం దౌత్య విధానాలకు విరుద్ధమని పేర్కొంది. ఢిల్లీలోని మలేషియా రాయబార కార్యాలయానికి చెందిన ఓ అధికారిని తమ వద్దకు పిలిపించుకున్న భారత విదేశాంగ శాఖ తన ఆగ్రహాన్ని ఆయన ముందు వ్యక్తం చేసింది. దీంతో ఆయన స్పందిస్తూ సీఏఏకు సంబంధించి సరైన సమాచారం లేకుండానే తమ ప్రధాని మాట్లాడినట్లు తెలుస్తున్నదని వివరణ ఇచ్చారు.

## మళ్లీ రోడ్డెక్కిన జామియా విద్యార్థులు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 21:** : సీఏఏను తీవ్రంగా వ్యతిరేకిస్తూ కొద్ది రోజులుగా నిరసనలు చేపడుతున్న ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ విద్యార్థులు శనివారం మరోసారి రోడ్డెక్కారు. మోదీ, అమిత్ షా మళ్లీ పాఠశాలకు వెళ్లాలంటూ నినాదాలు చేశారు. 'పుస్తకాలు అవసరమున్న వ్యక్తులకు దానం చేయండి.. ఆ పుస్తకాలు భారత రాజ్యాంగమై ఉండాలి.. మోదీకి భయం కలిగినప్పుడల్లా పోలీసులను ఎగదోస్తుంటాడు' అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. ఓ నిరసనకారుడు మాట్లాడుతూ 'డబ్బులు ఉన్న వాళ్లు ఎలాగైనా గుర్తింపుకార్డులు సంపాదిస్తారు. బీహార్, ఉత్తరప్రదేశ్ నుంచి ఢిల్లీకి వలస వచ్చిన పేదలు గుర్తింపుకార్డులను ఎలా సంపాదిస్తారు' అని నిలదీశారు. ఈ ఆందోళనలో పాల్గొన్న ఓ మహిళ మాట్లాడుతూ 'విద్యార్థులు చేపట్టే నిరసనలో ఓ అర్థం ఉంటుంది. ఏదైనా అంశం ప్రాతిపదికనే వాళ్లు నిరసన చేపడుతుంటారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గట్టిగా వ్యతిరేకిస్తుంటారు' అని పేర్కొన్నారు. 'నా పిల్లలు (విద్యార్థులు) ఏకాకులు కారు' అనే ప్లకార్డును ఆమె ప్రదర్శించారు. వీరి ఆందోళనకు స్థానికులు, పూర్వ విద్యార్థులు, ఢిల్లీలో ఉన్న వివిధ యూనివర్సిటీల విద్యార్థులు మద్దతు పలికారు. కొంత మంది పూర్వ విద్యార్థులు తమ పిల్లలను కూడా నిరసన కార్యక్రమానికి తీసుకొచ్చారు. మరోవైపు ఢిల్లీలో ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని పోలీసులు చెప్పారు. కొద్ది రోజులుగా ఢిల్లీలో సీఏఏ ఆందోళనలు ఉద్ధృతంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే.



## దృష్టి మళ్లించడమే లక్ష్యం

సామాజిక, మత ఐక్యత, సామరస్యానికి విఘాతం

సీఏఏ, ఎన్నార్సీ అమలుపై శరద్ పవార్



**పుణె:** దేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే కేంద్ర ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ) అంశాలను ముందుకు తీసుకు వస్తుందని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధినేత శరద్ పవార్ ఆరోపించారు. మత, సామాజిక ఐక్యతను, దేశంలో సామరస్య వాతావరణాన్ని సీఏఏ భగ్నపరుస్తుందని శనివారం మీడియాతో చెప్పారు. 'కేవలం మైనారిటీలు మాత్రమే పరిమితం కాకుండా దేశ ఐక్యత, అభివృద్ధిని ఆకాంక్షించే వారంతా సీఏఏ, ఎన్నార్సీలను వ్యతిరేకిస్తారు' అని అన్నారు. సీఏఏ అమలు వల్ల పేదలపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజ పునరేకీకరణతో లబ్ధి పొందాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యోచిస్తున్నదన్నారు. సీఏఏలో పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల నుంచి వచ్చిన శరణార్థులకు మాత్రమే నూతన పౌరసత్వం ఇస్తామని ఎందుకు ప్రకటించారని, శ్రీలంక తమిళుల ఊసెందుకు లేదని ప్రశ్నించారు. కొన్ని రాష్ట్రాలు సీఏఏను స్వాగతిస్తాయన్న బీజేపీ అంచనాలకు భిన్నంగా ఆ పార్టీ అధికారంలో ఉన్న అసోంలో వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. సీఏఏను వ్యతిరేకిస్తున్న విపక్ష పార్టీల్లో ఎన్సీపీ ఒకటని చెప్పారు. సీఏఏను అమలు చేయడానికి మహారాష్ట్ర నిరాకరిస్తుందని ప్రకటించారు. బీహార్‌తోపాటు కేరళ, పంజాబ్, పశ్చిమబెంగాల్, రాజస్థాన్ సీఏఏను వ్యతిరేకిస్తున్నాయి.

## ఎన్నార్సీ తెస్తే రాష్ట్రం సగం ఖాళీ

- చాలా మంది వద్ద ఇండ్ల, భూముల పత్రాలు లేవు
- ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ వెల్లడి



**రాయ్‌పూర్:** జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ)ని అమలు చేస్తే తమ రాష్ట్రంలోని జనాభాలో సగం మంది పౌరసత్వాన్ని నిరూపించుకోలేరని ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భగేల్ చెప్పారు. ఎందుకంటే వారి పూర్వికులు వలస జీవులని, నిరక్షరాస్యులని.. కాబట్టి వారి వద్ద ఎలాంటి పత్రాలు ఉండవని తెలిపారు. అంతేగాక వారి వద్ద తమ భూమికి సంబంధించిన రికార్డులు కూడా సరిగా ఉండవని పేర్కొన్నారు. అలాంటప్పుడు పౌరసత్వాన్ని నిరూపించుకునే పత్రాలు చూపించాలని అడిగితే 50 లేదా 100 ఏండ్ల కిందటి పత్రాలను వాళ్లు ఎక్కడి నుంచి తీసుకొస్తారని ప్రశ్నించారు. 1906లో ఆఫ్రికా దేశంలో బ్రిటీష్ చేపట్టిన వ్యక్తుల గుర్తింపు ప్రక్రియ (ఎన్నార్సీ లాంటిది)ను గాంధీ వ్యతిరేకించారని గుర్తుచేశారు.

## గుజరాత్‌లో ముగ్గురికి భారత పౌరసత్వం

2007లో పాక్‌నుంచి వచ్చిన కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్లు మంజూరు

**మోర్బీ:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నా, గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో బీజేపీ లోక్‌సభ సభ్యుడు మోహన్ కుండారియా శరణార్థి కుటుంబానికి చెందిన ముగ్గురికి పౌరసత్వ సర్టిఫికెట్లను శనివారం అందజేశారు. 2007లో పాకిస్థాన్ నుంచి భారత్‌కు వలస వచ్చిన హర్సింగ్ సోధా, సరూప్ సిన్హ్ సోధా, పర్బత్ సిన్హ్ సోధాలకు మోర్బీలోని వాఫ్డీ గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమంలో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా కుండారియా మాట్లాడుతూ పాకిస్థాన్ నుంచి వేల మంది శరణార్థులు గుజరాత్‌కు వచ్చి మోర్బీలో నివస్తున్నారని, తాజా చట్టం వల్ల వారంతా పౌరసత్వం పొందుతారని చెప్పారు. లబ్ధిదారుల్లో ఒకరైన హర్సింగ్ సోధా మాట్లాడుతూ .. 'మేం 2007లో పాకిస్థాన్ నుంచి భారత్‌కు వచ్చాం. ఈ రోజు మేం భారత పౌరులం. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు మేం ధన్యవాదాలు తెలుపుతున్నాం' అని చెప్పారు.

# పౌర ఆగ్రహజ్వాల

- సీఏఏకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కొనసాగుతున్న నిరసనలు
- ఉత్తరప్రదేశ్‌లో మరోసారి హింస.. కాన్పూర్, రాంపూర్‌లలో అల్లర్లు
- పోలీస్ పోస్ట్‌తోపాటు పలు వాహనాలకు నిప్పు
- బీహార్‌లో ఆర్జేడీ ఆధ్వర్యంలో బంద్
- ఢిల్లీలో క్రమంగా సద్దుమణుగుతున్న పరిస్థితులు
- బెంగాల్, అసోంలలో శాంతియుత నిరసనలు



ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పోలీసు ఔట్‌పోస్టువద్ద వాహనాలకు నిప్పపెట్టిన ఆందోళనకారులు

**న్యూఢిల్లీ/లక్నో/కోల్‌కతా/గువాహటి/పాట్నా, డిసెంబర్ 21:** వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. వివిధ రాష్ట్రాల్లో శనివారమూ ఆందోళనలు కొనసాగాయి. అల్లర్లతో ఉత్తరప్రదేశ్ అట్టుడుకుతున్నది. కాన్పూర్‌లో ఆందోళనకారులు పోలీస్ పోస్ట్‌కు నిప్పంటించారు. రాంపూర్‌లో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణ జరిగింది. రాష్ట్రంలో హింసాత్మక ఘటనల్లో చిన్నారి (8)తోపాటు 15 మంది మృతిచెందారు. అల్లర్లలో 260 మందికిపైగా పోలీసులు గాయపడ్డారని, వీరిలో 57 మంది కి బుల్లెట్ గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. బీహార్‌లో విపక్ష ఆర్జేడీ రాష్ట్ర బంద్ జరిపింది. పశ్చిమబెంగాల్, అసోం, మేఘాలయలో శాంతియుత వాతావరణం నెలకొంది. ఢిల్లీలోనూ సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి.

**అట్టుడుకుతున్న యూపీ..**

సీఏఏ వ్యతిరేక ఆందోళనలతో ఉత్తరప్రదేశ్ అట్టుడుకుతున్నది. శనివారం పలు ప్రాంతాల్లో హింసాకాండ జరిగింది. కాన్పూర్‌లో నిరసనకారులు ఒక పోలీస్ పోస్ట్, పలు వాహనాలకు నిప్పుపెట్టారు. దీంతో పోలీసులు బాష్పవాయు గోళాలతో ఆందోళనకారులను చెదరగొట్టారు. ఘర్షణలో పలువురు గాయపడ్డారు. మరోవైపు, రాంపూర్‌లో ఆందోళనకారులు చేపట్టిన బంద్ హింసాత్మకమైంది. ఈద్గాకు సమీపంలో గుమిగూడిన సుమారు 400–500 మంది నిరసనకారులు పోలీసులపై రాళ్లు రువ్వారని రాంపూర్ కలెక్టర్ ఆంజనేయ సింగ్ తెలిపారు. ఘర్షణలో ఒకరు మృతిచెందారు. నిరసనలో 'బయటి వ్యక్తుల' ప్రమేయం ఉన్నట్లు ఆంజనేయ సింగ్ అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు ఏ కాల్పులు జరుపలేదని, కానీ ఒక నిరసనకారుడికి బుల్లెట్ గాయం అయినట్లు చెప్పారు. నాలుగురోజులు ప్రశాంతంగా ఉన్న అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలో మళ్లీ నిరసనలు మొదలయ్యాయి. పోలీసుల దమనకాండను నిరసిస్తూ ఏఎంయూ టీచర్స్ అసోసియేషన్, వర్సిటీ బోధనేతర సిబ్బంది శనివారం ఆందోళన చేపట్టారు. పోలీసులు ఒక్క తూటా కూడా పేల్చలేదని, ఆందోళనకారుల క్రాస్ ఫైరింగ్ వల్ల మరణాలు చోటుచేసుకున్నట్లు డీజీపీ ఓపీ సింగ్ చెప్పారు. ఆందోళనకారులు మహిళలను, పిల్లలను రక్షణకవచంగా వాడుకుంటున్నారన్నారు. సీఏఏ అంటే ఏమిటో తెలియని 8–12 ఏండ్ల పిల్లలూ నిరసనల్లో కనిపిస్తున్నారని, వారణాసిలో ఆందోళన సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో బాలుడు (8) ప్రాణాలు కోల్పోయాడన్నారు. లక్నోలో ఇప్పటివరకు 218 మందిని అరెస్ట్ చేశామని, అల్లర్లపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. ఆందోళనల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సోమవారం వరకు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు.

**మేఘాలయలో మొబైల్ ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరణ**

మేఘాలయలో మొబై ల్ ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించారు. అసోంలో సీఏఏకి వ్యతిరేకంగా పలు ప్రాంతాల్లో ప్రజలు శాంతియుత నిరసనలు చేపట్టారు. గువాహటిలో భారీగా మహిళలు నిరసనల్లో పాల్గొన్నారు. ఆల్ అసోం స్టూడెంట్స్ యూనియన్(ఆసు) నిరసన దీక్ష చేపట్టింది. దిబ్రూగఢ్‌లో శాంతి భద్రతలు మెరుగుపడడంతో కర్ఫ్యూ 16 గంటలు సడలించారు. పశ్చిమ బెంగాల్‌లో పటిష్ఠ భద్రత చేపట్టారు. కోల్‌కతాలో ప్రెసిడెన్సీ, జాదవ్‌పూర్, ఇతర యూనివర్సిటీల విద్యార్థులు నిరసన ర్యాలీ జరిపారు.

- ఢిల్లీలో సీఏఏకి వ్యతిరేకంగా హింసాత్మక ఘటనలు జరిగిన ప్రాంతాల్లో పరిస్థితులు మెరుగుపడుతున్నాయి. శుక్రవారం హింస జరిగిన పాత ఢిల్లీలోని దర్యాగంజ్, ఈశాన్యఢిల్లీలోని సీమాపురి ప్రాం తాల్లో భారీగా బలగాలను మోహరించారు. దర్యాగంజ్‌లో హింస ఘటనలో భీం ఆర్మీ చీఫ్ చంద్ర శేఖర్ ఆజాద్‌తో పాటు మరో 15 మందిని ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. సీమాపురి ఘటనలో 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు జామియా యూనివర్సిటీ విద్యార్థులు శనివారమూ ఆందోళన చేశారు. వందల విద్యార్థులు, కార్యకర్తలు ఇండియాగేట్ ఎదుట నిరసన చేపట్టారు.
- మహారాష్ట్రలోని ముంబైలో సీఏఏకి మద్దతుగా వందల మంది ర్యాలీ జరిపిప్రధాని మోదీకి అనుకూలంగా నినాదాలు చేశారు.
- కేరళలోని కోజికోడ్‌లో ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్‌చేశారు.
- తమిళనాడులోని చెన్నైలో ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ జరిగింది.
- హైదరాబాద్‌లోని ఓల్డ్ సిటీలో స్వచ్ఛంద బంద్ పాటించారు.

### లండన్‌లో గాంధీ విగ్రహం వద్ద నిరసన



**లండన్:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), ప్రతిపాదిత జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ)లకు వ్యతిరేకంగా బ్రిటన్ రాజధాని లండన్‌లోని పార్లమెంట్ స్క్వేర్ పరిధిలో గల గాంధీజీ విగ్రహం వద్ద వందల మంది శనివారం నిరసన తెలిపారు. 'భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం' అన్న సందేశంతో ఆందోళనకారులు త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తూ.. 'ఆజాదీ' నినాదాలతో హోరెత్తించారు. బ్రిటన్ కేంద్రంగా పని చేస్తున్న దక్షిణాసియా సంఘాల ప్రతినిధులు 'సీఏఏ, ఎన్నార్సీలను ఉపసంహరించాలి' అని రాసిన ప్లకార్డులు ప్రదర్శించారు. జామియా, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీల్లో ప్రదర్శనలకు సంఘీభావంగా ఆందోళనకు దిగామన్నారు.

### స్తంభించిన బీహార్

సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష ఆర్జేడీ నిర్వహించిన బంద్‌తో బీహార్ స్తంభించింది. రోడ్డు, రైలు సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెదురుకర్రలు, పార్టీ జెండాలు చేతబట్టిన ఆర్జేడీ కార్యకర్తలు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లను చుట్టుముట్టారు. బంద్‌ను ధిక్కరించి రోడ్డెక్కిన పలు రిక్షాలు, ట్యాక్సీలను ధ్వంసం చేశారు. ఆర్జేడీ నేత, ప్రతిపక్ష నాయకుడు తేజస్వియాదవ్.. బిర్ చంద్ పటేల్ మార్గ్‌లోని పార్టీ కార్యాలయం నుంచి డాక్ బంగ్లా క్రాసింగ్ వరకు భారీ మార్చ్ నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పాట్నాలోని పలు ప్రాంతాల్లో ఆర్జేడీ కార్యకర్తలు ప్రజలకు రోజా పువ్వు అందించి బంద్‌కు మద్దతునివ్వాలని అభ్యర్థించారు. బంద్‌కు కాంగ్రెస్, ఆర్ఎల్ఎస్పీ మద్దతు ప్రకటించాయి. ఆర్ఎల్ఎస్పీ అధ్యక్షుడు ఉపేంద్ర కుశ్వాహ్ పాట్నాలో నిర్వహించిన మార్చ్‌లో పాల్గొన్నారు. నవాడాలో ఆందోళనకారులు జాతీయ రహదారి–31ని దిగ్బంధించారు. రోడ్డుపై టైర్లకు నిప్పంటించారు.

## పంట రుణాలు మాఫీ: ఉద్ధవ్



**న్యూఢిల్లీ, డిసెంబర్ 21:** మహారాష్ట్ర రైతులకు ఆ రాష్ట ప్రభుత్వం తీపి కబురు అందించింది. రూ.2 లక్షల వరకు రైతులు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేస్తున్నట్లు తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30 లోపు తీసుకున్న రుణాలకు ఈ రుణ మాఫీ వర్తిస్తుంది. శీతాకాల అసెంబ్లీ సమావేశాల చివరి రోజు శనివారం ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే అసెంబ్లీలో ఈ మేరకు ప్రకటన చేశారు. 'ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ లోపు రైతులు తీసుకున్న పంట రుణాలను మా ప్రభుత్వం మాఫీ చేస్తుంది. గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు మాఫీ అవుతుంది. మహాత్మా జ్యోతిరావు పూలే రుణ మాఫీ పథకంగా దీన్ని అమలు చేస్తాం' అని తెలిపారు. సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు ప్రత్యేక పథకం అమలు చేస్తామన్నారు. అసెంబ్లీ వాయిదా పడిన తర్వాత ఆర్థిక మంత్రి జయంత్ పాటిల్ మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యులు, రాష్ట్ర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వాధికారులకు ఈ రుణ మాఫీ వర్తించబోదని స్పష్టం చేశారు.

## సరిహద్దు సమస్యపై భారత్, చైనా చర్చలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 21:** భారత్, చైనా మధ్య దశాబ్దాలుగా నెలకొన్న సరిహద్దు సమస్యను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. దీని కోసం ప్రయత్నాలను వేగవంతం చేయాలని సంకల్పించాయి. ఢిల్లీలో శనివారం జరిగిన 22వ రౌండ్ చర్చల్లో ఇరు దేశాలు ఈ మేరకు ప్రతిపాదించినట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రత్యేక ప్రతినిధుల చర్చల్లో భాగంగా చైనా విదేశీ వ్యవహారాల మంత్రి వాంగ్, భారత జాతీయ భద్రతా సలహాదారుడు అజిత్ దోవల్ భేటీ అయినట్లు తెలిపింది. భారత్ చైనా సరిహద్దుల మధ్య 3,488 కి.మీ మేర ఉన్న వాస్తవ నియంత్రణ రేఖపై పలు వివాదాలున్నాయి. అరుణాచల్ ప్రదేశ్ దక్షిణ టిబెట్‌లో భాగమని చైనా వాదిస్తుండగా దాన్ని భారత్ ఖండిస్తున్నది. ఈ నేపథ్యంలో సరిహద్దు సమస్యను శాంతియుతంగా, పరస్పర నమ్మకంతో పరిష్కరించుకోవాలని భావించిన భారత్, చైనా పలు దఫాలుగా చర్చలు జరుపుతున్నాయి. ఇందులో భాగంగా 22వ రౌండ్ చర్చలు ఇరు దేశాలకు చెందిన ప్రత్యేక ప్రతినిధుల మధ్య జరిగాయి. ఈ సమస్యకు తుది పరిష్కారం లభించేంత వరకు సరిహద్దులో శాంతియుత పరిస్థితులు కొనసాగాల్సిన అవసరం ఉందని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఏండ్లనాటి ఈ సమస్యను నమ్మకమైన నిర్మాణాత్మక చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని అంగీకరించాయి.

## గాంధీజీ వారసత్వాన్ని కొనసాగిస్తాం

అమెరికా ప్రతినిధుల సభలో బిల్లు

**వాషింగ్టన్:** భారత జాతిపిత మహాత్మా గాంధీ, అమెరికా పౌర హక్కుల ఉద్యమ నేత మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌పై యూఎస్ ప్రతినిధుల సభలో ఓ బిల్లును ప్రవేశపెట్టారు. ప్రముఖమైన వారి వారసత్వాలపై ప్రచారం కోసం ఏటా 30 మిలియన్ డాలర్ల చొప్పున ఐదేండ్ల కాలంలో 150 మిలియన్ డాలర్ల నిధుల కేటాయింపును కోరుతూ అమెరికాకు చెందిన ప్రముఖ పౌర హక్కుల నేత, ఎంపీ జాన్ లూయిస్ ఈ బిల్లును సభ ముందుంచారు. గాంధీజీ 150వ జయంతిని పురస్కరించుకుని ప్రపంచంలో రెండు అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య బలమైన స్నేహాన్ని కాంక్షిస్తూ గాంధీ–కింగ్ సేవల గౌరవార్థం ఈ బిల్లును తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ(యూఎస్ఏఐడీ) ఆధ్వర్యంలో గాంధీ–లూథర్‌కింగ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేయడం ఈ బిల్లు ముఖ్యోద్దేశమన్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా స్వచ్ఛంద సంస్థల నుంచి సేకరించే విరాళాలను విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారిత వంటి కార్యక్రమాలకు కేటాయింపును అమెరికా, భారత్ ప్రభుత్వాలతో కూడిన పాలక మండలి పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఈ బిల్లుకు ఆరుగురు డెమోక్రాటిక్ సభ్యులు కూడా మద్దతిచ్చారు. వీరిలో ముగ్గురు భారత అమెరికన్లు అమి బిరా, రొ ఖన్నా, ప్రమీలా జయపాల్ ఉన్నారు.



హైదరాబాద్‌లోని దారుసలాం మైదానంలో శనివారం రాత్రి జరిగిన సభకు హాజరైన ప్రజలు (ఇన్‌సెట్‌లో ) మాట్లాడుతున్న అసదుద్దీన్

## ప్రాణాలైనా అర్పిస్తా

- బతికున్నంతవరకు దేశం కోసం పోరాడుతా
- మజ్లిస్ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ
- సీఏఏను వెనక్కి తీసుకోవాలని డిమాండ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశాన్ని మత ప్రాతిపదికన విభజించే పౌరసత్వ సవరణ చట్టాన్ని(సీఏఏ) వ్యతిరేకిస్తున్నామని మజ్లిస్‌పార్టీ అధినేత , హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. శనివారం మజ్లిస్‌పార్టీ కార్యాలయం దారూసలాం మైదానంలో యునైటెడ్ ముస్లిం యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భారీ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ విధానం దేశాన్ని అస్థిరతకు గురిచేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వార్థపూరిత ఆలోచనలు మానుకోవాలని హెచ్చరించారు. ఆదివారం నుంచి దేశవ్యాప్తంగా ప్రతి ముస్లిం తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి 'ఈ దేశం మనది.. మనందరిదీ' అని మోదీ సర్కార్‌కు తెలియజేయాలన్నారు. దేశ ప్రజల మధ్య గాంధీజీ లేకున్నా, ఆయన జ్ఞాపకాలు ఉన్నాయని, అంబేద్కర్ మన మధ్య లేకపోయినా ఆయన రాసిన రాజ్యాంగం మనకు అండగా ఉందని ఒవైసీ చెప్పారు. ఇది హిందూ, ముస్లిం, ఎంఐఎం మధ్య గొడవ కాదని, దేశాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉన్నదని స్పష్టం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చరిత్ర అందరికీ తెలుసునని ఒవైసీ తెలిపారు. కేంద్రం తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం 'గాంధీ, అంబేద్కర్, అబ్దుల్ కలాంలను అవమానించినట్లేనన్నారు. ఈ దేశం కోసం తన ప్రాణాలైనా అర్పిస్తానని అసదుద్దీన్ ఒవైసీ భావోద్వేగపూరిత వ్యాఖ్యలు చేశారు. తాను బతికి ఉన్నంత వరకు ఎవరికీ అన్యాయం జరుగనివ్వబోనని, యువత భవిష్యత్ కోసం పోరాడుతానని ప్రతిన బూనారు. అసోంలో ఆందోళనకారులపై బుల్లెట్ల వర్షం కురుస్తు న్నదని, అయినా ఆందోళన ఆగదని స్పష్టం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏండ్ల తర్వాత ఎన్నార్సీ వల్ల 'నేను భారతీ యుడ్ని' అని నిరూపించుకునేందుకు దేశ ప్రజలంతా క్యూలో నిలబడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఎన్నార్సీ వల్ల నష్టమేగానీ లాభం లేదని చెప్పారు. దేశ ప్రజలను రెచ్చగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని, ముస్లింలు, ఆందోళనకారులు అహింసా యుతంగా, శాంతియుతంగా ఆందోళన చేయాలని, హింసకు దిగవద్దని హితవు చెప్పారు. సభలో పాల్గొన్న వారితో అసదుద్దీన్ ఒవైసీ 'ప్రతి ఒక్కరిది ఈ దేశం' అని ప్రతిజ్ఞ చేయించారు. సీఏఏకు వ్యతిరేకంగా ఓటేసినందుకు తెలంగాణ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. యూనివర్సిటీల్లోకి చొరబడి విద్యార్థులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలతోపాటు దేశవ్యా ప్తంగా నిరసనలు చేపట్టాలని ఈ సభ నిర్ణయించింది. ఈ సభలో జామియా ఉస్మానియా విద్యార్థి సంఘం నేత అయేషా రెహానా తదితరులు పాల్గొన్నారు.

## సీఏఏకు ప్రొఫెసర్లు మద్దతు

- 1,100 మంది సంతకాలతో సంయుక్త ప్రకటన విడుదల
- మతతత్వ, అరాచకత్వ ప్రచార ఉచ్చులో పడొద్దని నిరసనకారులకు పిలుపు

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని(సీఏఏ) వ్యతిరేకిస్తూ ఓ వైపు ఆందోళనలు జరుగుతుండగా.. మరో వైపు కొందరు ఈ చట్టాన్ని సమర్థిస్తూ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. తాజాగా సీఏఏకు మద్దతుగా దేశ, విదేశాలకు చెందిన పలు విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు శనివారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ సంయుక్త ప్రకటనపై 1,100 మంది ప్రొఫెసర్లు సంతకాలు చేశారు. సంతకాలు చేసినవారిలో రాజ్యసభ సభ్యుడు స్వపన్‌దాస్‌గుప్తా, ఐఐఎం షిల్లాంగ్ చైర్మన్ శిశిర్ బజోరియా, నలందా విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ సునయన సింగ్, జేఎన్‌యూ ప్రొఫెసర్ ఐనుల్ హసన్ తదితరులు ఉన్నారు. కొత్త పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనల మధ్య యూనివర్సిటీ ప్రొఫెసర్ల సంయుక్త ప్రకటన వచ్చింది. సీఏఏకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు సంయమనం పాటించాలని, మతతత్వ, అరాచకత్వ ప్రచార ఉచ్చులో పడకుండా జాగ్రత్తపడాలని వారు పిలుపునిచ్చారు. బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్‌లో మైనార్టీలుగా ఉన్నవారిని ఆదరిస్తే ఎందుకు తప్పుపడుతున్నారని వారు ప్రశ్నించారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజల సమస్యలపై కూడా కేంద్రం సరైన సమయంలో సానుకూల నిర్ణయాలు తీసుకొంటుందని, ఆయా రాష్ట్రాల ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురవ్వాల్సిన అవసరం లేదని వారు పేర్కొన్నారు. మరో వైపు, మహారాష్ట్రలోని పుణె నగరంలో వందలాదిమంది పౌరులు మానవహారంగా ఏర్పడి సీఏఏకు తమ మద్దతును ప్రకటించారు. జాతీయ పతాకాలను చేబూని సీఏఏకు అనుకూలంగా నినాదాలు చేశారు.

**ముస్లింలను కూడా చేర్చండి**

కొత్త పౌరసత్వ చట్టానికి సవరణ చేసి ముస్లింలను అందులో కలపాలని బీజేపీ మిత్రపక్షం శిరోమణి అకాలీ దళ్(ఎస్ఏడీ) కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మత ప్రాతిపదికన ఏ పౌరుణ్ణి కూడా ఈ చట్టం ద్వారా మినహాయించొద్దని కోరింది. మరోవైపు, సీఏఏపై ప్రజల్లో నెలకొన్న అపోహల్ని తొలిగించడానికి రానున్న పది రోజుల్లో పెద్దఎత్తున కార్యక్రమాలు చేపట్టనున్నట్టు బీజేపీ శనివారం ప్రకటించింది. బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా నేతృత్వంలో శనివారం ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. వివిధ జిల్లాల్లో 250 మీడియా సమావేశాల ద్వారా దాదాపు మూడు కోట్ల కుటుంబాలకు అవగాహన కల్పించనున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.



సీఏఏకు మద్దతుగా శనివారం ముంబైలో జరిగిన ర్యాలీ

## క్రీడా రాజధానిగా హైదరాబాద్: మంత్రి శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** దేశ క్రీడా రాజధానిగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని క్రీడా, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం తన చాంబర్‌లో మార్షల్ ఆర్ట్స్ జాతీయ చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులను మంత్రి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే క్రీడాపాలసీని తీసుకొచ్చేందుకు సీఎం కేసీఆర్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. హైదరాబాద్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు నిపుణుల సలహాలతో నూతన పాలసీ తీసుకొస్తామని మంత్రి పేర్కొన్నారు. గతంలో ఎవరూ చేయని అభివృద్ధిని సీఎం కేసీఆర్ చేసి చూపిస్తున్నారని అన్నారు. క్రీడలకు అవసరాన్ని బట్టి నిధులు విడుదల చేసేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా ముందుకు సాగాల్సిన అవసరముందని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న యువ క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.



# 'పది' పట్టాలని..



కోహ్లీ

**విండీస్‌పై వరుసగా పదో వన్డే సిరీస్ లక్ష్యంగా భారత్.. నేడు ఇరు జట్ల మధ్య మూడో వన్డే.. సైనీకి అరంగేట్రం చాన్స్**

**భారత్, వెస్టిండీస్ ఆఖరి పోరాటానికి సిద్ధమయ్యాయి. కటక్ వేదికగా ఇరు జట్లు ఆదివారం జరిగే నిర్ణయాత్మక పోరుకు సై అంటున్నాయి. ఓవైపు వెస్టిండీస్‌పై పదవ ద్వైపాక్షిక సిరీస్ సాధించాలనే లక్ష్యంతో కోహ్లీసేన కనిపిస్తుంటే మరోవైపు 13 ఏండ్లుగా ఊరిస్తూ వస్తున్న సిరీస్ గెలుపును ఈసారైనా ఒడిసిపట్టుకోవాలని విండీస్ పట్టుదలతో ఉన్నది. చెన్నై పోరులో ఓడినా విశాఖ వన్డేలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో టీమ్‌ఇండియా అదరగొట్టింది. బారాబతి పిచ్‌పై మరోసారి విశ్వరూపం చూపాలని బ్యాట్స్‌మెన్ తహతహలాడుతుంటే.. హ్యాట్రిక్ హీరో కుల్దీప్ యాదవ్ తిప్పేయాలని వేచిచూస్తున్నాడు. మరోవైపు ఈ మ్యాచ్ ఎలాగైనా గెలిచి ద్వైపాక్షిక సిరీస్‌ల్లో భారత్ చేతిలో ఎదురవుతున్న పరాజయాల పరంపరకు ఫుల్‌స్టాప్ పెట్టాలని విండీస్ భావిస్తున్నది. ఐపీఎల్ వేలంతో జోష్‌లో ఉన్న హిట్మైర్, కాట్రెల్‌పై ఆ జట్టు ఆశలు పెట్టుకుంది. ఫీల్డింగ్ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడం సహా బౌలింగ్‌లో రాణించాలని కసితో ఉన్న కోహ్లీసేనను కరీబియన్ జట్టు అడ్డుకోగలదేమో చూడాలి.**

**మధ్యాహ్నం: 1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో**

**1** మరో వికెట్ తీస్తే వన్డేల్లో భారత స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ 100 వికెట్ల మైలురాయిని చేరుకుంటాడు. వన్డేల్లో వేగంగా ఆ ఫీట్ సాధించిన భారత బౌలర్‌గా షమీ (56మ్యాచ్‌లు) రికార్డును అతడు సమం చేస్తాడు.

**కటక్:** నిర్ణయాత్మక పోరులో వెస్టిండీస్‌తో తలపడేందుకు టీమ్‌ఇండియా సిద్ధమైంది. చెన్నైలో జరిగిన తొలి మ్యాచ్‌లో ఓడినా విశాఖ వన్డేలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఉత్సాహంతో కోహ్లీసేన ఉంది. అదే ఊపును కొనసాగించి వెస్టిండీస్‌పై వరుసగా పదో ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను గెలవాలని పట్టుదలగా ఉంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్ – వెస్టిండీస్ మధ్య చివరి మ్యాచ్ ఆదివారం ఇక్కడి బారాబతి స్టేడియం వేదికగా జరుగనుంది. తొలి వన్డేలో విఫలమైన టీమ్ ఇండియా ఓపెనర్లు.. రెండో మ్యాచ్‌లో చెలరేగగా.. సిరీస్‌లో ఇంకా సారథి విరాట్ బ్యాట్ ఝుళిపించలేదు. బౌలింగ్‌లో భారత్‌కు గాయాల దెబ్బ తగిలినా.. బ్యాటింగ్ విభాగంలో మాత్రం పటిష్ఠంగా కనిపిస్తున్నది. విశాఖ వన్డేలో 107 పరుగుల భారీ విజయంతో టీమ్‌ఇండియా భరోసాగా ఉన్నా.. తొలి వన్డే చేదు అనుభవంతో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ఈ మ్యాచ్‌లోనైనా జట్టు ఫీల్డింగ్ తప్పిదాలను పునరావృతం చేయకూడదని కోహ్లీ ఆశిస్తున్నాడు. మరోవైపు విండీస్.. బ్యాటింగ్‌లో అదరగొడుతున్నా బౌలింగ్‌లో మాత్రం తేలిపోతున్నది. ఇన్నింగ్స్ ప్రారంభంలో వికెట్లు తీస్తే తప్ప టీమ్‌ఇండియా జోరును పొలార్డ్‌సేన అడ్డుకోవడం కష్టమే. కటక్‌లో మంచు కురవనుండడంతో టాస్ కూడా కీలకపాత్ర పోషించనుంది.

### కోహ్లీ బాకీ తీర్చుకుంటాడా..

చెన్నైలో విఫలమైన టీమ్‌ఇండియా ఓపెనర్లు రోహిత్‌శర్మ, కేఎల్ రాహుల్ రెండో వన్డేలో శతకాల మోత మోగించి.. 220 పరుగుల భాగస్వామ్యంతో సత్తాచాటారు. నాలుగో స్థానంలో వచ్చిన శ్రేయాస్ అయ్యర్ సిక్సర్ల మోతతో అదిరే అర్ధశతకం చేయగా.. రిషబ్ పంత్ (16బంతుల్లో 39) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. తొలి వన్డేలోనూ అర్ధశతకంతో ఆకట్టుకొని పంత్ గాడిలో పడ్డట్టే కనిపిస్తున్నాడు. అయితే, కెప్టెన్ కోహ్లీ మాత్రం ఈ సిరీస్‌లో ఇంకా బ్యాట్‌కు పనిచెప్పలేదు. తొలి మ్యాచ్‌లో 4పరుగులకే ఔట్ కాగా, రెండు వన్డేలో గోల్డెన్ డకౌటై నిరాశపరిచాడు. అయితే, విండీస్‌పై 71.66 బ్యాటింగ్ సగటు రికార్డుతో కొనసాగుతున్న కోహ్లీ నిర్ణయాత్మక మ్యాచ్‌లో భారీ ఇన్నింగ్స్‌తో సిరీస్‌లో బాకీ తీర్చుకోవాలనుకుంటున్నాడు. టీ20 సిరీస్‌లో మెరుపులతో విండీస్‌కు దడపుట్టించిన విరాట్ చివరి వన్డేలో విరుచుకుపడితే పొలార్డ్ గ్యాంగ్‌కు కష్టాలు తప్పవు.

### సైనీ అరంగేట్రం!

గాయం కారణంగా తొలుత భారత స్టార్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ సిరీస్ నుంచి వైదొలగగా, దీపక్ చాహర్ సైతం మూడో వన్డేకు దూరమయ్యాడు. దీంతో దీపక్ స్థానంలో వచ్చిన యువ సంచలనం నవ్‌దీప్ సైనీ ఈ మ్యాచ్‌తో వన్డేల్లో అరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నాయి. రంజీ ట్రోఫీలో ఢిల్లీ తరపున సైనీ ఇటీవల అద్భుతంగా బౌలింగ్ చేయడం సహా భువీ స్థానంలో వచ్చిన శార్దూల్ ఠాకూర్ రెండో వన్డేలో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. అయితే నిర్ణయాత్మక మ్యాచ్‌లో కోహ్లీ అనుభవానికి ఓటేసినా... ఇద్దరు పేసర్లతోనే బరిలోకి దిగాలని ఆలోచించినా సైనీకి తుది జట్టులో చోటు కష్టమవుతుంది. ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగితే మాత్రం సైనీకే ఎక్కువ అవకాశాలుంటాయి. గత మ్యాచ్‌లో హ్యాట్రిక్‌తో మ్యాజిక్ చేసిన చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు చాహల్ జతకలుస్తాడా అన్నది చూడాలి. షమీ కూడా మంచి ఫామ్‌లోనే ఉన్నాడు. అయితే జోరు మీదున్న విండీస్ బ్యాట్స్‌మెన్‌ను బారాబతి పిచ్‌పై కట్టడి చేయాలంటేభా రత బౌలర్లు మరింత జాగ్రత్తతో కట్టుదిట్టంగా బంతులేయాల్సిందే. అలాగే ఫీల్డింగ్ తప్పిదాలను సైతం సరిదిద్దుకొని ప్రతీక్యాచ్‌ను ఒడిసిపట్టాల్సినఅ వసరంఉ ంది.

### 13 ఏండ్ల నిరీక్షణకుతె రదించేందుకు..

తొలి వన్డేలో శతకం సహా ఇటీవల మంచి ఫామ్‌లో ఉన్న విండీస్ యువ బ్యాట్స్‌మన్ షిమ్రన్ హిట్మైర్, బౌలింగ్‌తో పాటు సెల్యూట్ సంబురాలతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన లెఫ్టార్మ్ పేసర్ కాట్రెల్ ఐపీఎల్ వేలం జోష్‌లో ఉన్నారు. కాట్రెల్‌ను రూ.8.5కోట్లతో పంజాబ్, హిట్మైర్‌ను రూ. 7.75కోట్లతో ఢిల్లీ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ ఆనందంలో మరింత అదరగొట్టాలని వారిద్దరూ పట్టుదలతో ఉన్నారు. రెండో మ్యాచ్‌లో శ్రేయస్ అద్భుత ఫీల్డింగ్‌కు హిట్మైర్ ఔట్ కాగా.. బౌలింగ్‌లో కాట్రెల్ ప్రభావం చూపలేకపోయాడు. అయితే తొలి వన్డేలో ఆదిలోనే కాట్రెల్ రెండు వికెట్లు తీసి భారత్‌ను దెబ్బకొట్టగా.. మరోసారి అలాంటి ప్రదర్శనే చేయాలనుకుంటున్నాడు. అద్భుత ఫామ్‌లో ఉన్నా.. వేలంలో అమ్ముడుపోని విండీస్ ఓపెనర్ షాయ్ హోప్ తన సత్తాను చాటాలని పట్టుదలగా ఉన్నాడు.

ఎలాగైనా ఈ మ్యాచ్‌లో గెలి చి భారత్‌పై వన్డేల్లో ద్వైపాక్షిక సిరీస్ విజయం కోసం 13ఏండ్లుగా వేచిచూస్తున్న విండీస్ నిరీక్షణకు తెరదించాలని కీరన్ పొలార్డ్ సైతం ప్రణాళికలు రచిస్తున్నాడు.



పొలార్డ్

"ఈ మ్యాచ్‌లోనూ సర్వశక్తులూ ఒడ్డుతాం. ఒకవేళ గెలువలేకపోయినా.. మా భవిష్యత్ ప్రణాళికపై ఏ మాత్రం ప్రభావం పడదు. మేం జట్టును పటిష్ఠంగా నిర్మించుకునే పథంలో సాగుతున్నాం. భారత్‌పై గెలువాలంటే తొలుత బ్యాటింగ్ చేస్తే 320పరుగులకు పైగానే చేయాల్సిందే"

- ఫిల్ సిమన్స్, విండీస్ హెడ్‌కోచ్

### తుది జట్లు(అంచనా) :

**భారత్:** రోహిత్‌శర్మ, కేఎల్ రాహుల్, విరాట్ కోహ్లీ(కెప్టెన్), శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్(వికెట్ కీపర్), కేదార్ జాదవ్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ షమీ, నవదీప్ సైనీ, శార్దూల్ ఠాకూర్/యజువేంద్ర చాహల్

**వెస్టిండీస్:** ఎవిన్ లూయిస్, షాయ్ హోప్(వికెట్ కీపర్), హిట్మైర్, రోస్టన్ చేజ్, నికోలస్ పూరన్, కీరన్ పొలార్డ్(కెప్టెన్), జేసన్ హోల్డర్, కీమో పాల్, అల్జారీ జోసెఫ్, క్యారీ పిరే, కాట్రెల్

### పిచ్, వాతావరణం

వర్షం పడే అవకాశం లేదు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశం ఉంది. రెండో ఇన్నింగ్స్‌లో మంచు కీలకం కానుంది. టాస్ గెలిచిన జట్టు ఛేదనకు ప్రాధాన్యమివ్వొచ్చు. దాదాపు మూడేండ్ల క్రితం ఈ స్టేడియంలో చివరగా వన్డే జరుగగా... ఆ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై భారత్ తొలుత బ్యాటింగ్‌కు దిగి 381పరుగులు చేసి, 15 పరుగుల తేడాతో గెలిచింది. ఆ మ్యాచ్‌లో యువరాజ్‌సింగ్ (150), మహేంద్రసింగ్ ధోనీ (134) శతకాలతో మోతెక్కించి నాలుగో వికెట్‌కు 256 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.



నిఖత్



హుసాముద్దీన్

## ట్రయల్స్‌లో నిఖత్‌కు రెండో ర్యాంక్

**న్యూఢిల్లీ:** ఒలింపిక్స్ క్వాలిఫయర్స్ ఎంపిక కోసం జరిగే జాతీయ ట్రయల్స్ మహిళల 51కేజీల విభాగంలో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ రెండో ర్యాంకు బాక్సర్‌గా బరిలోకి దిగనుంది. ఈనెల 27 నుంచి రెండు రోజుల పాటు ఇక్కడి ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగే ట్రయల్స్‌లో పాల్గొనే అన్ని విభాగాల పురుషుల, మహిళా బాక్సర్ల పేర్లను భారత బాక్సింగ్ సమాఖ్య(బీఎఫ్ఐ) శనివారం ప్రకటించింది. ఆరుసార్లు ప్రపంచ చాంపియన్ మేరీకోమ్ మహిళల 51కేజీల విభాగంలో మొదటి ర్యాంకులో ఉండగా.. రెండు, మూడు, నాలుగు ర్యాంకుల్లో వరుసగా నిఖత్, జ్యోతి గులియా, రితు గెర్వాల్ ఉన్నారు. ట్రయల్స్‌లో భాగంగా తొలుత 1-4, 2-3 ర్యాంకర్ల మధ్య ప్రాథమిక పోటీలు జరగనుండగా.. వాటిలో విజేతలు ఫైనల్లో తలపడతారు. అంటే తొలి మ్యాచ్‌లో మేరీకోమ్ - రితు, నిఖత్ - జ్యోతి పోటీ పడతారు. ఫైనల్లో గెలిచిన విజేత చైనాలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధిస్తారు. తొలి మ్యాచ్‌లో గెలిస్తే మేరీతో జరీన్ తలపడడం దాదాపు ఖాయమని చెప్పొచ్చు.

### 57కేజీల విభాగంలో హుసాముద్దీన్

పురుషుల జాతీయ ట్రయల్స్ 57కేజీల విభాగంలో నిజామాబాద్ బాక్సర్ మహమ్మద్ హుసాముద్దీన్ తొలి మ్యాచ్‌లో సచిన్‌తో పోటీ పడనున్నాడు.

## జెరెమీ రికార్డుల హోరు

**దోహా:** భారత యువ వెయిట్‌లిఫ్టర్ జెరెమీ లాల్‌రినుగా రికార్డుల మీద రికార్డులు కొల్లగొడుతున్నాడు. ఆరవ ఖతార్ ఇంటర్నేషనల్ కప్‌లో రజత పతకంతో మెరిసిన జెరెమీ సరికొత్త రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. పురుషుల 67కిలోల విభాగంలో బరిలోకి దిగిన ఈ మణిపూర్ యువ కెరటం స్నాచ్, క్లీన్ అండ్ జర్క్‌లో మొత్తం 306 కిలోలు(140కి+166కి) ఎత్తి తన పేరిటే ఉన్న యూత్ వరల్డ్ రికార్డుతో పాటు ఆసియా ప్రదర్శనను తిరుగరాశాడు. ఇప్పటికే జెరెమీ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 27 రికార్డులను తన పేరు మీద లిఖించుకున్నాడు. ఇందులో 12 అంతర్జాతీయ రికార్డులు



(మూడు యూత్ వరల్డ్, మూడు యూత్ ఆసియా, ఆరు కామన్వెల్త్) ఉన్నాయి. ఇక జాతీయ స్థాయిలో 15 రికార్డులను లాల్‌రినుగా సొంతం చేసుకున్నాడు.




## చివరి నిమిషంలో చేజారిన గెలుపు

హైదరాబాద్ - ఏటీకే మ్యాచ్ డ్రా

**హైదరాబాద్:** మ్యాచ్ చివరి నిమిషంలో ఏటీకే ఆటగాడు రాయ్‌కృష్ణ గోల్ చేయడంతో హైదరాబాద్ ఎఫ్‌సీకి గెలుపు కొద్దిలో చేజారింది. ఇండియన్ సూపర్ లీగ్(ఐఎస్ఎల్) ఆరో సీజన్‌లో భాగంగా ఇక్కడి గచ్చిబౌలి స్టేడియంలో హైదరాబాద్ – అట్లెటికో డి కోల్‌కతా(ఏటీకే) మధ్య శనివారం జరిగిన మ్యాచ్ 2–2తో డ్రాగా ముగిసింది. ఆతిథ్య జట్టు తరపున బోబో (39వ, 85వ నిమిషం), ఏటీకే తరపున రాయ్ కృష్ణ(15వ, 90వ ని.) ఇద్దరూ డబుల్ గోల్స్ చేయడం విశేషం. రెండో విజయం కోసం సొంతగడ్డపై బరిలోకి దిగిన హైదరాబాద్ మ్యాచ్ ప్రారంభంలో దూకుడుగా ఆడింది. ఏడో నిమిషంలోనే బోబో గోల్ పోస్ట్‌వైపునకు బంతిని బలంగా కొట్టగా కొన్ని ఇంచుల తేడాతో మిస్సయింది. అయితే 15వ నిమిషంలో ఏటీకే ఆటగాడు కృష్ణ గోల్‌తో ఖాతా తెరువగా.. 33వ నిమిషంలో హైదరాబాద్ స్టార్ బోబో అద్భుత షాట్‌తో సమం చేశాడు. మ్యాచ్ 85వ నిమిషంలో మెర్సిలినో అందించిన బంతిని బోబో విజయవంతంగా గోల్ చేసి హైదరాబాద్‌ను ఆధిక్యంలోకి నిలిపాడు. హైదరాబాద్ గెలుపు ఖాయమనుకుంటున్న సమయంలో ఏటీకే ఆటగాడు కృష్ణ గోల్ చేసి మ్యాచ్‌ను సమం చేశాడు.

## రాధా యాదవ్ @ 2

**దుబాయ్:** ఐసీసీ శనివారం విడుదల చేసిన తాజా మహిళల టీ20 ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్నర్ రాధా యాదవ్ తన ర్యాంక్‌ను నిలబెట్టుకుంది. 769 పాయింట్లతో రాధ రెండో ర్యాంక్‌లో కొనసాగుతున్నది. దీప్తి శర్మ(726), పూనమ్ యాదవ్(716) ఒక్కో ర్యాంక్



చేజార్చుకుని వరుసగా ఐదు, ఆరు ర్యాంక్‌ల్లో నిలిచారు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో జెమీమా రోడ్రిగ్స్ (699), స్మృతి మంధన (669).. నాలుగు, ఏడు ర్యాంక్‌ల్లో ఉన్నారు. టీమ్ ఇండియా 260 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో కొనసాగుతున్నది.

### రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

**మహబూబ్‌నగర్ స్పోర్ట్స్:** జిల్లా కేంద్రంలోని స్టేడియంలో రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలను క్రీడా, పర్యాటక శాఖ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముదిమి వయసులో మైదానంలో పరుగులు తీయాలంటే అది క్రీడలతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్ పాల్గొన్నారు.

### భారత పేస్ దళం భేష్: స్టెయిన్

**జొహన్నెస్‌బర్గ్:** ప్రపంచంలోనే భారత్‌ది అత్యుత్తమ పేస్ బౌలింగ్ దళమని దక్షిణాఫ్రికా స్పీడ్‌స్టర్ డెయిల్ స్టెయిన్ అన్నాడు. తాజాగా జరిగిన ఐపీఎల్ వేలం పాటలో ఆర్‌సీబీ ఫ్రాంచైజీ రూ.2 కోట్లకు స్టెయిన్‌ను తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్విట్టర్‌లో అభిమానులు అడిగిన ప్రశ్నలకు ఈ సఫారీ బౌలర్ సమాధానమిచ్చాడు.

## అబిద్ రికార్డు శతకం

**కరాచీ:** పాకిస్థాన్ ఆటగాడు అబిద్ అలీ తన తొలి రెండు టెస్టుల్లో వరుసగా శతకాలు బాది.. ఈ ఘనత సాధించిన తొలి పాకిస్థానీ ప్లేయర్‌గా.. ఓవరాల్‌గా తొమ్మిదో ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అలాగే, ఒకే ఇన్నింగ్స్‌లో సెంచరీలు బాదిన పాకిస్థాన్ మూడో ఓపెనింగ్ జోడీగా అబిద్ అలీ(174), షాన్ మసూద్(135) నిలువడంతో శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో భారీ ఆధిక్యం దిశగా ఆతిథ్య జట్టు దూసుకెళుతున్నది. రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లకు 395 పరుగుల వద్ద మ్యాచ్ మూడో రోజైన శనివారం ఆటను పాక్ ముగిచింది. క్రీజులో కెప్టెన్ అజర్ అలీ(55నాటౌట్), బాబర్ ఆజం(22నాటౌట్) ఉండగా.. 315 పరుగుల ఆధిక్యంలో పాక్ నిలిచింది. వికెట్లేమీ నష్టపోకుండా 57పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో దిగిన పాకిస్థాన్‌కు 278పరుగుల భాగస్వామ్యంతో అబిద్, మసూద్ ఎదురులేని ఆరంభాన్నిచ్చారు. టెస్టు చరిత్రలో పాక్‌కు ఇది రెండో అత్యుత్తమ తొలి వికెట్ భాగస్వామ్యం కావడం విశేషం. లంకతో తొలి టెస్టులో అరంగేట్రం చేసిన అబిద్(109) అజేయ శతకం సాధించగా.. ఆ మ్యాచ్ డ్రాగా ముగిసిన సంగతి తెలిసిందే.



అబిద్ అలీ, షాన్ మసూద్



### హరిందర్‌కు టైటిల్

**ముంబై:** భారత యువ స్క్వాష్ ఆటగాడు హరిందర్‌పాల్ సింగ్ సంధు..హెచ్‌సీఎల్-ఎస్ఆర్ఎఫ్ఐ ఇండియా టూర్ టైటిల్ విజేతగా నిలిచాడు. శనివారం జరిగిన పురుషుల ఫైనల్లో హరిందర్ 3-0 తేడాతో తొమోటకా ఎండో(జపాన్)పై విజయం సాధించాడు. అరగంటలోనే ముగిసిన పోరులో హరిందర్ ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి వరుస గేముల్లో చిత్తుచేశాడు. మరోవైపు మహిళల టైటిల్‌ను హనా రమాదిన్ (ఈజిప్టు) దక్కించుకుంది.

## ఆ సమయంలో ఎంతో వేదన పడ్డా

**న్యూఢిల్లీ:** మోచేతి గాయం వల్ల 2004లోనే క్రికెట్‌కు దూరమవుతానేమోనని ఎంతో మనోవేదనకు గురయ్యానని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన కెరీర్‌లో ఎదురైన కఠిన క్షణాలను గుర్తు చేసుకొని భావోద్వేగానికి లోనయ్యాడు. శనివారం ఓ టీవీ కార్యక్రమంలో పాల్గొన్న మాస్టర్ బ్లాస్టర్ తన అనుభవాలను పంచుకున్నాడు. 'మోచేతి గాయం తగ్గేందుకు ఇంజెక్షన్లు తీసుకున్నా, వ్యాయామాలు చేసినా ఫలితం లేకపోవడంతో శస్త్రచికిత్స అనివార్యమైంది. ఆపరేషన్ తర్వాత బ్యాట్ కూడా ఎత్తలేకపోయా. దీంతో మళ్లీ క్రికెట్ ఆడలేనేమోనని అప్పట్లో ఎంతో వేదన, అసహనానికి గురయ్యా. అర్ధరాత్రిళ్లు స్నేహితులకు ఫోన్ చేసి బయటకి వెళదామని చెప్పేవాడిని. అసలు నిద్రపట్టేది కాదు. కెరీర్ ముగిసిందని అనుకున్నా. నా కెరీర్‌ను ఈ విధంగా ఆపేయొద్దని, మైదానంలోకి మళ్లీ తీసుకెళ్లాలని దేవుడిని ఎన్నోసార్లు ప్రార్థించా. ఆ తర్వాత నాలున్నర నెలల్లో శ్రీలంకతో నాగ్‌పూర్‌లో జరిగిన వన్డేతో పునరాగమనం చేశా.



అప్పటి ఫీలింగ్‌ను నేనెప్పుడూ మరిచిపోలేను. నాకు కావాల్సింది ఇదే అంటూ ఆ సమయంలో ఆకాశం వైపు చూస్తూ దేవుడికి కృతజ్ఞతలు చెప్పా. నేను కోలుకునేందుకు కుటుంబం, స్నేహితులు ఎంతో తోడ్పాటునందించారు. నా జీవితంలోని అన్ని కష్ట సమయాల్లో నా భార్య అంజలి తోడుగా నిలిచింది' అని సచిన్ చెప్పాడు.

### ఆరోగ్యాన్ని పణంగా పెట్టి..

2003 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ బౌలింగ్‌ను చీల్చిచెండాడిన సచిన్ టెండూల్కర్ విన్యాసం గురించి అందరికీ తెలిసినా.. ఆ తర్వాత శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ఆడిన విషయం చాలా తక్కువ మందికి తెలుసు. ఆ సందర్భాన్ని సచిన్ తాజాగా గుర్తు చేసుకున్నాడు. డయేరియాతో నీరసించిపోయినా ఉప్పు కలిపిన నీరు తాగుతూ బ్యాటింగ్ చేసినట్టు తెలిపాడు. నిలబడగలనా.. బ్యాటింగ్ చేయగలనా అని ఆలోచించలేదని, ఎప్పుడైనా మైదానంలోకి దిగాలనే అనుకునే వాడినని టెండూల్కర్ చెప్పాడు. నీరసంగా ఉన్నా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 97 పరుగులతో మాస్టర్ బ్లాస్టర్ టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. ఆ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 183 పరుగుల భారీ తేడాతో గెలిచింది.



విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న కొమురవెల్లి మల్లన్న దేవాలయం

నేడు కొమురవెల్లి

# మల్లన్న కల్యాణం

పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి హరీశ్‌రావు

**చేర్యాల, నమస్తేతెలంగాణ:** కోరమీసాల కొమురవెల్లి మల్లన్న కల్యాణానికి సిద్ధమయ్యాడు. ఆదివారం ఉదయం 10.45గంటలకు కల్యాణ వేడుకను నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కల్యాణోత్సవానికి రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు 50 వేల మంది భక్తులు హాజరుకానున్నారని ఆలయవర్గాలు వెల్లడించాయి. ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించనున్నారు. ఈ మహోత్సవానికి మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మండలి చీఫ్‌విప్ బోడికుంటి వెంకటేశ్వర్లు, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు.

# మహిమాన్విత క్షేత్రం.. వేములవాడ

ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర్‌రావు



వేములవాడ రాజన్నను దర్శించుకున్న చాగంటి కోటేశ్వర్‌రావు. చిత్రంలో మంత్రి గంగుల

**వేములవాడ కల్చరల్:** వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామి వారి క్షేత్రం మహిమాన్వితమైనదని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు పేర్కొన్నారు. శనివారం రాజన్న ఆలయానికి వచ్చిన ఆయన.. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అద్దాలమండపంలో ఆలయ అర్చకులు, వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేయగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చాగంటి మాట్లాడుతూ.. రాజన్న ఆలయం చాలా గొప్పదన్నారు. తాను గతంలో వేములవాడకు వచ్చిన క్రమంలో స్వామివారిని వేడుకుని కోడెమొక్కు చెల్లించానని, అందులోభాగంగా తమ వంశం అభివృద్ధికావడానికి రాజేశ్వరస్వామికి కోడెమొక్కు మొక్కానని తెలిపారు. అందుకు స్వామివారు అనుగ్రహం కలిగినందున కుటుంబ సభ్యులతో కలిసి కోడెమొక్కు చెల్లించుకున్నట్టు తెలిపారు. శ్రీపార్వతీ రాజేశ్వరస్వామివారి క్షేత్రం హరిహరక్షేత్రంగా, మతసామరస్యానికి ప్రతీకగా ఆలయంలో దర్గా ఉండటం విశేషంగా చెప్పుకోవచ్చన్నారు. భవిష్యత్తులో ఈ క్షేత్రం గొప్ప పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందన్నారు.



## 25న బాసర ఆలయం మూసివేత

**బాసర:** సూర్యగ్రహణం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయాన్ని ఈనెల 25న మూసి వేయనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. 26న సంపూర్ణ సూర్యగ్రహణం సందర్భంగా 25న సాయంత్రం 6.15 గంటలకు ఆలయాన్ని మూసివేసి 26న ఉదయం 11.30 గంటలకు తెరవనున్నట్టు పేర్కొన్నారు. సంప్రోక్షణ తరువాత సరస్వతి అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు సర్వ దర్శన సేవలను కల్పించనున్నట్టు అధికారులు తెలిపారు.

## సెల్‌ఫోన్ పేలి..ట్రాక్టర్ కిందపడి

**బీర్కూర్:** ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తి జేబులో సెల్‌ఫోన్ పేలడంతో భయపడి కిందకు దూకగా.. అదే ట్రాక్టర్ చక్రాల కింద నలిగి మరణించాడు. బీర్కూర్ ఎస్సై సతీశ్‌వర్మ వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని వీరాపూర్‌కు చెందిన మావురం సాయిలు (38) పొలంలో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్నాడు. ఈ క్రమంలో అతడి షర్ట్ జేబులో ఉన్న సెల్‌ఫోన్ ఒక్కసారిగా పేలింది. భయంతో సాయిలు ట్రాక్టర్ పైనుంచి దూకే ప్రయత్నం చేశాడు. కిందపడిన సాయిలు పైనుంచి కేజ్‌వీల్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

## లారీ ఢీకొని హోంగార్డు మృతి



సలీం (ఫైల్)

**మానకొండూర్ రూరల్:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం తాడికల్‌కు చెందిన సలీం(25) సిద్దిపేటలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. కరీంనగర్‌లోనే నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి తాడికల్ వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా గట్టుదుద్దెనపల్లి శివారులో లారీ (ఏపీ 31 టీఎఫ్ 1629) ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో సలీం అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ ఆపకుండా వెళ్లగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో తాడికల్ ప్రాంతంలో పోలీసులు పట్టుకున్నారు. కాగా సలీంకు ఏడాది క్రితం వివాహమైంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మానకొండూర్ సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

# గోదారమ్మ ఉరకలు

కొనసాగుతున్న ఎత్తిపోతలు
ఎస్సారార్‌లో 23.085 టీఎంసీలు
సరస్వతి బరాజ్‌లో 7.58 టీఎంసీల నీరు నిల్వ

**నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2 లోని నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో కాళేశ్వర జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఎల్లంపల్లి జలాశయం నుంచి జంట సొరంగాల ద్వారా వస్తున్న నీటిని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నందిపంప్‌హౌస్‌లో 4, 5, 6వ మోటర్లు ఎత్తిపోస్తున్నాయి. అక్కడి నుంచి రిజర్వాయర్‌కు జలాలు చేరగా, జలాశయం గేట్లు ఎత్తడంతో జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంప్‌హౌస్‌కు చేరుకుంటున్నాయి. ఇక్కడి 1, 6, 7వ పంపులు ఎత్తిపోస్తుండటంతో గ్రావిటీ కాల్వ ద్వారా వరద కాల్వకు చేరుకుంటున్నాయి. ఇక్కడి నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని శ్రీరాజరాజేశ్వర జలాశయం వైపు వెళ్తున్నాయి. ఈనెల 5వ తేదీ నుంచి శనివారం సాయంత్రం ఆరుగంటల వరకు 10.299 టీఎంసీల నీటిని ఎస్సారార్‌కు తరలించినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 25.873 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.085 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఇన్‌ఫ్లో 9,450 క్యూసెక్కులు ఉండగా అంతే మొత్తంలో అవుట్‌ఫ్లో నమోదైంది.

✦ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మి పంప్‌హౌస్‌లో శనివారం 8, 9, 10, 11వ మోటర్లను నడిపించారు. ఇక్కడి నుంచి 8,800 క్యూసెక్కుల నీరు సరస్వతి బరాజ్‌కు తరలివెళ్లింది. ప్రస్తుతం సరస్వతి బరాజ్‌లో 7.58 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. కాగా లక్ష్మి బరాజ్‌లో ప్రస్తుతం 4.310 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.



కరీంనగర్ జిల్లాలోని గాయత్రి పంపుహౌస్ డెలివరీ సిస్టర్న్ వద్ద కాళేశ్వరం జలాల ఉధృతి



బస్సులో ప్రయాణిస్తూ ప్రయాణికురాలితో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్. చిత్రంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ ఉన్నారు.

## ఆర్టీసీ బస్సులో మంత్రి పువ్వాడ..

ఎంపీ నామాతో కలిసి ఖమ్మం నుంచి కొత్తగూడెం వరకు ప్రయాణం

**ఖమ్మం కమాన్‌బజార్:** రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామా నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ శనివారం ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ట్రాక్టర్ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యేందుకు మంత్రి ఖమ్మం నుంచి కొత్తగూడెం వరకు టికెట్ కొనుగోలు చేసి బస్సులో ప్రయాణించారు. ప్రయాణికులను పలుకరించి బస్సుల రాకపోకలు, బస్టాండ్లలో సౌకర్యాలపై ఆరా తీశారు. మంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చేందుకు తీసుకున్న వివిధ నిర్ణయాల్లో భాగంగా ప్రజాప్రతినిధులు బస్సుల్లో ప్రయాణించాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాలిచ్చారన్నారు. ప్రతి బస్సు ప్రయాణికులతో నిండుగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## గోడకూలి బాలుడి దుర్మరణం



వరుణ్ (ఫైల్)

**అయిజ:** అంగన్‌వాడీ కేంద్రంలో గోడ కూలి నాలుగేండ్ల బాలుడు దుర్మరణం చెందిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని రాజాపూర్‌లో చోటుచేసుకున్నది. రాజోళి మండలం పెద్ద ధన్వాడకు చెందిన గోపాల్, వీరుపాక్షమ్మ దంపతుల రెండో కుమారుడు వరుణ్(4). వీరుపాక్షమ్మ మూడో కాన్పు కోసం ఐదు నెలల కిందట తన తల్లిగారి ఊరైన రాజాపూర్ వచ్చింది. వరుణ్ రాజాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నాడు. శనివారం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన వరుణ్ పిల్లలతో కలిసి ఆడుకుంటుండగా, మూడు అడుగుల గోడ కూలి శిథిలాలు వరుణ్‌పై పడ్డాయి. దీంతో ఆ బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసులు, ఐడీసీఎస్ పీడీ కమలాదేవి సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. చిన్నారి మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

# ప్రతి పల్లె ఆదర్శ గ్రామం కావాలి

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- మంత్రి పువ్వాడ, ఎంపీ నామాతో కలిసి ట్రాక్టర్ల పంపిణీ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ట్రాక్టర్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి, పువ్వాడ. చిత్రంలో ఖమ్మం ఎంపీ, ఎమ్మెల్యేలు ఉన్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి/ సత్తుపల్లి, నమస్తే తెలంగాణ:** ప్రతి పల్లెను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతంగా అమలు చేస్తున్నదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లితోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో రవాణశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. పంచాయతీలకు మంజూరైన ట్రాక్టర్లను పాలకవర్గాలు సద్వినియోగం చేసుకోవాలని, సొంత పనులకు ఉపయోగిస్తే తీవ్ర చర్యలు ఉంటాయన్నారు. తడి, పొడి చెత్త వేసేందుకు కూడా ప్రత్యేక నిధులు సమకూర్చామన్నారు. రెండో విడత పల్లె ప్రగతిని విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. మొదటి విడత స్ఫూర్తితో రెండో విడత పల్లె ప్రణాళిక పనులు విజయవంతం చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, భద్రాద్రి, ఖమ్మం జెడ్పీ చైర్మన్లు కోరం కనకయ్య, లింగాల కమల్‌రాజ్, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియ, రాములునాయక్, మెచ్చ నాగేశ్వరరావు, సండ్ర వెంకట వీరయ్య, పొదెం వీరయ్య, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో క్రైస్తవులకు కానుకలు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ప్రతి గ్రామాన్ని హరితవనంగా తీర్చిదిద్దుతాం
- క్రైస్తవుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాం
- మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్, నమస్తేతెలంగాణ:** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన సాగుతున్నదని ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. హన్వాడ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఐదు గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు పంపిణీ చేశారు. 158 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. అనంతరం జిల్లాకేంద్రంలోని ఎంబీసీ చర్చి ప్రాంగణంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ఎంపీ, జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డితో కలిసి హాజరైన మంత్రి.. కేక్ కట్‌చేసి క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేశారు. క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని మంత్రి తెలిపారు.



అక్షయపాత్ర కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

# అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం

- ఒక్క తెలంగాణలోనే అమలు
- అక్షయపాత్రలో రోజుకు 1.25 లక్షల మందికి నాణ్యమైన భోజనం
- మంత్రి సత్యవతి రాథోడ్

**సంగారెడ్డి అర్బన్, నమస్తేతెలంగాణ:** అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన పౌష్టికాహారాన్ని అందజేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే అని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా కందిలోని అక్షయపాత్ర కేంద్రాన్ని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, అక్షయపాత్ర కేంద్రం కన్వీనర్ దాస యజ్ఞేశ్వర్ స్వామి, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, శిశుసంక్షేమశాఖ కార్యదర్శి జగదీశ్వర్‌తో కలిసి సందర్శించారు. అక్షయపాత్ర కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బియ్యం శుద్ధి కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అక్షయపాత్ర ఫౌండేషన్ సేవలు అద్భుతంగా ఉన్నాయని మంత్రి కితాబిచ్చారు. రోజుకు 1.25 లక్షల మందికి శుచి,శుభ్రతతో కూడిన భోజనం ప్రత్యేక వాహనాల్లో సరఫరా చేయడం, 875 అంగన్‌వాడీ కేంద్రాలకు భోజనం సరఫరా చేసిన ఘనత అక్షయపాత్రకే దక్కుతుందన్నారు. మంత్రి వెంట సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## ముగిసిన అతిరుద్రయాగం

**రెడ్డికాలనీ(వరంగల్):** వరంగల్ నగరం హన్మకొండ హయగ్రీవాచారి మైదానంలో ఏడు రోజులుగా నిర్వహిస్తున్న అతిరుద్ర యాగం శనివారం ముగిసింది. లోక కల్యాణార్థం భవితశ్రీ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ తాటిపల్లి శ్రీనివాస్-రోజారాణి దంపతుల ఆధ్వర్యంలో ఈ యాగం నిర్వహించారు. వేయిస్తంభాల ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ పర్యవేక్షణలో శృంగేరి భారతీ తీర్థ స్వామి పీఠం వైదిక పండితులు గోపీకృష్ణ శర్మ, శషాంకశర్మల ఆధ్వర్యంలో అతిరుద్ర యాగం, శతచండీయాగం, లక్ష్మీనారాయణ హృదయ పారాయణం, చతుర్వేద స్వాహాకార యజ్ఞాలు ఆరు రోజులుగా నిర్వహించి 18 యజ్ఞగుండాల్లో అతిరుద్ర పునశ్చరణ కార్యక్రమాలు పూర్తి చేశారు. శనివారం 250 మంది వేద పండితులు క్రమసంఖ్యలో మూలమంత్రయుక్తంగా రుద్ర హోమం నిర్వహించి హైదరాబాద్‌కు చెందిన శ్రీశ్రీ నర్సింహ శారదాపీఠాధిపతి శ్రీనర్సింహ భారతిస్వామి, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన గోపాలకృష్ణమఠం శ్రీశ్రీ యోగానంద సరస్వతి ఆధ్వర్యంలో శాంతి కల్యాణం జరిపించారు. రుద్రేశ్వరి, రుద్రేశ్వర స్వామివార్లకు వేములవాడ దేవస్థాన వేదపండితులు రాజారవిచంద్ర కల్యాణ క్రతువును మహావైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




హన్మకొండలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

## మహిళలపై దాడులను అరికట్టాలి

టీ-ఎమ్మార్పీస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

**సుబేదారి(వరంగల్):** మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని తెలంగాణ రాష్ట్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హన్మకొండలో జరిగిన టీ-ఎమ్మార్పీఎస్ వరంగల్ అర్బన్ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వంగపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు, హత్యలకు నిరసనగా టీ-ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో జనవరి 6 నుంచి పోరాటం చేస్తామని, 9న హైదరాబాద్‌లో మహిళా ఆర్తనాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. హాజీపూర్‌లో పిల్లలపై లైంగిక దాడి చేసి, హత్యలకు పాల్పడిన నిందితుడు శ్రీనివాస్‌రెడ్డికి కఠిన శిక్ష వేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం నాయకులు పొట్టెపెంజర రమేశ్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.





హరితహారంలో భాగంగా తాము పెంచిన చెట్లను ట్రాన్స్‌ప్లాంటేషన్ విధానంలో రక్షించుకున్నారు రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు. పాఠశాలలో నూతన గదుల నిర్మాణానికి అడ్డుగా ఉన్న 8 చెట్లను విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ఎక్స్‌కవేటర్ సహాయంతో మరో ప్రాంతంలో నాటి వాటికి ప్రాణం పోశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులను గ్రామస్థులు అభినందించారు.
- రుద్రంగి

కంటెయినర్ బోల్తా..

## మూగ జీవాల మృత్యువాత

**వాజేడు(ములుగు):** ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల గ్రామ పంచాయతీలోని జగన్నాథపురం వైజంక్షన్ వద్ద హైదరాబాద్-భూపాలపట్నం 163వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున కంటెయినర్ లారీ బోల్తాపడగా ఎనిమిది ఎద్దులు, ఆవులు మృత్యువాతపడ్డాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూర్ తదితర ప్రాంతాల నుంచి ఆవులు, ఎడ్లను కంటెయినర్‌లో హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తుండగా జగన్నాథపురం వైజంక్షన్ వద్ద జాతీయ రహదారిపై అతివేగంతో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ వాహనంలో 29 పశువులు ఉండగా అందులో ఎనిమిది మృత్యువాత పడగా, మరో ఏడు గాయపడినట్టు పోలీసులు తెలిపారు. డ్రైవర్ పరారీలో ఉండగా హైదరాబాద్‌కు చెందిన కంటెయినర్ యజమానిపై ఎనిమల్ ట్రాన్స్‌పోర్టు రూల్ 1978 యాక్టు, క్రుయాల్టీ ఆఫ్ ఎనిమల్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వాజేడు ఎస్సై తిరుపతి రావు తెలిపారు.


Telangana State Co-operative Marketing Federation Ltd.,
5-2-68, 3rd Floor, Mahatma Gandhi Markfed Bhavan, Jambagh, Hyderabad - 500 095.
Ph: 040-24607106
Email : proc.tsmarkfed@gmail.com
CORRIGENDUM-II
The tender notification issued dated 20.11.2019 for Disposal of Agricultural commodities procured by TS Markfed & HACA with tender id-154425 has been cancelled in view of certain administrative reasons. The next tender notification will be issued shortly.
Dt. 21.12.2019 Sd/- MANAGING DIRECTOR

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY HYDERABAD
(Government Gazette Act no.30 of 2008)
KUKATPALLY, HYDERABAD - 500 085, TELANGANA STATE
Tender Notice No: JNTUH /EXAM Branch /OMR /2019-20 & 2020-21 Date : 21.12.2019
TENDER NOTIFICATION
The sealed tenders are invited for supply of printed answer booklets and other Examination Stationery items of the Examination Branch for the years 2019-20 & 2020-21. The details can be obtained from www.jntuh.ac.in
Sd/- REGISTRAR

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్ కార్యాలయం, PIU సిద్దిపేట
టెండరు ప్రకటన
పనుల సంఖ్య: (19), పని పేరు: దిగువ సంతకందారు పరిధిలో CC డ్రెయిన్ నిర్మాణం, రోడ్ నిర్మాణం, G.P.భవనం, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు మిగిలిన పని రోడ్లపై వీధి దీపాలు సరఫరా మరియు అమర్చుట మరియు ఇతర పనులు. మొత్తం ECV: రూ.1.65 కోట్లు. దరఖాస్తులకు చివరి తేదీ: 18-12-2019 నుండి 28-12-2019న సా.5.00 గం.వరకు. టెండరు షెడ్యూళ్ళ జారీ: 30-12-2019న సా.5.00గం. వరకు. టెండర్లు స్వీకరణకు చివరి తేదీ: 31-12-2019న మ.3.00 గం. వరకు. టెండర్లు తెరుచు తేదీ: 31-12-2019న సా.4.00 గం. తదుపరి వివరాల కొరకు దిగువ సంతకందారును సంప్రదించగలరు.
DIPR R.O.No. 2036-DP/CL/ Advt/1/2019-20, Dt: 21/12/2019 సం/- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్, PIU సిద్దిపేట.

తెలంగాణ ప్రభుత్వం
పోలీస్ శాఖ, BSPW&C తెలంగాణ
నోటిఫికేషన్
సంగారెడ్డి, ఖమ్మం, సూర్యాపేట్ మరియు వికారాబాద్ జిల్లాలలో భరోసా-సపోర్ట్ సెంటర్ ఫర్ ఉమెన్ & చిల్డ్రన్‌లో పనిచేయుటకు సర్వీసుల రెగ్యులరైజేషన్ మొదలైన హక్కులు లేకుండా కాంట్రాక్చువల్ ప్రాతిపదికన వివిధ పోస్టులలో పనిచేయుటకు తగిన అభ్యర్థుల నుండి భరోసా-సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ & చిల్డ్రన్, తెలంగాణ దరఖాస్తులు కోరుతోంది. అన్ని ఇతర వివరాల కొరకు http://www.womensafetywing.telangana.gov.in/ దర్శించండి. తమ సంబంధిత పోలీస్ కమిషనర్లు/జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం వద్ద బయోడేటా & సర్టిఫికెట్ల కాపీలతో పాటు దరఖాస్తుల దాఖలుకు ఆఖరి తేది 05.01.2020న సా. 5.00 గం||. వ్యక్తుల నియామకం కాంట్రాక్ట్ కాలము ఒక సంవత్సరం మాత్రమే అని తదుపరిగా నిర్దిష్టంగా తెలియజేయబడుతోంది. ఆవశ్యకత మరియు లభించే బడ్జెట్ ప్రకారం సంవత్సరం తర్వాత సంవత్సరం పొడిగించబడుతుంది.
సం/- ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, లా & ఆర్డర్ మరియు I/c ఉమెన్ సేఫ్టీ వింగ్, TS
DIPR RO. No. 2039-DP/CL/Advt/1/2019-20, Dt: 21/12/2019

వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ కార్యాలయం
తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ఇ-ప్రొక్యూర్‌మెంట్ T.No. SE(AM)/TS/HYD/Ep/09/2019-20 తేదీ: 19-12-2019
ఆదిలాబాద్, సిద్దిపేట్, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, జనగామ, కరీంనగర్, హైదరాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, కామారెడ్డి, వరంగల్ మరియు నాగర్‌కర్నూల్ జిల్లాలలోని వివిధ మార్కెట్ యార్డుల వద్ద దిగువ (27) పనుల కొరకు నమోదిత సివిల్ కాంట్రాక్టర్లు, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు గ్రేడ్ 'A' లేదా 'B' లైసెన్స్‌తో మరియు ప్రముఖ ఏజెన్సీలు/ తయారీదారుల నుండి సూపరింటెండింగ్ ఇంజినీర్ (AM), హైదరాబాద్ వారిచే ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. వ్యయం: రూ.9,29,79,994/-. ఇ-ప్రొక్యూర్‌మెంట్ సైట్ ప్రారంభ తేదీ: 23-12-2019న సా. 5.00 గం.కు. వాపసురాని ప్రాసెసింగ్ రుసుమును ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి మరియు రిసీట్ జర్నల్ నంబరు/UTR నంబరుతో బ్యాంకర్లు సంతకంచేసిన కౌంటర్‌ఫాయిల్/రిసీట్‌ను స్కాన్‌చేసి, బిడ్లతోపాటు అప్‌లోడ్ చేయాలి. ఏదేని ఇతర సమాచారాన్ని https://tender.telangana.gov.in నుండి లేదా సూపరింటెండింగ్ ఇంజినీర్ (AM) కార్యాలయం నుండి పొందవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (AM) అఫీషియేటింగ్
వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ కార్యాలయం, తెలంగాణ ప్రభుత్వం.



శనివారం తిరుమల శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్రసరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర

## శ్రీవారిసేవలో విశాఖ శారదా పీఠాధిపతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర శనివారం తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించుకొన్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో ఇరువురికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ.. వైకుంఠ నారాయణుడి దర్శనం ఆనందాన్నిచ్చిందన్నారు. హిందూ ధర్మ ప్రచార యాత్ర విజయవంతంగా ముందుకు సాగాలని స్వామివారిని వేడుకున్నట్టు తెలిపారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రను అనుగ్రహించాలని సాక్షాత్తు విష్ణు స్వరూపుడైన వైకుంఠ నారాయణుడిని ప్రార్థించినట్టు పేర్కొన్నారు. స్వాత్మానందేంద్ర శక్తిమూర్తిగా ఎదుగుతారన్న నమ్మకం ఉన్నదని చెప్పారు.

## సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైన మహేందర్‌కు కోలేటి అభినందన



మహేందర్‌ను సన్మానిస్తున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇటీవల నిర్వహించిన పోలీస్ నియామకాల్లో 'ది రే ఆఫ్ హోప్' సంస్థ ఆర్థిక సహకారంతో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించిన వికారాబాద్ విద్యార్థి మహేందర్‌ను పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అభినందించారు. శనివారం తన కార్యాలయంలో ది రే ఆఫ్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్‌రెడ్డితో కలిసి మహేందర్‌ను సత్కరించారు. నిరుపేద విద్యార్థులకు ది రే ఆఫ్ హోప్ సంస్థ ఎంతో సహకారం అందిస్తున్నదని దామోదర్ అన్నారు.

## ఏపీలో 25 జిల్లాలు!

సీఎం జగన్ యోచిస్తున్నారు: ఎంపీ విజయసాయిరెడ్డి

**విశాఖపట్నం:** ఏపీలో 25 జిల్లాలు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో సీఎం వైఎస్ జగన్ ఉన్నట్టు ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు. శనివారం విశాఖలోని వైఎస్సార్సీపీ ప్రధాన కార్యాలయంలో జగన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. అన్ని జిల్లాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చామని ఎంపీ చెప్పారు. విశాఖను పరిపాలనా రాజధానిగా చేయాలనుకోవడం చరిత్రాత్మక నిర్ణయమన్నారు.





టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసిన ప్రతినిధి బృందం

## మహిళా ఏఈవోలకు భద్రత కల్పించండి

మంత్రి నిరంజన్‌రెడ్డికి టీఎన్జీవో నేతలు విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** క్షేత్రస్థాయి పర్యటన సందర్భంగా మహిళా ఏఈవోలకు భద్రతగా ఉండేందుకు సంబంధిత గ్రామాల వీఆర్‌ఏలను సహాయకులుగా పంపేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం సెంట్రల్ యూనియన్ (టీఎన్జీవో), తెలంగాణ వ్యవసాయ విస్తరణాధికారుల రాష్ట్ర సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. మంత్రిని కలిసినవారిలో టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి సురేశ్ తదితరులు ఉన్నారు.

# సంప్రదాయ వైద్యానికి పూర్వవైభవం

త్వరలో నేచర్‌క్యూర్‌లో ఇన్‌ఫెర్టిలిటి సెంటర్ ఏర్పాటు: మంత్రి ఈటల



శనివారం మీడియాతో మాట్లాడుతున్న వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భారతీయ సంప్రదాయ వైద్యానికి పూర్వవైభవం తీసుకురావడానికి అనేక చర్యలు తీసుకొంటున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి ఈటల రాజేందర్ అధ్యక్షతన తొమ్మిదవ యోగ అధ్యయన పరిషత్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో చాలా వైద్యారోగ్య పద్ధతు లున్నాయని, ప్రకృతివైద్యం, యునాని, హోమియోపతి, ఆయుర్వేద వైద్యవిధానాలు ఎంతో గొప్ప చికిత్స అందించాయన్నారు. నేచర్‌క్యూర్ దవాఖానలో సాయంత్రం వేళల్లో కూడా బీపీ, షుగర్, గైనిక్ సమస్యలకు ఓపీ ప్రారంభించాలని నిర్ణయించినట్టు తెలిపారు. నేచర్‌క్యూర్‌లో ఇన్‌ఫెర్టిలిటి సెంటర్‌ను కూడా ఏర్పాటుచేస్తామన్నారు. నేచర్‌క్యూర్ కాలేజీలో 2021 నుంచి పీజీ కోర్సులు ప్రారంభిస్తామని, బెంగళూరు కంటే గొప్పగా నేచర్‌క్యూర్‌ను తయారుచేయనున్నట్టు పేర్కొన్నారు. దవాఖాన అభివృద్ధికి రూ.6 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేసి ఆ మొత్తాన్ని మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, ఆయుష్ కమిషనర్ అలుగు వర్షిణి, కాళోజీ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ కరుణాకర్‌రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు సుదర్శనాచార్య, కోటేశ్వర్‌రావు, యూనిట్ అధికారులు డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ భవాని, డాక్టర్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ జిల్లా దవాఖానలో రోగులతో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

## దవాఖాన నిర్వహణ ఇలాగేనా!

- అపరిశుభ్రతపై మంత్రి ఎర్రబెల్లి ఆగ్రహం
- మానుకోట దవాఖానను తనిఖీచేసిన దయాకర్‌రావు

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఇదేం నిర్వహణ.. ఇలానే ఉంటుందా.. అని మానుకోట దవాఖానలో అపరిశుభ్రతపై రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు ఆయన మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం మీదుగా వెళ్లారు. కేసముద్రంలో రోడ్డుపై చెత్తకుప్పలు ఉండటంచూసి మంత్రి.. జిల్లా పంచాయతీ అధికారి రంగాచారికి ఫోన్‌చేసి మండిపడ్డారు. చెత్తకుప్పలు తొలిగించాలని ఆదేశించారు. మహబూబాబాద్‌లో ఉన్న ప్రభుత్వ దవాఖానను ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌తో కలిసి మంత్రి తనిఖీచేశారు. ఈ సందర్భంగా దవాఖాన పరిసరాలు, పలు వార్డులు అపరిశుభ్రంగా ఉండటంతో సూపరింటెండెంట్ భీంసాగర్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కాంట్రాక్టర్‌ను మార్చాలని ఆదేశించారు. దవాఖానలో రోగులతో మంత్రి మాట్లాడారు. వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవన్నారు.



శనివారం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్కేవీ అనుబంధ భవననిర్మాణ కార్మికసంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్కేవీ అధ్యక్షుడు రాంబాబుయాదవ్

## టీఆర్‌ఎస్ హయాంలోనే కార్మికులకు న్యాయం

భవననిర్మాణ కార్మికుల సమావేశంలో టీఆర్‌ఎస్కేవీ అధ్యక్షుడు రాంబాబు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భవననిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని టీఆర్‌ఎస్కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ అన్నారు. శనివారం తెలంగాణభవన్‌లో నిర్వహించిన టీఆర్‌ఎస్కేవీ అనుబంధ భవననిర్మాణ కార్మికసంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కార్మికుల ప్రమాద బీమాను రూ. 2 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచిందని గుర్తుచేశారు. ప్రమాదబీమాను రూ.10 లక్షలకు పెంచాలన్న డిమాండ్‌ను సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో భవననిర్మాణ కార్మికసంఘం అధ్యక్షుడు నత్తి మైసయ్య, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ రూప్‌సింగ్, టీఆర్‌ఎస్కేవీ ప్రధాన కార్యదర్శి నారాయణ, నాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.





చెంగిచర్లలో మొక్క నాటుతున్న లాయర్లు.. మొక్కనాటిన ఆసిఫాబాద్ డీఎఫ్‌వో రంజిత్‌నాయక్

## ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

గ్రీన్‌చాలెంజ్‌లో అధికారులు, లాయర్లు

**హైదరాబాద్/ఆసిఫాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా తెలంగాణ న్యాయవాదులు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ పరిధిలోని చెంగిచర్ల క్రాంతికాలనీలో ఉషోదయ టైల్స్ కంపెనీ ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఎంపీ సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్‌చాలెంజ్‌ను స్వీకరించి ప్రతిఒక్కరూ మూడు మొక్కలునాటి ఆకుపచ్చ తెలంగాణ కోసం పాటుపడాలని తెలంగాణ ఫుడ్ కమిషన్ సభ్యుడు కొంతం గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నిర్మల్ జాయింట్ కలెక్టర్ భాస్కర్ విసిరిన గ్రీన్‌చాలెంజ్‌ను స్వీకరించిన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జేసీ రాంబాబు ఐకేపీ కాంప్లెక్స్ ఆవరణలో మూడు మొక్కలు నాటారు. జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ వెంకటేశ్వర్లుకు గ్రీన్‌చాలెంజ్ విసిరారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ డివిజనల్ ఫారెస్ట్ అధికారి లక్ష్మణ్ రంజిత్‌నాయక్ రెబ్బెన మండలం నంబాల ప్లాంటేషన్‌లో మొక్కలు నాటారు.

## సినీ ఎడిటర్ మురళి కన్నుమూత



**నమస్తే తెలంగాణ, సినిమా డెస్క్:** సీనియర్ సినీ ఎడిటర్ సీహెచ్ మురళి (64) శనివారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. దాదాపు ఐదు భాషల్లో మూడు వందలకుపైగా సినిమాలకు ఎడిటర్‌గా పనిచేశారు. తెలుగులో ఇద్దరు ఖిలాడీలు, పెద్దింటి అల్లుడు, కాలేజీ బుల్లోడు, పోలీస్ భార్య, ఇద్దరు పెళ్లాల ముద్దుల పోలీస్‌తోపాటు తమ్మారెడ్డి భరద్వాజ దర్శకత్వం వహించిన పలు చిత్రాలకు ఎడిటర్‌గా పనిచేశారు. ఆదివారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు.

## మేడారం జాతరకు భారీ భద్రత

- 10 వేల మంది పోలీసులతో బందోబస్తు
- రక్షణ చర్యలను పరిశీలించిన నార్త్ జోన్ ఐజీ నాగిరెడ్డి



మేడారం సమ్మక్క-సారక్క జాతర ప్రాంగణంలో భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ నాగిరెడ్డి

**ములుగు జిల్లా ప్రతినిధి/నమస్తేతెలంగాణ:** వచ్చే ఫిబ్రవరిలో జరిగే మేడారం జాతరకు పదివేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటుచేయనున్నట్టు నార్త్ జోన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వై నాగిరెడ్డి చెప్పారు. శనివారం ఆయన ములుగు జిల్లాలోని మేడారం సమ్మక్క- సారలమ్మను దర్శించుకున్నారు. జాతర సందర్భంగా చేపట్టాల్సిన భద్రత చర్యలపై జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్‌తో కలిసి పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఐజీ మాట్లాడుతూ.. జాతరకు వచ్చే ప్రతి భక్తుడికి అమ్మవారి ప్రసాదాన్ని ప్రత్యేక కౌంటర్ల ద్వారా అందించనున్నట్టు తెలిపారు. ఈసారి కాటారం, రేగులగూడెం, సింగారం, కాల్వపల్లి ద్వారా మేడారం వచ్చే వాహనాలను అనుమతిస్తున్నట్టు చెప్పారు. జాతరలో ట్రాఫిక్ ఇబ్బందులు అధిగమించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్టు తెలిపారు. పోలీస్ క్యాంపు సిబ్బంది, వసతి ఏర్పాట్లపై ఎస్పీతో చర్చించారు. ఐజీకి ఆలయ ఈవో, పూజారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఐజీవెంట ములుగు ఓఎస్డీ సురేశ్‌కుమార్, ఏఎస్పీలు సాయిచైతన్య, శరత్‌చంద్రపవర్, ములుగు, పస్రా సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

### పల్లెలు మురిసేలా ప్రగతి: మంత్రి అల్లోల

**నిర్మల్, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి:** పల్లెలు మురిసేలా ప్రగతి సాధించేందుకే రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టిందని, జనవరి 2 నుంచి రెండోవిడుత కూడా ప్రారంభమవుతుందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. పల్లె ప్రగతిపై నిర్మల్ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులకు శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి మాట్లాడారు. విజయవంతమైన పల్లె ప్రణాళిక మొదటి విడత స్ఫూర్తితో రెండోవిడుత కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అనంతరం పలు గ్రామాలకు మంజూరైన ట్రాక్టర్లను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ముథోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు గడ్డిగారి విఠల్‌రెడ్డి, అజ్మీరా రేఖానాయక్ తదితరులు పాల్గొన్నారు.

### అమెరికా విద్యపై రేపు అవగాహన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉన్నత విద్యా మండలి, ఆటా (అమెరికన్ తెలుగు అసోసియేషన్) ఆధ్వర్యంలో దాదాపు 500 మంది విద్యార్థులకు యూఎస్ విద్యపై అవగాహన కల్పించనున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ముఫకంజా కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించే కార్యక్రమానికి ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

# 1.25 కోట్ల ఎకరాలకు నీళ్లిద్దాం

- సీఎం సంకల్పాన్ని నెరవేరుద్దాం
- ఎత్తిపోతల కిందే 75 లక్షల ఎకరాల ఆయకట్టు
- సాగునీటి సదస్సులో చర్చ



విశ్వేశ్వరయ్యభవన్‌లో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న ఈఎన్సీ మురళీధర్‌రావు, నీటిపారుదలశాఖ ఇంజినీర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో 1.25 కోట్ల ఎకరాలను సస్యశ్యామలం చేయాలన్న సీఎం కేసీఆర్ సంకల్పాన్ని నెరవేర్చేందుకు నీటిపారుదలశాఖ సిద్ధంకావాలని, దీనికి అనుగుణంగా కార్యాచరణను రూపొందించాలని ఆ శాఖ ఉన్నతాధికారులు స్పష్టంచేశారు. ప్రాజెక్టుల నిర్వహణ, సాగునీటిశాఖ పునర్వ్యవస్థీకరణ, సాగునీటిశాఖ ఆస్తులు, పొరుగుసేవలు, సాగునీటిశాఖ కార్యకలాపాలను ప్రభావితంచేసే చట్టాలు, ఇతర శాఖలతో సమన్వయం తదితర అంశాలపై ప్రత్యేక విధివిధానాలను రూపొందించాలన్నారు. తెలంగాణ సాగునీటిరంగం సమగ్ర నిర్వహణ విధానాన్ని రూపొందించాలని ఈ నెల 5న జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం కేసీఆర్ ఉన్నతాధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్‌లో సదస్సు నిర్వహించారు. ఈఈ నుంచి ఈఎన్సీ వరకు వివిధ హోదాల్లో ఉన్న 250 మంది ఇంజినీర్లు ఇందులో పాల్గొన్నారు. ఈఎన్సీ (ఇరిగేషన్) మురళీధర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఉన్నతాధికారులు తొలుత సదస్సు లక్ష్యాలను వివరించారు. దీనికి అనుగుణంగా ఇంజినీర్లు తమ అభిప్రాయాలు తెలుపాలని సూచించారు.

**పనివిభజన జరుగాలి..**

1.25 కోట్ల ఎకరాలకు నీరందించేలా సాగునీటి శాఖను తీర్చిదిద్దేందుకు ఇంజినీర్-ఇన్-చీఫ్‌ల మధ్య పనివిభజన జరుగాలని సీఎం కేసీఆర్ సూచించారని ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే అన్నారు. వచ్చే రెండుమూడేండ్లలో రాష్ట్రంలోని అన్ని ఎత్తిపోతల పథకాల పరిధిలోని 80కిపైగా పంపుహౌస్‌లు పనిచేయడం ప్రారంభిస్తాయని, వీటి సమగ్ర నిర్వహణ విధానాన్ని, సాగునీటిశాఖ ఆస్తుల జాబితాను తయారుచేసుకోవాలని సీఎం కేసీఆర్ స్పష్టంచేశారని చెప్పారు. సీఎం సూచనలకు అనుగుణంగా ప్రతిపాదనల్ని తయారుచేయడంపై ఇంజినీర్లు చర్చించాలని శ్రీధర్‌రావు దేశ్‌పాండే కోరారు.

**ఈఈల పాత్ర కీలకం..**

రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్వహణ రానున్న కాలంలో అత్యంత కీలకంగా మారనున్నదని ఇరిగేషన్ ఈఎన్సీ మురళీధర్‌రావు చెప్పారు. 1.25 కోట్ల ఎకరాల ఆయకట్టులో సుమారు 75 లక్షల ఎకరాల ఆయకట్టు ఎత్తిపోతల పథకాల కింద ఉన్నందున వాటి నిర్వహణలో ఈఈలు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని, ఈ సదస్సులో అన్ని అంశాలపై ఈఈలు అభిప్రాయాలను వ్యక్తంచేయాలని సూచించారు. పంపుహౌస్‌లలో ఎదురవుతున్న సమస్యల్ని ఇంజినీర్లు వివరించడంతో వాటన్నింటినీ క్రోడీకరించి సీఎం దృష్టికి తీసుకెళ్తామని మురళీధర్‌రావు తెలిపారు. జనవరిలో మరో సదస్సు నిర్వహిస్తామని, అవసరమైతే సీఎంస్థాయిలో విస్తృత సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు. పంపుహౌస్‌లు, విద్యుత్ పరికరాలతోపాటు విద్యుత్ సరఫరా వ్యవస్థ నిర్వహణ, షిఫ్టులవారీగా ఇంజినీర్ల బాధ్యతలు, సిబ్బంది అవసరాలు తదితర అంశాల గురించి ఆయన వివరించారు.

**పకడ్బందీ నిర్వహణకు సిద్ధం..**

ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేయడంతోపాటు పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని ఇంజినీర్లు తెలిపారు. హై కోర్టు తీర్పుతో అడ్డంకులు తొలిగినందున తమ పదోన్నతుల విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని ఉన్నతాధికారులను కోరారు. సదస్సులో ఈఎన్సీలు నల్లా వెంకటేశ్వర్లు, హరిరాం, అనిల్‌కుమార్, చీఫ్ ఇంజినీర్లు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రావు, బంగారయ్య, వీర య్య, శంకర్, హమీద్‌ఖాన్, నరసింహ, అనంతరెడ్డి, శ్రీదేవి, శ్రీనివాసరావు, అజయ్‌కుమార్, మోహన్‌కుమార్, శంకర్‌నాయక్, వీ రమేశ్, వీ సుధాకర్, అమ్జాద్ హుస్సేన్, టీ శ్రీనివాస్‌తోపాటు పలువురు పర్యవేక్షక, కార్యనిర్వాహక ఇంజినీర్లు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగించిన ఈవోకు జరిమానా

**తాడ్వాయి(ములుగు):** మేడారం సమ్మక్క-సారక్క గద్దెల ప్రాంగణంలో ప్లాస్టిక్‌ను వినియోగించినందుకు ఈవో రాజేంద్రంకు శనివారం మేడారం గ్రామ పంచాయతీ కార్యదర్శి సుబానొద్దీన్ జరిమానా విధించారు. మేడారాన్ని ప్లాస్టిక్‌రహిత గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతుండగా.. దేవాదాయశాఖ అధికారులు ప్లాస్టిక్ వాడటాన్ని గుర్తించిన పంచాయతీ సిబ్బంది రూ.5 వేల జరిమానాను విధించి రశీదును ఈవోకు అందజేశారు. మరోసారి గద్దెల ప్రాంగణంలో ప్లాస్టిక్ వినియోగించినట్టు పంచాయతీ దృష్టికి వస్తే భారీ జరిమానా విధిస్తామన్నారు.




శనివారం మంగళ్‌హాట్‌లోని శ్మశానవాటిక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ సలీం

## మంగళ్‌హాట్ దర్గాను పరిశీలించిన వక్ఫ్‌బోర్డు చైర్మన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం శనివారం మంగళ్‌హాట్‌లోని దర్గా, శ్మశానవాటికను పరిశీలించారు. నోటిఫైచేసిన 5.11 ఎకరాలస్థలంలో అక్రమంగా ఇండ్లు, దుకాణాలు ఏర్పాటుచేసుకోవడంతో వాటిని తొలిగించాలని ఆయన నిర్ణయించారు.

## బడి ఒడిలో 'కాళేశ్వర' గంగ



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని ఆవునూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గోడలపై వేసిన కాళేశ్వరం ప్రాజెక్టు చిత్రాలు విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి. బాహుబలి పంపులు, నీటిని ఎత్తిపోసే సర్జ్‌పూల్, ప్రాజెక్టు గేట్లు కనువిందు చేస్తున్నాయి. ఈ చిత్రాలతో విద్యార్థుల్లో నీటి ప్రాధాన్యంపై అవగాహన పెరుగుతున్నదని ఉపాధ్యాయులు చెప్తున్నారు. - ముస్తాబాద్



శనివారం బషీర్‌బాగ్‌లోని టీఎస్‌ఐఐసీ కార్యాలయంలో క్రిస్మస్ కేక్ కట్‌చేస్తున్న ఆ సంస్థ చైర్మన్ గ్యాదరి బాలమల్లు. చిత్రంలో సంస్థ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి తదితరులు

## దేశానికి తెలంగాణ ఆదర్శం

క్రిస్మస్ వేడుకల్లో టీఎస్‌ఐఐసీ చైర్మన్ బాలమల్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని మతాల పండుగలను ప్రభుత్వం నిర్వహిస్తూ దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తున్నదని టీఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు అన్నారు. క్రిస్మస్ సందర్భంగా శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని టీఎస్‌ఐఐసీ కార్యాలయంలో బాలమల్లు, సంస్థ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. హిందువులకు బతుకమ్మ, బోనాలు, ముస్లింలకు రంజాన్, క్రిస్టియన్లకు క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తూ తెలంగాణ సెక్యులర్ రాష్ట్రంగా నిలుస్తున్నదని బాలమల్లు చెప్పారు. కులమతాలకతీతంగా అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎస్‌ఐఐసీ సీఈవో మధుసూదన్, చీఫ్ ఇంజినీర్ శ్యాంసుందర్, సీజీఎం గీతాంజలి, జీఎంలు రేవతిబాయి తదితరులు పాల్గొన్నారు.




నమస్తే తెలంగాణ WWW.NTNEWS.COM
/nt.zindagi
# జిందగీ
ఆదివారం 22 డిసెంబర్ 2019

Rewind 2019

కరీంనగర్

**బడిలో అడుగుపెడుతూ తల్లి చేతిని వదల్లేక భారంగా వీడ్కోలు చెప్పే చిన్నారిలా, మళ్లీ తిరిగొస్తానంటూ ప్రియుడిని అనునయించి వెళ్లిపోయిన అందాలప్రేయసిలా, ప్రవాసానికి వెళ్తున్న మిత్రుడిని ఆనందోత్సాహాలతో సాగనంపిన ఓ ఉద్విగ్న ఘట్టంలా ఈ ఏడాది కాలయవనికపై ఎన్నో జ్ఞాపకాల్ని మిగిల్చి నిష్క్రమించడానికి సిద్ధమైంది. అదే తరుణంలో కోటి ఆశలతో కొంగొత్త వసంతానికి స్వాగతం పలుకడానికి సమాయత్తమవుతున్నది. ఎన్నో రంగుల కలలతో విరాజిల్లే చిత్రసీమ ఈ ఏడాది ఆశాజనకమైన ఫలితాల్ని సాధించింది. కథాంశాల్లో కొత్తదనానికి ప్రేక్షకులు పట్టం కట్టారు. ఈ సంవత్సరం తెలుగులో బయోపిక్‌ల రూపకల్పన ఊపందుకుంది. అగ్రహీరోలు మంచి విజయాల్ని అందుకున్నారు. నవతారలు వినూత్న ఇతివృత్తాలతో ప్రేక్షకుల్ని మెప్పించారు. సృజనాత్మకతపరంగా తెలుగు సినీరంగం కొత్త హద్దుల్ని స్పృశించడం శుభపరిణామంగా చెప్పాలి.**





# వైవిధ్యమే విజయమంత్రం





2019లో అగ్ర కథానాయకులు నటించిన సినిమాలు అద్భుత విజయాలతో బాక్సాఫీస్ వద్ద కాసులు వర్షాన్ని కురిపించాయి. వెంకటేష్, వరుణ్‌తేజ్ హీరోలుగా సంక్రాంతికి విడుదలైన 'ఎఫ్-2' చిత్రం ఈ ఏడాది అతి పెద్ద విజయంగా నిలిచింది.

కుటుంబ బంధాలు, వినోదం సమ్మిళితంగా అనిల్‌రావిపూడి దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మించిన ఈ చిత్రం నాలుగింతల లాభాల్ని తెచ్చిపెట్టింది. 'ఇస్మార్ట్‌శంకర్' చిత్రం హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కెరీర్‌కు పూర్వవైభవాన్ని తీసుకొచ్చింది. 'మహర్షి' సినిమాతో ఈ ఏడాది అద్వితీయ విజయాన్ని అందుకున్నారు మహేష్‌బాబు. స్నేహం, ప్రేమ ప్రధానాంశాలుగా రూపొందిన ఈ చిత్రం మహేష్‌బాబు కెరీర్‌లో అత్యధిక వసూళ్లను సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ ఏడాది భాషాభేదాలకు అతీతంగా సినీ అభిమానుల దృష్టిని ఆకర్షించిన చిత్రాల్లో 'సాహో' ఒకటి. అంతర్జాతీయ ప్రమాణాలతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు సుజీత్ ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమాకు మిశ్రమ స్పందన లభించినా ప్రభాస్‌కు ఉన్న ఇమేజ్‌తో తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ మంచి వసూళ్లను రాబట్టింది. ఇక చారిత్రక కథాంశంతో చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కిన 'సైరానరసింహారెడ్డి' చిత్రం చక్కటి కలెక్షన్స్‌తో నిర్మాతలకు లాభాల్ని తెచ్చిపెట్టింది.

## స్టార్స్ జోరు...

ఈ ఏడాది స్టార్ హీరోల్లో కొందరు అద్వితీయ విజయాలతో దూసుకుపోగా.. మరికొందరు మాత్రం పరాజయాల్ని ఎదుర్కొన్నారు. ఏడాది ఆరంభంలోనే 'ఎఫ్-2' చిత్రంతో ప్రేక్షకులకు నవ్వులను పంచారు వెంకటేష్. పెద్ద విజయంతో ఈ ఏడాదిని ఆరంభించిన ఆయన 'వెంకీమామ'తో అదే జోరును కొనసాగిస్తూ 2019కి ముగింపు పలుకుతున్నారు. 'సైరా నరసింహారెడ్డి'గా ఈ ఏడాది అభిమానుల్ని మెప్పించారు చిరంజీవి. తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పాత్రలో అసమాన నటనను కనబరిచారు. 'మన్మథుడు-2' చిత్రంతో నాగార్జున అపజయాన్ని చవిచూశారు. ప్రచార చిత్రాలతో అంచనాల్ని రేకెత్తించిన ఈ సినిమా కథ, కథనాల్లో నవ్యత కొరవడటంతో పరాజయంగా నిలిచింది. 'మహర్షి'తో మహేష్‌బాబు అభిమానుల్ని ఆకట్టుకున్నారు. 'ఎఫ్-2', 'గద్దలకొండ గణేష్' చిత్రాలతో ఈ ఏడాది రెండు విజయాల్ని అందుకున్నారు వరుణ్‌తేజ్. అలాగే 'జెర్సీ' సినిమాలో క్రికెటర్‌గా నాని అభిమానుల హృదయాల్ని గెలుచుకున్నారు. ఆయన నటించిన మరో చిత్రం 'గ్యాంగ్‌లీడర్' సగటు చిత్రంగా మిగిలింది. 'మజిలీ', 'వెంకీమామ' విజయాలతో ద్విగుణీకృత ఉత్సాహంతో ఉన్నారు నాగచైతన్య. 'ఇస్మార్ట్‌శంకర్' ద్వారా కెరీర్‌లో అతి పెద్ద విజయాన్ని అందుకున్నారు రామ్. 'చిత్రలహరి', 'ప్రతిరోజూ పండగే' సినిమాలతో సాయితేజ్ చాలా విరామం తర్వాత సక్సెస్‌ల బాటపట్టారు. 'రాక్షసుడు'తో బెల్లంకొండ సాయిశ్రీనివాస్, 'నినువీడని నీడను నేనే'తో సందీప్‌కిషన్, '118'తో కల్యాణ్‌రామ్ సక్సెస్ రుచి చూశారు. 'వినయ విధేయరామ'తో హీరోగా రామ్‌చరణ్ నిరాశను ఎదుర్కోగా.. 'సైరా నరసింహారెడ్డి' నిర్మాతగా మాత్రం సక్సెస్ అందుకున్నారు. అఖిల్ 'మిస్టర్ మజ్ను', రాజశేఖర్ 'కల్కి' చిత్రాలు ప్రేక్షకులను అలరించలేకపోయాయి.

## సీనియర్స్ సత్తా చాటారు



సీనియర్ దర్శకులకు 2019 అచ్చొచ్చిందనే చెప్పవచ్చు. 'ఇస్మార్ట్‌శంకర్' ఘన విజయంతో తనపై వస్తున్న విమర్శలకు సమాధానం చెప్పారు పూరి జగన్నాథ్. స్టైలిష్ ఎంటర్‌టైనర్‌గా 'మహర్షి' సినిమాను తెరకెక్కించి సక్సెస్‌ను సొంతం చేసుకున్నారు దర్శకుడు వంశీ పైడిపల్లి. 'ఎఫ్-2'తో కామెడీని పండించడంలో తన బలమేమిటో మరోసారి చాటిచెప్పారు దర్శకుడు అనిల్ రావిపూడి. కమర్షియల్ చిత్రాల దర్శకుడిగానే కాకుండా చారిత్రక కథాంశాల్ని సమర్థవంతంగా తెరకెక్కించగలడని 'సైరా నరసింహారెడ్డి'తో సురేందర్‌రెడ్డి నిరూపించుకున్నారు. 'మజిలీ'తో శివనిర్వాణ, 'జెర్సీ'తో గౌతమ్ తిన్ననూరి ప్రేక్షకుల మనసుల్ని గెలుచుకున్నారు. 'గద్దలకొండ గణేష్'తో హరీష్‌శంకర్ సక్సెస్ అందుకున్నారు.

## చిన్న సినిమాలు అద్భుత విజయాలు



ఈ ఏడాది కొన్ని చిన్న సినిమాలు చిరస్మరణీయమైన విజయాల్ని అందుకొని అందరి దృష్టినీ ఆకర్షించాయి. విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన 'ఫలక్‌నుమాదాస్' మంచి వసూళ్లను సాధించింది. 'ఏజెంట్‌సాయిశ్రీనివాస ఆత్రేయ' లాభాల్ని తెచ్చిపెట్టింది. అడివి శేష్ నటించిన 'ఎవరు' విమర్శకుల ప్రశంసల్ని అందుకోవడమే కాకుండా పెద్ద సక్సెస్‌ను సాధించింది. 'మల్లేశం', 'బ్రోచేవారెవరురా', 'జార్జిరెడ్డి', 'నిను వీడని నీడను నేనే', 'అర్జున్ సురవరం' లాభాలను తెచ్చిపెట్టాయి.


## కొత్త దర్శకుల హవా



2019లో నూతన దర్శకులు చేసిన ప్రయత్నాల్ని తెలుగు ప్రేక్షకులు ఆదరించారు.' ఏజెంట్‌సా యిశ్రీనివాస ఆత్రేయ'సిని మాతో ఎస్.జె.స్వరూప్ ప్రతిభావంతుడైనదర్శ కుడిగాపేరు తెచ్చుకున్నారు.' మల్లేశం'సినిమా తో రాజ్.ఆర్‌దర్శ కుడిగా పేరుప్రఖ్యాతుల్నిఅ ందుకున్నారు.ఆ సుయంత్రం రూపకల్పనలో తెల ంగాణచే నేతకారుడు చింతకింది మల్లేశానికిఎదు రైన అవరోధాల్ని హృద్యంగా తెరపై ఆవిష్కరించడంలో రాజ్‌ఆ ర్‌విజ యవంతమయ్యారు. '118' చిత్రంతో మెగాఫోన్ పట్టిన ఛాయాగ్రాహకుడుకె .వి.గుహన్ సక్సెస్‌నుఅ ందుకున్నారు. 'ఎవరు' సినిమాతో వెంకట్ రామ్‌జీప్రేక్ష కుల మెప్పును పొందారు. 'నిను వీడని నీడను నేనే' చిత్రంతో కార్తిక్‌రాజు, 'అర్జున్‌సు రవరం'సిని మాతో టి. సంతోష్‌అ రంగేట్రంలోనే విజయాల్నిఅ ందుకున్నారు.

## వైవిధ్యానికి పట్టం

2019లో ప్రయోగాలు, నటనకు ఆస్కారం ఉన్న పాత్రలతో సీనియర్ నాయికలు కొత్త అడుగులు వేశారు. 'ఓ బేబీ', 'మజిలీ' చిత్రాల్లో విలక్షణ నటనతో సమంత మెప్పించింది. భావోద్వేగభరిత పాత్రల్లో ఒదిగిపోయింది. 'మహర్షి', 'గద్దలకొండగణేష్' చిత్రాల్లో అందం, అభినయంతో అలరించిన పూజా హెగ్డే వరుస విజయాలతో దూసుకుపోయింది. 'ఎఫ్-2', 'సైరా నరసింహారెడ్డి' చిత్రాలతో తమన్నా ఈ ఏడాది రెండు సక్సెస్‌లను సొంతం చేసుకున్నది. 'ఇస్మార్ట్‌శంకర్'తో తెలుగులో తొలి విజయాన్ని అందుకున్న నిధి అగర్వాల్‌కు 'మిస్టర్ మజ్ను' మాత్రం కలిసిరాలేదు. 'బ్రోచేవారెవరురా', '118' చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రల్లో కనిపించింది నివేథా థామస్. 'ఇస్మార్ట్‌శంకర్' సినిమాలో వరంగల్ యువతి నభానటేష్ హుషారైన నటనతో ఆకట్టుకున్నది.




## కొత్త అందాలకు స్వాగతం



ఈ ఏడాది తెలుగు సినీ పరిశ్రమలో అడుగుపెట్టిన కొత్త కథానాయికలు తమ అందచందాలు, అభినయపటిమతో ఆకట్టుకున్నారు. 'దొరసాని చిత్రంతో టాలీవుడ్‌లో అరంగేట్రం చేసింది రాజశేఖర్, జీవితల తనయ శివాత్మిక. ఈ సినిమాలో దొరసాని దేవకి పాత్రలో సహజ నటనను ప్రదర్శించింది. 'జెర్సీ' సినిమాతో తెలుగులో తొలి అడుగు వేసిన కన్నడ సోయగం శ్రద్ధాశ్రీనాథ్ పరిణతితో కూడిన అభినయాన్ని కనబరిచింది. 'మజిలీ' సినిమాతో దివ్యాంశ కౌశిక్, 'మల్లేశం' చిత్రంతో అనన్య, 'కౌసల్య కృష్ణమూర్తి'తో ఐశ్వర్యారాజేష్ మంచి గుర్తింపును సొంతం చేసుకున్నారు.




## బయోపిక్‌ల జోరు


ఈ ఏడాది తెలుగులో పలు బయోపిక్ సినిమాలు రూపొందాయి. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జీవితం ఆధారంగా దర్శకుడు మహి.వి.రాఘవ్ రూపొందించిన 'యాత్ర' చిత్రం విమర్శకుల ప్రశంసల్ని అందుకున్నది. మమ్ముట్టి తన నటనతో రాజశేఖర్‌రెడ్డి పాత్రకు ప్రాణంపోశారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఆసుయంత్రం రూపకర్త చింతకింది మల్లేశం జీవితాన్ని వెండితెరపై ఆవిష్కృతం చేస్తూ తెరకెక్కిన 'మల్లేశం' చిత్రం వాణిజ్యపరంగా విజయాన్ని అందుకోవడమే కాకుండా మంచి సినిమాగా అందరి మన్ననల్ని పొందింది. విద్యార్థి ఉద్యమ నాయకుడు జార్జిరెడ్డి జీవితంతో తెరకెక్కిన 'జార్జిరెడ్డి' చిత్రం కమర్షియల్ సక్సెస్‌గా నిలిచింది. జార్జిరెడ్డి ఇతివృత్తాన్ని స్ఫూర్తిదాయకంగా తెరకెక్కించి ప్రతిభను చాటుకున్నారు దర్శకుడు జీవన్‌రెడ్డి. చిరంజీవి కథానాయకుడిగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందిన 'సైరా' చిత్రం తెలుగు ప్రేక్షకుల మెప్పును పొందినప్పటికీ ఇతర భాషల వారిని ఆకట్టుకోలేకపోయింది. 'ఎన్టీఆర్ కథానాయకుడు', 'ఎన్టీఆర్ మహానాయకుడు' చిత్రాలు ప్రేక్షకాదరణను పొందలేకపోయాయి.

## గ్యాప్ తీసుకున్నారు..

ఈ ఏడాది కొందరు అగ్ర కథానాయకుల్ని వెండితెరపై చూడాలనే అభిమానుల కోరిక తీరలేదు. 2019లో ఎన్టీఆర్ నటించిన సినిమాలేవీ ప్రేక్షకుల ముందుకు రాలేదు. గత ఏడాది 'అరవిందసమేత'తో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఆయన ఈ 2019లో రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఆర్‌ఆర్‌ఆర్'షూటింగ్‌తో పాటు కుటుంబానికి ఎక్కువగా సమయాన్ని కేటాయించారు. రవితేజతో పాటు నితిన్ ఈ ఏడాది అభిమానుల ముందుకు రాలేదు. గత సినిమాల ఫలితాల్ని దృష్టిలో పెట్టుకొని కథల ఎంపికలో ఆచితూచి అడుగులు వేయడంతో వీరిద్దరి కెరీర్‌కు 2019లో గ్యాప్ వచ్చింది. అల్లు అర్జున్ ఈ ఏడాది వెండితెరపై కనిపించలేదు. 'అల వైకుంఠపురములో' చిత్రీకరణతో ఈ సంవత్సరం బిజీగా ఉన్నారు.

...✍ సినిమా డెస్క్

### పర్వదినాలు

- సఫల ఏకాదశి, శక పౌష్య మాసం ప్రారంభం, కొమురవెల్లిలో మల్లికార్జునస్వామి కళ్యాణం, రెండు రోజుల పాటు వేడుకలు (నేడు)
- పక్ష ప్రదోషమి (23వ తేది)
- దర్శ అమావాస్య, క్రిస్మస్ (25వ తేది)
- టీటీ (తిరుమల తిరుపతి) అధ్యాయనోత్సవం ప్రారంభం, సూర్యగ్రహణం ఉ|| 8.03 నుంచి ప|| 11.10 వరకు (26వ తేది)
- 'జమా దిల్ ఉలా' నెల ప్రారంభం (28వ తేది)



కొమురవెల్లి మల్లికార్జునస్వామి

### పద్యం నేర్చుకొందాం

## ఆ అనుమానమే వద్దు!

కలడందురు దీనుల యెడ
కలడందురు పరమయోగి గణముల పాలన్
గలడందురన్ని దిశలన్
గలడు కలండనెడు వాడు గలడో లేడో!

**- శ్రీమద్భాగవతం (గజేంద్ర మోక్ష ఘట్టం)**

**దేవునిపట్ల** వీసమెత్తు కూడా అనుమానం అక్కర్లేదు. భౌతికంగా కనిపించకున్నా, 'ఎవరిని ఎప్పుడు ఎలా' ఆదుకోవాలో ఆయనకు బాగా తెలుసు. 'భాగవత సప్తాహం' ముగింపు సభలో మన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇదే విషయాన్ని ఉటంకించారు. గజేంద్రమోక్షం, ద్రౌపదీ వస్త్రాపహరణం ఘట్టాలను పేర్కొంటూ.. గజేంద్రుడైనా, ద్రౌపది అయినా పూర్తిగా పరమాత్మ పట్ల సంపూర్ణ విశ్వాసం వెల్లడించిన తర్వాతే తాను వచ్చి ఆదుకొన్నాడని చెప్పారు. ఈ సందర్భంగానే వారు ప్రజలకు వినిపించిన పై పద్యం మన మహాకవి పోతనామాత్యుని మధురభావనలలో ఒకటి. ఈ తరం వారికి ఇలాంటి భక్తి, నీతి, విలువలను తెలియజెప్పే అద్భుత పద్యాలను నేర్పించవలసిన అవసరం ఎంతైనా ఉంది.



### ప్రస్తావన

'భాగవతసప్తాహం'ము గిసినసందర్భంగా..

# భక్తి ముక్తావళి!

**కుచేలుడు,పోతన, చాగంటి– ఈ ముగ్గురిలోనూ పరిపూర్ణ భక్తి పునాదిపైకనిపించే' ఏకతా సూత్రం' ఒకటుంది. దీనిని తెలుసుకొన్న వారికి భాగవత పరమార్థం, మానవ జీవన సార్థకత రెండూ బోధపడుతాయి.**



**ప్రసిద్ధ** ఆధ్యాత్మిక వేత్త, ప్రవచన చక్రవర్తి చాగంటి కోటేశ్వరరావు 'భాగవత సప్తాహం' మొన్నటి (శుక్రవారం)తో ముగిసింది. హైదరాబాద్‌లోని 'తెలంగాణ కళాభారతి' (ఎన్టీఆర్ స్టేడియం)లో వారం రోజులపాటు (14నుంచి 20వ తేది వరకు) నిరంతరంగా కొనసాగింది. సాయంత్రపు చలికి వెనుకాడకుండా వేలాదిమంది భాగవత మకరందాన్ని ఆస్వాదించారు. ఈ సందర్భంగా భాగవత పరమార్థాన్ని, చాగంటి వారి గొప్పతనాన్ని తెలిపే చిన్న ప్రస్తావన.

'ఈ ఏడు రోజుల భాగవత సప్తాహం మనకేమిచ్చింది?' అని ఆలోచిస్తే, ఎవరికైనా ఒక కీలకాంశం బోధపడుతుంది. అదే భాగవత పరమార్థమైన భక్తి! భాగవతమంటేనే భగవంతుని కథ కాబట్టి, భక్తునికి భగవంతునికి మధ్య ఉండవలసింది కూడా 'ఇదేనని' ఎవరికైనా ఇట్టే తెలిసిపోతుంది. భక్తి అంటే ఏదో పైపై ప్రేమ కాదు. 'మనసా వాచా కర్మణా' పరమాత్మనే ప్రగాఢంగా నమ్ముకోవడం. పరిపూర్ణమైన విశ్వాసంతో దేవుణ్ణి నమ్మి కొలువడం. 'మనసు, మాట, ఆచరణ' మూడింటి మార్గం ఒక్కటైనప్పుడే ఇది సాధ్యమవుతుంది. అది కూడా భగవంతుడు ఏదైతే మనకు ఉద్బోధించాడో దాని సాధన దిశగానే మన ఆధ్యాత్మిక గమనం ఉండాలి. చాలామంది మనసులో నమ్ముతూ, మాటల్లో చెబుతూ ఆచరణవద్దకు వచ్చేసరికి విఫలమవుతుంటారు. తాత్కాలిక ప్రయోజనాలకు ఆశపడుతూ శాశ్వతానందాన్ని పట్టించుకోని వారే చాలామంది. ఈ 'భాగవత సప్తాహం' ముగింపు సభలో మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దీనినేఉ టంకించారు.

'భౌతిక వాంఛలు, సుఖాలకు అతీతమైన పరిపూర్ణమైన, ఏకైక భక్తిని మాత్రమే కలిగి ఉండే సజ్జనులు నిజంగా ఉంటారా?' అన్న అనుమానం కొందరికి కలుగవచ్చు. నిజమే, అలాంటి వారి సంఖ్య చాలా తక్కువ. ఈ కలికాలంలో అయితే, మరీ అత్యల్పం. కాగడా పెట్టి వెతికినా దొరుకుతారో లేదో తెలియదు. అలాంటి వారిలో మనమెందుకు ఉండకూడదు? అది మనలాంటి సామాన్యులకు అసాధ్యమా? పుట్టేటప్పుడు మనం ఏం తీసుకొచ్చామని ఈ పైపై సుఖాలకోసం ఆరాటం? ఈ కోణంలో ఆలోచించగలిగితే ఎవరికైనా పరిపూర్ణ భక్తి చింతన తప్పక సాధ్యమవుతుంది.

అసలు భాగవతమంటేనే పరిపూర్ణ భక్తి మార్గాన్ని ప్రబోధించేది. భక్తియోగంతో పరమాత్మ సన్నిధిని చేరుకోవడానికి లభించిన ఒక అద్భుత దారి దీపమిది. ప్రజలలో భగవంతునిపట్ల ఈ 'పరమోన్నత ప్రేమను' రగించడం కోసం ఉద్భవించిందే ఈ మహత్ పురాణం. జ్ఞానయోగాన్ని అందించిన శ్రీకృష్ణ పరమాత్మే అదే తన 'భగవద్గీత'లో భక్తియోగ సాధనను కూడా మనకు ప్రసాదించారు. దీనిని చేరుకొనే అత్యంత సరళతరమైన మార్గం భాగవతంలోనే ఉన్నది. పన్నెండు స్కంధాలలోని ప్రతీ కథలోనూ భక్తితో పరాసిద్ధిని పొందిన వారి జీవితాలు అంతర్లీనంగా మానవాళికి ఆదర్శప్రాయం. ఈ అనన్య సామాన్యమైన భక్తితో ఏదైనా (ఆఖరకు మోక్షాన్ని సైతం) పొందవచ్చునని భాగవతంలోని ప్రతీ సన్నివేశం అత్యంత వాస్తవికంగా నిరూపిస్తున్నది. పరీక్షిత్తు మహారాజు నుంచి మార్కండేయ మహర్షి వరకు ఎందరో దీనిని ఆచరించి చూపారు. అదేమ నలాంటి సామాన్యులకందరికీ నిత్యపారాయణం.

ఈతరం వారికి అర్థం కావడానికి ఒక చిన్న ఉదాహరణ. కుచేలుడు, పోతన, చాగంటి– ఈ ముగ్గురిలోనూ పైన చెప్పిన పరిపూర్ణ భక్తి ఒక 'ఏకతా సూత్రం' వలె మనకు కనిపిస్తుంది. దానిని తెలుసుకుంటే, భాగవత పరమార్థంతోపాటు మావన జీవన సార్థకత రెండూ మనకు బోధపడుతాయి. అప్పుడు 'సప్తాహం'లో పాల్గొన్న ఏడు రోజుల్లోనూ మనకు అర్థం కానిదేదైనా ఉంటే అదీ తెలిసివస్తుంది. కుచేలుడంటే భాగవతంలోనే శ్రీకృష్ణుని చిన్ననాటి స్నేహితుడు. పోతన ఎవరో కాదు, మన తెలుగు భాగవత సృష్టికర్త. ఇక చాగంటి కోటేశ్వరరావు ప్రస్తుత గొప్ప ప్రవచనకర్త. ఇక్కడ ఈ ముగ్గురినీ కలిపింది ఇదే భాగవత గాథ, పరమాత్మపట్ల వారిలోని పునరంకితభావం. భగవంతునిపట్ల మనలోని 'హృదయ సమర్పణ' ఏ స్థాయిలో ఉండాలో కూడా దీనితో మనకు తెలుస్తుంది.' మనసా వాచా కర్మణా' భక్తిని కలిగి ఉండడమంటే ఇదే మరి.

కుచేలుని వృత్తాంతంలో, పోతనామాత్యుడు భాగవతాన్ని శ్రీరామునికే అంకితం చేయడంలో ఎంతైతే స్వచ్ఛత ఉందో అంతటి అంశీభూత భక్తి పరంపరయే చాగంటి వారిలోనూ మనకు ఇప్పటికీ కనిపిస్తుంది. అందుకే, దేశప్రధాని అంతటి ఒక వ్యక్తి (పీవీ నరసింహారావు) 'ఏమైనా కోరుకొమ్మని' అడిగితే, 'పరమాత్మ అనుగ్రహ మొక్కటి చాలు' అని అనగలిగారాయన. కుచేలుడు తన ప్రియమిత్రుడైన శ్రీకృష్ణుని నోరు తెరిచి ఏమీ అడుగలేదు. పోతన తన భాగవతాన్ని శ్రీనాథుని కోర్కె మేరకు ఏ రాజుకో అంకితమీయనూ లేదు. వారిలోని అనన్యసామాన్యమైన భగవత్‌భక్తే వారికి ఈ యోగసిద్ధిని ప్రసాదించాయి.

నిజమైన భక్తులు భగవత్ తత్వం (భాగవతం)లోని ఈ సారాన్ని గ్రహిస్తారు. వారు ఆ మేరకు నిర్మలంగా, నిజాయితీగా, భౌతిక సుఖాలకు అతీతంగా, ఇంకా.. ఎంత సామాన్యంగా సాధ్యమైతే అంత సగటుగానే జీవించచూస్తారు. ఈ కాలంలో అయినా, మరే కాలంలో అయినా, మనిషి కడుపుకు, చిన్ని సంసారనావను నడపడానికి, ఏవో కొన్ని కుటుంబ బాధ్యతల నుండి గట్టెక్కడానికి 'ఎంత' (సిరి) కావాలి? 'లక్షాధికారైన లవణమన్నమే కాని/ మెరుగు బంగారంబు మింగబోడు' (శ్రీ నరసింహ శతకంలోని 'తల్లిగర్భము నుండి ధనము తేడెవ్వడు' పద్యభాగం) ఎంత అక్షరసత్యమో కదా. భౌతిక సుఖాన్ని మించిన పారమార్థిక పరమపద సోపాన ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోగలిగిన వారికి ఇక వేటితోనూ పనుండదు.

**దోర్బల బాలశేఖరశర్మ**

### వేళా విశేషం

## మరియ తనయుని మధుర హృదయం..

# కరుణాత్మ ప్రబోధం!

- పిల్లల బాధ్యతను తల్లిదండ్రులు తీసుకున్నట్లే వృద్ధాప్యంలో కన్నవారి బాధ్యతను పిల్లలు తీసుకోవాలన్నది' బైబిల్ నియమం.
- ఎక్కడైతే ప్రేమ ఉంటుందో అక్కడ కోపతాపాలుండవు. కరుణ ఉన్నచోట క్షమాగుణమూ ఉంటుంది.
- పాపాలకు బానిసలైన వారు దేవునికి విరోధులుగా జీవిస్తారు.

**క్రీస్తు జన్మదిన వేడుక (క్రిస్మస్) వస్తున్నది. ఎంతోమంది ఆయన చూపిన బాటలో నడువక, ఆయనకు నిజమైన వారసులు కాలేకపోతున్నారు. లౌకిక ఆశలపై దృష్టి పెట్టి, దేవుని దృష్టికి దూరంగా బతుకుతున్నారు. మానవాళిని రక్షించడానికే ప్రభువు ఈ భూమ్మీదకు వచ్చాడు. 'తన పుట్టుక నుంచి మరణం వరకూ మనం సమాజంలో ఎలా బతకాలో? ఎలా జీవించకూడదో' చెప్పారు. ఈ క్రిస్మస్ వేళ ఆ పరిశుద్ధాత్ముడు చెప్పిన సత్యవాక్కులను ఆచరణలో పెట్టే ప్రయత్నం చేద్దాం.**

**'ఇదిగో..** ప్రజలందరికీ ఒక మహా సంతోషకరమైన సువార్త ఇది. దావీదు పట్టణంలో సకలలోక రక్షకుడు మీ కోసమే ఆవిర్భవించాడు. ఆయనే ప్రభువైన క్రీస్తు' (లూకా 2:10,11). క్రీస్తు పుట్టుకను పరిశుద్ధ బైబిల్ గ్రంథంలో నిర్ధారించిన వాక్యాలివి. ఆయన పుట్టి 2019 సంవత్సరాలయ్యాయి. రెండోసారి కచ్చితంగా వస్తానన్న ఆయన (క్రీస్తు) రాకకోసం వధువు వలె సమాజం సిద్ధపడాలి. 'దొంగవలే వచ్చెదనని' చెప్పిన ఆ తండ్రి, ఏ క్షణాన వస్తారో తెలియదు. కాబట్టి, 'బుద్ధిగల కన్యకవలే కనిపెట్టుకొని' ఉండాలి. క్రీస్తును కనిపెట్టుకొని ఉండాలంటే ఆయన అనుసరించిన మార్గాన్ని అన్వేషించి, ఆచరించడమొక్కటే మార్గం. అప్పుడే మనలో జీవనకాంతి వెల్లివిరుస్తుంది.



#### ప్రేమగుణమే పరమావధి

'నిన్ను వలే నీ పొరుగు వారినీ ప్రేమించు' అని ఏసు క్రీస్తు చెప్పిన మాటలు మనం ఆచరించవలసిన జీవన విధానాన్ని తెలియజేశాయి. ఇప్పుడున్న సమాజం పొరుగువారిని కాదు కదా, కనీసం ఇంట్లోవారినీ ప్రేమించడం లేదు. 'ఎక్కడైతే ప్రేమ ఉంటుందో అక్కడ కోపతాపాలుండవు. కరుణ ఉన్నచోట క్షమాగుణమూ ఉంటుంది. అనేక ఇండ్లలో ప్రేమ లేక ఎన్నో కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. ఎవరిష్టానుసారం వారు ప్రవర్తిస్తున్నారు కాబట్టే, అనేక వ్యక్తులు, కుటుంబాలలో శాంతి కరువైంది.

#### విరోధులనైనా క్షమించగలగాలి!

'క్షమించమనే వాడు మనిషి. 'క్షమించే వాడు దేవుడు'. ప్రేమ ఉన్నచోట క్షమాపణ ఉన్నట్లు, పొరుగు వారిపై ప్రేమ కలిగిన వ్యక్తి ఎలాంటి తప్పులు చేసినా ప్రభువు క్షమిస్తాడు. అదే దైవత్వం. బైబిలు ప్రకారం మనం ఇతరులను క్షమించాలి. ఒకరి యెడల ఒకరు దయతో ఉండాలి. మనల్ని దేవుడు క్షమించినట్లే, మన విరోధులనూ మనం క్షమించాలి. తప్పు ఒప్పుకోవడం ఒక గొప్ప విషయమైతే, ఎలాంటి తప్పునైనా క్షమించగలిగే గుణం కలిగి ఉండడమే నిజమైన దైవత్వం. 'తనపై ఏ నేరం లేకపోయినా, శిక్ష వేసి, చిత్రవధ చేస్తున్నా, మరణపు చివరి గడియల్లో కూడా' ఆ కరుణామయుడు 'తండ్రీ! వీళ్లు ఏం చేస్తున్నారో వీరు ఎరుగరు. కనుక, వారిని క్షమించు' అని మరణపు అంచున ఉండికూడా క్షమాగుణం చాటారు ప్రభువైన ఏసుక్రీస్తు.

#### క్రమశిక్షణకు కట్టుబడదాం!

'పిల్లలు నడువాల్సిన త్రోవను వారికి నేర్పించాలి. అప్పుడు పెరుగుతున్నకొద్దీ దానికే వారు కట్టుబడతారు' అని బైబిల్ చెబుతున్నది. 'మొక్కై వంగనిది మానై వంగునా' అన్నారు పెద్దలు. కొన్ని సందర్భాలలో గారాబం కంటే దండనే ముఖ్యం. బెత్తము, గద్దింపు ఒక్కోసారి కావలసిన జ్ఞానాన్ని కలిగిస్తాయి. అలాగే, యవ్వన దశనుంచే పిల్లలు తల్లిదండ్రుల బాధ్యతను తీసుకోవాలి. చిన్ననాటి నుంచే వారు తల్లిదండ్రులకు విధేయులై ఉండాలి (ఎఫెసీ 6:1,2). 'బాల్యంలో పిల్లల బాధ్యత తల్లిదండ్రులు తీసుకున్నట్లే, వృద్ధాప్యంలో తల్లిదండ్రుల బాధ్యతను పిల్లలు తీసుకోవాలి' ఇదీ బైబిల్ నియమం.

#### ఎదిగే కొద్దీ ఒదగండి!

మనకు అప్పజెప్పిన ఏ పనైనా నమ్మకంగా చేయాలని ఏసుక్రీస్తు బోధించారు. నేటికాలంలో భర్తపై భార్యకు, భార్యపై భర్తకు నమ్మకాలు కరువైనాయి. అనుమానాలతోనే సంసార సాగరం ఈదుతున్నారు. పర్యవసానాలు వివాహేతర సంబంధాలకు, హత్యలకు సైతం దారితీస్తున్నాయి. 'మరణం ఆసన్నమయ్యేదాకా నమ్మకంగా ఉన్నప్పుడే నేను నిన్ను అనుగ్రహిస్తాను' అన్నారు క్రీస్తు. అపవాది (సాతాను) ఎన్ని ఇబ్బందులు పెట్టినా, కుటుంబంలో ఎన్ని కలహాలు రేపినా నమ్మకాన్ని మాత్రం కోల్పోవద్దు. 'ఎంత ఎదిగినా ఒదిగి ఉండాల'న్నది ఆయన ఆదేశం. ఇదే మనల్ని ఉన్నత స్థానంలో నిలబెడుతుంది.

#### పాపపు పనులు వద్దు!

'పాపపు ఊబిలోంచి బయటపడదాం. దేవున్ని విశ్వసించి ఆయన కృపను పొందుదామని' ఏసుక్రీస్తు చెప్పారు. పాపాలకు బానిసలైన వారు అపవాది చెప్పినట్లు నడుచుకొంటూ, దేవునికి విరోధులుగా జీవిస్తారు. 'నరహత్య, వ్యభిచారం, పరాయి స్త్రీలను లైంగికవాంఛతో చూడడం, దొంగతనం, అబద్ధపు సాక్ష్యం, నీ పొరుగు వాని భార్యనైనను, దాసుడినైననూ, అతనికి చెందిన పశుపక్ష్యాదులపైనా ఆశ పడడం'.. ఇవన్నీ నిషిద్ధాలు. ఏసు శరణమే మనకు ఏకైక మార్గం.




**రెవ. కత్తి విక్టర్ పాల్**
తెలుగు బాప్టిస్ట్ చర్చి, కలకోట
సెల్: 9951243487



**మతమార్పిడులు మనకెందుకు?**

*బైబిలు బలవంతపు మతమార్పిడి వద్దంటున్నది. ప్రభువు మతమార్పిడి చెందమనీ చెప్పలేదు. కానీ, మతి (మనసు) మార్పిడి చేసుకోమన్నారు (మత్తయి 23:15). తమ మతమే గొప్పదని గర్వించే వారిని సిగ్గు పడేలా చేశారాయన (లూకా 10:30–37). యూదులు తమ మతమే గొప్పదని భ్రమపడతారు. ప్రభువు వారికంటే ఇతర మతాలలోని విశ్వాసపు విలువను కొనియాడారు. కనుక, అన్ని మతాలూ మంచినే కోరాలి. ఇలా సద్గుణాలతో జీవించే వారికే బైబిలు మోక్షమార్గం చూపిస్తుంది.*

## దేవుడు కనిపించాలంటే?

### ధర్మసందేహం

**'దేవుడు** నిజంగా ఉంటే అందరికీ కనిపించాలి కదా! ఎందుకు కనిపించడు? కాబట్టి, దేవుడు లేడని నిర్ధారించుకోవచ్చు' అనేవాళ్లకు భగవద్గీతలో పరమాత్మ చక్కని సమాధానమిచ్చారు. 'నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా/ శక్యం ఏవం విధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా || (53–11), భక్త్యా త్వనన్యయా శక్య అహమేవం విధో ర్జున/ జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప' || (54–11). భక్తి, శ్రద్ధ, తపన, అంకిత భావం ఇవేవీ లేకుండా పేరుకు మాత్రం దానధర్మాలు, పూజలు పురస్కారాలు, విద్యాసాధన, గ్రంథపఠనాలు చేసినంత మాత్రాన దేవుడు కనిపించడు. ఆయనను మనస్ఫూర్తిగా, సంపూర్ణంగా విశ్వసించాలి. మనలోని ఆత్మ ఎంత నిజమో, పరమాత్మ కూడా అంతే నిజమని నమ్మాలి. భౌతిక నేత్రాలకు కనిపించకున్నా 'నిజంగా ఉన్నాడు' అన్న భావన మనసునిండా ఏర్పరచుకోవాలి. ఆధ్యాత్మిక సాధన స్వార్థ రహితంగానే సాగాలి. పరమాత్మ తప్ప మరో ధ్యాస, కోర్కె లేని స్థితికి చేరుకోవాలి. అప్పుడు వారు ధ్యానించే రూపంలో తప్పక దేవుడు కనిపిస్తాడు. ఆ పరమాత్మ రూపం తోటి మనిషిలో కావచ్చు. జ్యోతి స్వరూపంగానైనా కావచ్చు.



**- సావధానశర్మ**



## రాజ యోగ్యత ఎవరికి?

### జీవనవేదం

**మానవులు** పాత్ర నెరిగి దానం చేయాలి. అంటే, దానానికి ఎవరు అర్హులో వారికే అన్నమాట. సుపాత్రుడు అడిగినప్పుడు లేదనకుండా యథాశక్తి దానం చేయాలి. పీడితులను దరిచేరనీయకుండా దూరం ఉంచాలి. ఆధ్యాత్మిక మార్గంలో కొనసాగుతూ ధర్మకార్యాలను ఆచరించాలి. ఎవరైతే ఉత్తమ గుణ, కర్మ, స్వభావాలను స్వీకరిస్తూ, తోటివారిని ప్రోత్సహిస్తూ సంపదపరులుగా ఉంటారో వారే ప్రశంసనీయులవుతారు. ఇలాంటి వారే రాజు కావడానికి యోగ్యతను కలిగి ఉంటారు. ఎవరి సంస్కారం వల్ల దుష్టుడు కూడా శ్రేష్ఠుడవుతాడో, పిరికివాడు శూరుడవుతాడో, పాషాణ హృదయుడు, పిసినారి దానశీలులవుతాడో.. వీరినందరినీ మార్చగలిగిన వ్యక్తే గొప్ప రాజుగా మన్ననలందుకొంటాడు.

**- ఋగ్వేదం**

### గ్రహణ సమాచారమ్

## పాక్షిక దర్శనం



**ఈనెల 26వ తేదీ** (గురువారం)న సంభవించే పాక్షిక సూర్యగ్రహణం మన దేశంలోనూ కనిపిస్తుంది. పాక్షికమే అయినప్పటికీ భూమిమీది చాలా ప్రాంతాల వారికి ఇది దర్శనమిస్తుంది. సాధారణ గ్రహణ నియమాలు, పద్ధతులన్నీ దీనికి వర్తిస్తాయని పౌరోహితులు చెబుతున్నారు. వారి సమాచారమ్ ప్రకారం..

- ఈ గ్రహణం ధనూరాశిలో వస్తున్నది. కనుక, ఈ రాశివారు గ్రహణాన్ని చూడకపోవడమే మంచిది.
- మూలా నక్షత్రం సమయంలో గ్రహణం పడుతున్నది. కనుక, ఈ రాశివారు శాంతి చేసుకోవాలి.
- గ్రహణవేళ సూర్యచంద్ర బింబాల (వీలైతే వెండి వంటివాటితో చేసినవి)ను, శక్తిమేర ఇతరేతర దానధర్మాలు ఎంతో మంచివని శాస్త్రాలు చెబుతున్నాయి.
- ఈ దానాలన్నీ భూదానంతో సమానమని పండితులు చెప్తారు.
- ధనుస్సు, కన్య, వృషభం, మకర రాశుల వారికి అధమ ఫలితాలు.
- వృశ్చికం, సింహం, మిథునం, మేషరాశుల వారికి మధ్యమ ఫలితాలు.
- ఈ 8 రాశుల వారూ గ్రహణం తర్వాత తప్పనిసరిగా విడుపు స్నానం చేయడం శుభకరం.
- వారు ఇంకా వీలైతే, శివాలయాలలో అభిషేకం చేసుకోవచ్చు.
- తుల, కర్కాటక, మీన, కుంభరాశుల వారికి ఈ గ్రహణం ఉత్తమ ఫలితాలను ఇస్తున్నది.

# నిపుణ

# — విద్య ఉద్యోగ సమాచారం —

## టాటా ఇన్నోవేషన్ ఫెలోషిప్

**భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ పరిధిలోని బయోటెక్నాలజీ విభాగం 2019-20 సంవత్సరానికి టాటా ఇన్నోవేషన్ ఫెలోషిప్ నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- **ఫెలోషిప్:** టాటా ఇన్నోవేషన్ (2019–20)
- **ఫెలోషిప్‌లసంఖ్య:** 5 (ప్రతి ఏడాది ఐదు ఇస్తారు)
- **ఫెలోషిప్‌మొత్తం:** నెలకు రూ.25 వేలు ఇస్తారు.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ/ పీహెచ్‌డీ/తత్సమాన ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్31
- **వెబ్‌సైట్:** http://dbtindia.gov.in

## ఏఎండీలో

**అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రిసెర్చ్ (ఏఎండీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 78
- **పోస్టులవారీగా ఖాళీలు:** సైంటిఫిక్ ఆఫీసర్ (మెడికల్ డ్యూటీ)–2, సైంటిఫిక్ అసిస్టెంట్ బీ (డ్రిల్లింగ్)–10, సైంటిఫిక్ అసిస్టెంట్ బీ (ఫిజిక్స్)–1, సైంటిఫిక్ అసిస్టెంట్ బీ (సర్వే)–2, సైంటిఫిక్ అసిస్టెంట్ బీ (ఎలక్ట్రికల్)–2, టెక్నీషియన్ బీ (డ్రిల్లింగ్/డీజిల్/ ఆటో మెకానిక్)–14, టెక్నీషియన్ బీ (ఎలక్ట్రికల్)–4, గ్రేడ్–3 స్టెనోగ్రాఫర్–3, అప్పర్ డివిజన్ క్లర్క్–10, డ్రైవర్ (ఆర్డినరీ గ్రేడ్)–30 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హతలు:** వేర్వేరు పోస్టులకు వేర్వేరుగా ఉన్నాయి. వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2020, జనవరి 10
- **వెబ్‌సైట్:** www.amd.gov.in


## ఐవోసీఎల్‌లో

**ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టు:** జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్
- **మొత్తం ఖాళీలు:** 37
- **విభాగాలు:** మెక్ ఫిట్టర్ కమ్ రిగ్గర్, ప్రొడక్షన్, ఇన్‌స్ట్రుమెంటేషన్.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, కంట్రోల్ ఇంజినీరింగ్ ఉత్తీర్ణత, అనుభవం.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **హార్డ్‌కాపీ పంపడానికి చివరితేదీ:** 2020, ఫిబ్రవరి 1
- **చివరితేదీ:** 2020, జనవరి 17
- **వెబ్‌సైట్:** https://www.iocrefrecruit.in

## పార్లమెంట్‌లో

**న్యూఢిల్లీలోని పార్లమెంట్ ఆఫ్ ఇండియాలో భాగమైన లోక్‌సభ సెక్రటేరియట్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**




- **మొత్తం ఖాళీలు:** 3
- **పోస్టులు:** క్యురేటోరియల్ అసిస్టెంట్, కన్జర్వేషన్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్.
- **అర్హత:** పోస్టుని అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత, అనుభవం.
- **వయస్సు:** 27 ఏండ్లు మించరాదు.
- **ఎంపిక విధానం:** అప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2020, జనవరి 13

- **పోస్టు:** పార్లమెంటరీ రిపోర్టర్
- **మొత్తం ఖాళీలు:** 21
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇంగ్లిష్/ హిందీలో షార్ట్‌హ్యాండ్ టైపింగ్.
- **ఎంపిక విధానం:** షార్ట్‌హ్యాండ్ టెస్ట్, రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2020, జనవరి 28
- **వెబ్‌సైట్:** http://loksabhadocs.nic.in


epaper.ntnews.com

# గ్రామీణాభివృద్ధి, వ్యవసాయంపై ఫోకస్

> వివిధ శాఖల పనితీరుపై సమీక్షలో ప్రధాని మోదీ
> సీఏఏ, ఎన్నార్సీలపై వ్యతిరేకత నేపథ్యంలో మంత్రుల పనితీరుపై సమీక్ష



ప్రధాని మోదీ (ఫైల్)

**న్యూఢిల్లీ, డిసెంబర్ 21:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మంత్రివర్గ సహచరుల పనితీరును శనివారం సమీక్షించారు. కేంద్రంలో రెండో దఫా బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఆరు నెలల్లో ఆయా శాఖల మంత్రుల పనితీరును మోదీ సమీక్షించారు. సమీక్షా సమావేశం సాయంత్రం వరకు కొనసాగింది. వివిధ మంత్రిత్వశాఖలు తాము తీసుకున్న విధాన నిర్ణయాలపై సంక్షిప్త ప్రజంటేషన్లతో ప్రధానికి వివరిస్తున్నాయని అధికార వర్గాల కథనం. సామాజిక రంగం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగాలపై ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరించాలని ఈ సమీక్షలో నిర్ణయించినట్లు సమాచారం. ఇటీవల పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)తోపాటు ప్రతిపాదిత జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ)లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ సమీక్ష జరుగుతుండటం గమనార్హం. అయితే ఈ సమీక్షా సమావేశంలో సీఏఏ, ఎన్నార్సీ అంశాలు ప్రస్తావనకు వచ్చాయా? లేదా? అన్న సంగతి తెలియరాలేదు. సాధారణంగా ప్రతి నెలా క్యాబినెట్ భేటీ తర్వాత మంత్రులంతా సమావేశం కావడం సంప్రదాయంగా జరుగుతున్నది. కానీ ఈ దఫా మంత్రిత్వశాఖల వారీగా విడివిడిగా సమీక్ష సాగుతున్నది.

# ప్రముఖ శాస్త్రీయ గాయకురాలు విదుశి సవితా దేవి కన్నుమూత




**గుర్గావ్, డిసెంబర్ 21:** ప్రముఖ హిందుస్థానీ శాస్త్రీయ గాయకురాలు విదుశి సవితాదేవి (80) కన్నుమూశారు. చికిత్సపొందుతూ శనివారం ఉదయం తుదిశ్వాస విడిచినట్టు దేవి కుమారుడు అజయ్ మహరాజ్ తెలిపారు. 'సవితాదేవి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక దవాఖానకు తరలించాం. వెంటిలేటర్‌పై చికిత్సపొందారు. వైద్యులు తమవంతు ప్రయత్నంచేసినప్పటికీ చివరకు ఆమె కన్నుమూశారు' అని చెప్పారు. పద్మశ్రీ అవార్డుగ్రహీత దివంగత సిద్ధేశ్వరి దేవి కుమార్తె అయిన సవితాదేవి.. శాస్త్రీయ సంగీతరంగంలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. తుమ్రి, దాద్రా, చైతి, కజ్రి, తప్ప వంటి సంగీతరూపాల్లో ఆమె అత్యంత ప్రాచుర్యంపొందారు. పండిట్ రవిశంకర్ వద్ద సితారా శిక్షణ పొందినప్పటికీ.. చివరకు తల్లి వారసత్వాన్ని పునికిపుచ్చుకొని స్వరసంగీత ప్రచారం కోసం జీవితాన్ని ధారపోశారు. దేశ, విదేశాల్లో అనేక కచేరీలు ఇవ్వడమే కాకుండా, ఆలిండియా రేడియో, నేషనల్ టెలివిజన్‌లో తరచూ ప్రదర్శనలు ఇచ్చేవారు. తల్లి జీవితచరిత్రపై 'మా.. సిద్ధేశ్వరి' పేరిట పుస్తకం రాశారు. ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని దౌలత్‌రాం కళాశాలలో సంగీత విభాగానికి హెడ్‌గా కూడా ఆమె పనిచేశారు.



# కుటుంబవ్యవస్థ బలోపేతం కావాలి

- పెద్దలను గౌరవించే పద్ధతిని పిల్లలకు నేర్పాలి
- ఉప రాష్ట్రపతి వెంకయ్యా నాయుడు హితవు



ఎయిమ్స్ వైద్యుడు డాక్టర్ ప్రసూన్‌ఛటర్జీ రచించిన 'హెల్త్ అండ్ వెల్‌బీయింగ్ ఇన్ లేట్ లైఫ్' అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 21:** ప్రస్తుత సమాజంలో కుటుంబ వ్యవస్థ బలోపేతం కావాల్సిన అవసరం ఉన్నదని ఉప రాష్ట్రపతి వెంకయ్యా నాయుడు అన్నారు. కుటుంబ విలువల గురించి, పెద్దలను గౌరవించడం వంటి పద్ధతులను గురించి పిల్లలకు చిన్నప్పటి నుంచే నేర్పాలని హితవు పలికారు. వృద్ధాప్యంలో ఉన్న వారి ఆరోగ్యం, యోగక్షేమాలపై కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధచూపాలన్నారు. ఢిల్లీలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న వెంకయ్య నాయుడు, ఎయిమ్స్ వైద్యుడు డాక్టర్ ప్రసూన్ ఛటర్జీ రచించిన 'హెల్త్ అండ్ వెల్‌బీయింగ్ ఇన్ లేట్ లైఫ్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పశ్చిమ సంస్కృతి పోకడపై ఆయన మాట్లాడుతూ.. 'మనం వెనక్కువెళ్లి మన భారతీయ కుటుంబ వ్యవస్థ, విలువలు, సంస్కృతి, సంప్రదాయాలను ఒక్కసారి గుర్తు చేసుకోవాలి. తల్లిదండ్రులు, గురువు, ప్రకృతిని గౌరవించడమన్నది మన భారతీయ తత్వంలో మిళితమై ఉన్నదని గ్రహించాలి' అని వ్యాఖ్యానించారు. భారతీయ కుటుంబ వ్యవస్థ, కుటుంబ విలువలను 'భారతీయ నాగరికత ప్రత్యేకత'గా వెంకయ్య అభివర్ణించారు. తల్లిదండ్రులు మలి వయసులో వివక్షకు గురికావడం, వారిని వృద్ధాశ్రమాల్లో ఉంచడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలను జాగ్రత్తగా చూసుకోవడం పిల్లలు కచ్చితంగా పాటించాల్సిన విధి అని స్పష్టం చేశారు. దేశంలో వృద్ధుల సంఖ్య గతం కంటే వేగంగా పెరుగుతున్నదని, 2050 నాటికి ప్రపంచ జనాభాలో 20 శాతం మంది 60 ఏండ్లు దాటిన వారే ఉంటారని వెంకయ్య పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉండాలని, వృద్ధులు ఆరోగ్యంగా, సంతోషంగా జీవించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వృద్ధుల ఆరోగ్యంపట్ల ప్రభుత్వం చూపుతున్న చొరవను వెంకయ్య ప్రశంసించారు.

# ప్రమీలకు సెనెటర్ల మద్దతు

> ప్రమీలతో జైశంకర్ భేటీ కాకపోవడంపై.. అసంతృప్తి వ్యక్తంచేసిన సెనెటర్లు బెర్నీ శాండర్స్, వారెన్
> కశ్మీర్ అంశంలో ఆమె నోరు నొక్కడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణ



**వాషింగ్టన్, డిసెంబర్ 21:**

డెమొక్రాటిక్ పార్టీ తరపున అమెరికా అధ్యక్ష పదవి రేసులో ఉన్న సెనెటర్లు బెర్నీ శాండర్స్, ఎలిజిబెత్ వారెన్‌తో పాటు మరో ఇద్దరు సెనెటర్లు భారతీయ అమెరికన్ పార్లమెంటు సభ్యురాలు ప్రమీలా జయపాల్‌కు మద్దతుగా నిలిచారు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే అధికరణ 370 రద్దు తర్వాత అక్కడ విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని పేర్కొంటూ కాంగ్రెగేషనల్ కమిటీ ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ముందు నుంచి కశ్మీర్‌లో నెలకొన్న ఆంక్షలను గట్టిగా వ్యతిరేకిస్తున్న ప్రమీలా జయపాల్ ఆ కమిటీలో భాగస్తులై ఉన్నారు. అయితే, ఈ తీర్మానంపై కమిటీతో సమావేశమయ్యేందుకు భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ నిరాకరించారు. ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టిన ఈ తీర్మానం జమ్ముకశ్మీర్ వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. చర్చలు జరపాలనుకున్న వారిని కలిసేందుకు తనకు ఎలాంటి అభ్యంతరమూ లేదని, కాకపోతే ముందుగానే అభిప్రాయాలు ఏర్పరచుకున్న వారితో(ప్రమీలా జయపాల్‌తో) మాత్రం కాదని ఆయన స్పష్టం చేశారు. తనతో భేటీని జైశంకర్ రద్దు చేసుకోవడంపై ప్రమీలా జయపాల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భిన్నాభిప్రాయాలను వినడానికి భారత ప్రభుత్వం సిద్ధంగా లేదన్న విషయం దీంతో రుజువైందని ఆమె ట్వీట్ చేశారు. దీంతో సెనెటర్లు బెర్నీ శాండర్స్, ఎలిజిబెత్ వారెన్‌తో పాటు మరో ఇద్దరు సెనెటర్లు జయపాల్‌కు బాసటగా నిలిచారు. ప్రమీలా జయపాల్‌తో జైశంకర్ సమావేశం కాకపోవడంపట్ల తీవ్ర అభ్యంతరం ప్రకటించారు. కశ్మీరీలు, ముస్లింలకు అనుకూలంగా ఆమె మాట్లాడినంత మాత్రాన ఆయన ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో తెలియడంలేదన్నారు. ప్రమీలా జయపాల్ నోరు నొక్కడానికి జరుగుతున్న యత్నాలను వారు ఖండించారు. భారత-అమెరికా దేశాల మధ్య చక్కని భాగస్వామ్యం ఉన్నదని, మంచి వాతావరణంలో జరిగే చర్చలు దీన్ని మరింత బలోపేతం చేస్తాయని వాళ్లు పేర్కొన్నారు. 'మానవహక్కుల పరిరక్షణకు బాసటగా నిలిచే అమెరికా సెనెటర్ల గొంతుకను నియంతృత్వ అధికార ప్రభుత్వం నొక్కివేయొచ్చు గానీ, భారత ప్రభుత్వం ఈ చర్యలకు పాల్పడుతుందని అనుకోలేదు. కశ్మీరీలు, ముస్లింలపై విధించిన ఆంక్షలపై జయపాల్ పేర్కొన్న అంశాలన్నీ సరైనవే' అని శాండర్స్ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. 'భారత్, అమెరికా మధ్య అతి ముఖ్యమైన భాగస్వామ్యం ఉన్నది. అయితే, ప్రజాస్వామ్యం, మానవహక్కులు, వివిధ మతాల పట్ల గౌరవం ఉన్నప్పుడే ఈ భాగస్వామ్యం ఫలప్రదం అవుతుంది' అని మరో సెనెటర్ వారెన్ ట్వీట్ చేశారు.

## ఎల్వోసీలో ఇద్దరు పాక్ సైనికుల మృతి

> సరిహద్దులో బరితెగించిన పొరుగుదేశం.. భారత్ ప్రతీకారం



**జమ్ము, డిసెంబర్ 21:** జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వద్ద కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన పాకిస్థాన్‌పై భారత సైన్యం ప్రతీకారచర్యకు దిగింది. కాల్పులకు తెగబడ్డ పాక్ సైనికులకు ధీటుగా బదులిచ్చింది. అఖ్నూర్, సుందర్బని సెక్టార్లలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు పాక్ సైనికులు మృతిచెందినట్టు రక్షణవర్గాలు వెల్లడించాయి. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత అఖ్నూర్ సెక్టార్‌లోని ఖౌర్, పల్లన్‌వల్లా ప్రాంతాల్లోని సైనిక శిబిరాలపై పాకిస్థాన్ దళాలు కాల్పులకు తెగబడ్డాయి. వీటిని సమర్థంగా ఎదుర్కొన్న భారత సైన్యం.. ఎదురుదాడికి దిగింది. శనివారం ఉదయం నియంత్రణ రేఖ వద్ద ఇద్దరు పాకిస్థాన్ సైనికుల మృతదేహాలు గుర్తించినట్టు రక్షణవర్గాలు తెలిపాయి. సరిహద్దు వెంట ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నాయి. పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో.. రెండుదేశాల సైన్యం మధ్య పెద్దఎత్తున కాల్పులు జరిగాయని, మరిన్ని వివరాలు తెలియాల్సి ఉన్నదని జమ్మూకు చెందిన ఆర్మీ పీఆర్వో లెఫ్టినెంట్ కల్నల్ దేవేందర్ ఆనంద్ చెప్పారు. శనివారం ఉదయం సుందర్బని సెక్టార్‌లోని కెరి బత్తల్ ప్రాంతంలోనూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన పాక్ సైనికులు.. మోర్టర్లు, చిన్న ఆయుధాలతో కాల్పులు జరిపారని, భారత సైన్యం దీనిని సమర్థంగా ఎదుర్కొన్నదని తెలిపారు. సరిహద్దులోని గ్రామాలపై కూడా పాక్ సైనికులు కాల్పులకు తెగబడ్డారని, ఇప్పటివరకు తెలిసిన సమాచారం మేరకు ఎవరికీ గాయాలు కాలేదని పేర్కొన్నారు. ముందజాగ్రత్త చర్యగా సరిహద్దు గ్రామాల ప్రజలు ఇండ్లలోని అండర్‌గ్రౌండ్ బంకర్లలోనే తలదాచుకోవాలని, బయటకు రావొద్దని అధికారులు సూచించారు.

## 70 ఏండ్ల వృద్ధుడు, మరో వ్యక్తికి జీవిత ఖైదు

> బాలికపై సామూహిక లైంగిక దాడి కేసులో పోక్సో కోర్టు తీర్పు

**కోటా, డిసెంబర్ 21:** 70 ఏండ్ల వృద్ధుడితో పాటు మరో వ్యక్తికి పోక్సో ప్రత్యేక కోర్టు జీవిత ఖైదు విధించింది. బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడిన కేసులో శుక్రవారం ఈ మేరకు తీర్పు వెల్లడించింది. రాజస్థాన్‌లోని కోటా జిల్లా పరిధిలోని డియోలి మంజి గ్రామానికి చెందిన బాబు లాల్ మాలి అలియాస్ కృష్ణ మురారి (70), తన అనుచరుడు మోహిత్ మాలి అలియాస్ మనోజ్ (40)తో కలిసి 13 ఏండ్ల బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. 2017 మే 30న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులపై పోక్సో చట్టంతోపాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసుపై రెండేండ్ల పాటు విచారణ జరుగగా, పోక్సో కోర్టు 2 న్యాయమూర్తి నరేంద్ర కుమార్ శర్మ శుక్రవారం ఇద్దరు నిందితులను దోషులుగా నిర్ధారించి శిక్షలు ఖరారు చేశారు. వారికి జీవిత ఖైదు విధించడంతోపాటు ఒక్కొక్కరికి రూ.35 వేల చొప్పున జరిమానా విధించినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయ్ తెలిపారు.

## ఔరంగాబాద్ పేరు మార్చండి

> బీజేపీ డిమాండ్

**ఔరంగాబాద్, డిసెంబర్ 21:** ఔరంగాబాద్ పేరును శంభాజీనగర్‌గా మార్చాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఔరంగాబాద్ డిప్యూటీ మేయర్ పదవికి తమ నేత రాజీనామా చేసిన వారం తర్వాత వ్యూహాత్మకంగా శివసేన ఇదివరకు చేసిన డిమాండ్‌నే బీజేపీ తెర మీదకు తీసుకొచ్చింది. శుక్రవారం బీజేపీ నాయకుల బృందం మేయర్ నందకుమార్ ఘోడేలాను కలిసి ఔరంగాబాద్ పేరు మార్చాలని.. కార్పొరేషన్‌లో తీర్మానం చేయాలని కోరారు. 'ఔరంగాబాద్ పేరు మార్పు శివసేన వ్యవస్థాపకుడు దివంగత బాల్‌ఠాక్రే కల' అని వారు పేర్కొన్నారు.

## గౌతం గంభీర్‌కు బెదిరింపు కాల్స్

> ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసిన బీజేపీ ఎంపీ



**న్యూఢిల్లీ:** తనను చంపేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని మాజీ క్రికెటర్, బీజేపీ ఎంపీ గౌతం గంభీర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదుచేశారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి అంతర్జాతీయ ఫోన్ నంబర్ నుంచి తనకు హత్యా బెదిరింపు కాల్స్ వస్తున్నాయని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు, తన కుటుంబసభ్యులకు భద్రత కల్పించాలని డిప్యూటీ పోలీస్ కమిషనర్‌కు ఆయన విజ్ఞప్తిచేశారు. గంభీర్ ఫిర్యాదును నమోదు చేసుకొన్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఫోన్ కాల్ ఆధారంగా నంబర్‌ను గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# కడుపు కోతకు కటీఫ్!

- పెరుగుతున్న సహజ ప్రసవాలు
- అనవసర ఆపరేషన్లకు అడ్డుకట్ట
- ఆర్నెల్లలో 60 నుంచి 30శాతానికి తగ్గిన సిజేరియన్లు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అనవసరమైన కడుపు కోతకు అడ్డుకట్ట పడుతున్నది.. సహజ ప్రసవాలకే ప్రాధాన్యమివ్వడంతో సిజేరియన్ల సంఖ్య భారీగా తగ్గుతున్నది. సహజ ప్రసవాలను పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్న విధానాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ముఖ్యంగా సర్కారు దవాఖానల్లో సిజేరియన్ల శాతం గణనీయంగా తగ్గుతున్నది. 2019 జనవరి నుంచి జూన్ మధ్యకాలంలో సరాసరి 63 శాతం ఉన్న సిజేరియన్లు నవంబర్ చివరికి 30 శాతానికి తగ్గించగలిగారు. ఓవైపు సర్కారు దవాఖానల్లో ప్రసవాలను ప్రోత్సహిస్తూనే సిజేరియన్ల శాతాన్ని పూర్తిస్థాయిలో తగ్గించేందుకు వైద్య శాఖ కృషి చేస్తున్నది. ఇందుకోసం ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి రాష్ట్రంలోని 40 దవాఖానల్లో ప్రయోగాత్మక విధానాలు అవలంబిస్తున్నది. ఈ కారణంగానే నవంబర్ నాటికి సిజేరియన్లు 30 శాతానికి తీసుకురాగలిగారు. ఏడాది చివరి వరకు మరింత తగ్గించడమే లక్ష్యంగా వైద్య, ఆరోగ్యశాఖ కృషి చేస్తున్నది. తొలి కాన్పులో సహజ ప్రసవాలను పెంచాలని. చేపట్టిన ప్రత్యేక చర్యల కారణంగా సిజేరియన్లు గణనీయంగా తగ్గాయి.. జిల్లా దవాఖాలు, మాతాశిశు సంరక్షణ దవాఖానలు, ప్రాంతీయ దవాఖానలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రణాళిక అమలు చేస్తున్నది. దశలవారీగా ఈ విధానాన్ని రాష్ట్రంలోని అన్ని దవాఖానల్లో అమలు చేయనున్నారు.

**సహజ ప్రసవాలు లక్ష్యంగా..**

సురక్షిత, సహజ ప్రసవాలను పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వైద్యశాఖ ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నది. గౌరవప్రదమైన ప్రసూతి సంరక్షణను ప్రోత్సహించేందుకు నర్సులకు ప్రత్యేకంగా మిడ్‌వైఫరీ శిక్షణ ఇవ్వడంతోపాటు, ప్రసవ అంచనా తేదీకి 15 రోజుల ముందు నుంచి సహజ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నారు. సహజ ప్రసవాల వల్ల కలిగే ఫలితాలను వివరిస్తూ.. సిజేరియన్ వైపు ఆలోచనరాకుండా చేస్తున్నారు. ప్రసవాల నిర్వహణలో ప్రామాణిక పద్ధతులు పాటించడంపై వైద్యులు, సిబ్బందికి అవగాహన పెంపొందిస్తున్నారు. అవసరమైన మౌలిక సదుపాయాలను, టెక్నాలజీని అందుబాటులో ఉంచుతున్నారు. నర్సింగ్ సిబ్బందితోపాటు ఆయుష్ విభాగం ద్వారా యోగా ట్రైనర్లను సహజ ప్రసవాలు జరిగేందుకు అనుసరించాల్సిన పద్ధతులను గర్భిణులకు వివరిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో నోడల్ అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు.

**2019లో నెలవారీగా నమోదైన సిజేరియన్లు**

| నెల | నమోదైనశాతం |
|---|---|
| జనవరి - జూన్ | 63(సరాసరి) |
| జూలై | 51 |
| ఆగస్టులో | 41 |
| సెప్టెంబర్ | 36 |
| అక్టోబర్ | 33 |
| నవంబర్ | 30 |




## సెల్‌టవర్ దగ్ధం

**ఖలీల్‌వాడి :** నిజామాబాద్ నగరంలోని గాజుల్‌పేట్‌లో ఎంజీ ఫంక్షన్‌హాల్ వెనుక నర్సింగ్‌రావు అనే వ్యక్తి ఇంటిపై ఉన్న సెల్‌టవర్ ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైంది. కరంటు మరమ్మతుల దృష్ట్యా అధికారులు శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నిజామాబాద్ నగరంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో జనరేటర్ సహాయంతో సెల్‌టవర్‌ను నడిపిస్తుండటంతో అధిక లోడ్ పడి జనరేటర్ ప్రమాదానికి గురైందని స్థానికులు తెలిపారు. అగ్ని మాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు.

## ఫైజాబాద్ జంట పేలుళ్ల కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

**ఫైజాబాద్, డిసెంబర్ 21:** ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్‌లో 12 ఏండ్ల కిందట జరిగిన జంట పేలుళ్ల కేసులో ఇద్దరికి జీవిత ఖైదు శిక్షను ప్రత్యేక కోర్టు విధించింది. తగిన ఆధారాలు లేకపోవడంతో మరో నిందితుడిని నిర్దోషిగా ప్రకటించింది. 2007 నవంబర్ 23న ఫైజాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన జంట పేలుళ్ల ఘటనలో ఓ న్యాయవాదితోసహా ఐదుగురు మరణించగా 24 మంది గాయపడ్డారు. నాటి బార్ అసోసియేషన్ కార్యదర్శి మన్సూర్ ఇలాహి ఫిర్యాదు మేరకు కేసు నమోదు కాగా యూపీ ఉగ్రవాద వ్యతిరేక పోలీసు బృందం దర్యాప్తు చేపట్టింది. ఈ పేలుళ్లకు సంబంధించి నలుగురిని అరెస్ట్ చేయగా, వారిలో ఒకరైన ఖలీద్ ముజాహిద్ రిమాండ్‌లోనే అనుమానాస్పదరీతిలో చనిపోయాడు. న్యాయవాదులు, ప్రత్యేక సాక్షుల భద్రత దృష్ట్యా ఫైజాబాద్ జైలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉగ్రవాద వ్యతిరేక ప్రత్యేక కోర్టు ఈ కేసుపై సుదీర్ఘంగా విచారణ జరిపింది. ఇద్దరు నిందితులైన తారిక్ క్వాసిమ్, మొహమ్మద్ అక్తర్‌ను దోషులుగా నిర్ధారించిన అదనపు జిల్లా సెషన్స్ జడ్జి అశోక్ కుమార్ వారికి శనివారం జీవిత ఖైదు విధించారు. మరో నిందితుడు సజ్జాద్ ఉర్ రహమాన్‌పై తగిన ఆధారాలు లేకపోవడంతో నిర్దోషిగా ప్రకటించినట్లు ఫైజాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ బహదూర్ సింగ్ తెలిపారు.



దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో 127 మంది ఫ్లైట్ క్యాడెట్లకు నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న భారత వాయుసేన చీఫ్ మార్షల్ ఆర్కేఎస్ బదౌరియా

## దేశరక్షణలో వాయుసేనది ప్రధాన భూమిక

- యుద్ధరంగ సవాళ్లకు సదా సిద్ధంగా ఉండాలి
- కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో ఎయిర్ చీఫ్ మార్షల్ బదౌరియా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశరక్షణలో వాయుసేనది అత్యంత కీలకమైన భూమిక అని, దానిని మరింత సమర్థంగా కొనసాగిస్తామని భారత వాయుసేన చీఫ్ మార్షల్ ఆర్కేఎస్ బదౌరియా అన్నారు. యుద్ధరంగంలో నిత్యం ఎదురయ్యే సవాళ్లను, భవిష్యత్ ముప్పులను ఎదుర్కొనేందుకు వాయుసేన సిబ్బంది సదా సిద్ధంగా ఉండాలని సూచించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, సరికొత్త వ్యూహాలు నిత్యం సవాళ్లు విసురుతుంటాయని, ఎన్ని ప్రతిబంధకాలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంకావాలని క్యాడెట్లకు ఆయన సూచించారు. శనివారం దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో 127 మంది ఫ్లైట్ క్యాడెట్లకు నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన బదౌరియా.. వారినుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ కోర్సుల్లో శిక్షణ పూర్తిచేసిన క్యాడెట్లకు బదౌరియా ఆఫీసర్ బ్యాడ్జీలను అందజేశారు. కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో మొత్తం 127 మంది ఫ్లైట్ క్యాడెట్లలో 23 మంది మహిళలు ఉన్నారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన ఆయుష్‌పాండే, పూర్ణేందుకుమార్‌సింగ్‌ను ఎయిర్‌చీఫ్ మార్షల్ రాష్ట్రపతి పతకాలతో సత్కరించారు. వాయుసేన అధికారుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఎయిర్‌మార్షల్ ఏఎస్ బుటోల, జే చలపతి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విత్తన భాండాగారం




విత్తన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కేశవులు ఉన్నారు

- వ్యవసాయాన్ని పండుగ చేస్తున్నాం
- మంత్రి నిరంజన్‌రెడ్డి




హైదరాబాద్ ఫ్యాప్సీలో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ నిర్వహించిన విత్తన అవగాహన సదస్సులో పాల్గొన్న మహిళా సాహితీవేత్తలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ విత్తన భాండాగారమని, ఇక్కడ తయారైన విత్తనం ప్రపంచంలో ఎక్కడైనా మొలకెత్తుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ ఫ్యాప్సీలో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఏర్పాటుచేసిన మహిళా సాహితీవేత్తలకు విత్తన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పదివేల ఏండ్ల కిందటే వ్యవసాయం మొదలైందని, నాగలి నుంచి వ్యవసాయ నాగరికత పుట్టుకొచ్చిందన్నారు. అటువంటి నాగలికి పుట్టినిల్లైన హలంపురం నేడు ఆలంపురంగా భాసిల్లుతున్నదన్నారు. వ్యవసాయం దండుగ అంటే మానవజాతి మనుగడ లేనట్లేనని, ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శనంలో వ్యవసాయాన్ని పండుగ చేసే పనిలో ఉన్నామని చెప్పారు. జనబాహుళ్యం అంతా ఎవరికీవారు తమ పనిలో, వృత్తుల్లో నిమగ్నమవ్వాలన్నదే సీఎం కేసీఆర్ ఆలోచనగా పేర్కొన్నారు. మన తెలంగాణ విత్తనానికి ప్రత్యేకత ఉన్నదని, అది ఈ ప్రాంతం, ఈ నేలకే సొంతమన్నారు. దాదాపు 400 కంపెనీలు రూ.5 వేల కోట్ల విత్తన వ్యాపారం చేస్తున్నాయని, విత్తన సదస్సుతో అన్ని విధాలా ఉత్తమ ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం దాదాపు రూ.6,570 వేల కోట్లు వ్యవసాయంపై ఖర్చు చేస్తున్నదని, నాలుగు కోట్ల జనాభా ఉన్న తెలంగాణ రాష్ట్రం ఇంత ఖర్చుచేస్తుంటే 18 కోట్ల జనాభా ఉన్న యూపీలో కనీసం రూ.పదివేల కోట్లు కూడా ఖర్చుచేయడం లేదన్నారు. తాను ఎన్నో సభల్లో పాల్గొన్నానని, కానీ ఇది శిఖరాగ్ర సభగా అనిపిస్తున్నదన్నారు. దేశంలో అవసరం లేని అంశాలపై చర్చ నడుస్తున్నదని, తెలంగాణలో మాత్రం భిన్నంగా సమాజానికి ఉపయోగపడే భవిష్యత్‌కు బాటలు వేసే కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా జ్వలిత రచించిన సంగిడిముంత, సుజనా రాజు రచించిన పూప్సా, ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి రచించిన బృందావనం, బాలల కథా సంపుటి పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. కాగా, తన పారితోషికం వెయ్యికి మరో వెయ్యి కలిపి రైతు సంక్షేమ నిధి కోసం ప్రభుత్వానికి అందజేయాలని రచయిత జ్యోతిర్మయి కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కేశవులు, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ తదిరులు పాల్గొన్నారు.

## ఏపీలో వైఎస్సార్ నేతన్న హస్తం

- మగ్గం ఉన్న కుటుంబానికి ఏటా రూ.24 వేల సాయం
- పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి జగన్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చేనేత కార్మికుల కష్టాలను కండ్లారా చూశానని, వారి కుటుంబాలను ఆదుకునేందుకు వైఎస్సార్ నేతన్న హస్తం పథకానికి శ్రీకారం చుట్టామని ఏపీ సీఎం వైఎస్ జగన్ ప్రకటించారు. మగ్గం ఉన్న కుటుంబాలకు ఐదేండ్లలో ఏటా రూ.24 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామన్నారు. శనివారం అనంతపురం జిల్లా ధర్మవరంలో వైఎస్సార్ నేతన్న హస్తాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. గతంలో చేనేత కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకుంటే ఒక్కరు కూడా పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ప్రజల కష్టాలు తెలుసుకొని పరిష్కరించేందుకు 3,648 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశానని, ప్రతి అడుగులో చేనేత కార్మికులు పడిన కష్టాలు చూశానని చెప్పారు. మగ్గం ఉన్న ప్రతి కుటుంబానికి ఏటా రూ.24 వేల సాయం అందిస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించామ ని, ఇప్పుడు ఆ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు.

## మూడు రాజధానులను స్వాగతించాలి

- ఏపీ అభివృద్ధికి జగన్ ప్రణాళికాబద్ధంగా కృషి
- కేంద్ర మాజీ మంత్రి, సినీహీరో చిరంజీవి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అధికార, పరిపాలనా వికేంద్రీకరణతో అభివృద్ధి సాధ్యమని, ఏపీ అభివృద్ధికి సీఎం జగన్ ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తారనే నమ్మకం ఉన్నదని కేంద్ర మాజీ మంత్రి, సినీహీరో చిరంజీవి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు రాజధానుల అంశాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతించాలని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల అభివృద్ధి కోసం నిపుణుల కమిటీ సిఫారసులు సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగించే విధంగా ఉన్నాయని తెలిపారు. గతంలో అభివృద్ధి, పాలన అంతా హైదరాబాద్‌లోనే కేంద్రీకృతమైందని, ఉమ్మడి రాష్ట్రంలో మిగతా ప్రాంతాలు నిర్లక్ష్యంతో ఆర్థిక, సామాజిక సమతుల్యాలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఇప్పటికే రూ.3 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్న రాష్ట్రంలో ఇంకో రూ.లక్ష కోట్ల అప్పుతో అమరావతిని నిర్మిస్తే ఉత్తరాంధ్ర, రాయలసీమ పరిస్థితి ఏమిటనే ఆందోళన అందరిలోనూ ఉన్నదన్నారు. సాగు, తాగునీరు, ఉపాధి అవకాశాలు లేక వలసలు వెళ్తున్నారని, ఈ నేపథ్యంలో మూడు రాజధానుల కాన్సెప్ట్ భద్రతనిస్తుందని తెలిపారు. అమరావతి ప్రాంత రైతుల్లో నెలకొన్న భయాందోళనలు, అభద్రతాభావాన్ని తొలగించాలని, వారు కూడా నష్టపోకుండా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఏపీ సీఎం జగన్‌ను కోరారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
ఆదివారం 22 డిసెంబర్ 2019

# నా హృదయానికి దగ్గరైన సినిమా!



మెహరీన్, కల్యాణ్‌రామ్

'మనుషులుగా పుట్టినవారు ఏదో ఒక మంచిపని చేయాలి అనే సందేశాన్ని మా చిత్రం ద్వారా అందిస్తున్నాం' అని అన్నారు సతీష్ వేగేశ్న. ఆయన దర్శకత్వంలో కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎంతమంచి వాడవురా'. మెహరీన్ కథానాయిక. ఆదిత్య మ్యూజిక్ పతాకంపై ఉమేష్‌గుప్తా, సుభాష్‌గుప్తా నిర్మించారు. శివలెంక కృష్ణప్రసాద్ సమర్పకుడు. జనవరి 15న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ 'మానవ సంబంధాలన్ని ఆర్థిక సంబంధాలే అని భావిస్తున్న ప్రస్తుత తరుణంలో మానవ సంబంధాలన్ని హార్ధిక సంబంధాలని ఈ చిత్రం ద్వారా తెలియజెప్పబోతున్నాం. కల్యాణ్‌రామ్ పాత్ర చిత్రణ గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉండే చిత్రమిది. అనుబంధాల గొప్పతనాన్ని తెలియజేస్తుంది' అన్నారు. 'నా హృదయానికి దగ్గరైన సినిమా ఇది. సంక్రాంతి పర్వదినాన ప్రతి ఒక్కరూ ఆనందించేలా ఉంటుంది. ఈ సినిమా గురించి ప్రీరిలీజ్ వేడుకలో మరిన్ని విషయాలు మాట్లాడతా' అని కల్యాణ్‌రామ్ తెలిపారు. కథానుగుణంగా మంచి స్వరాలు కుదిరాయని సంగీత దర్శకుడు గోపీసుందర్ తెలిపారు. మానవసంబంధాల ఔన్నత్యాన్ని తెలియజెపుతూ దర్శకుడు ఈ చిత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాడని, అన్ని వర్గాల ప్రేక్షకుల్నిఅలరించేలా సినిమా ఉంటుందని నిర్మాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



మారుతి

**'మానవ సంబంధాల్ని ఆవిష్కరించే అర్థవంతమైన కథలకు తెలుగు ప్రేక్షకులు పట్టంకడతారు. మా సినిమా విజయంతో అది మరోసారి నిజమైంది' అని అన్నారు మారుతి. వినూత్న ఇతివృత్తాల్ని ఎంచుకుంటూ చక్కటి వినోదాల కలబోతగా సినిమాల్ని తీర్చిదిద్దడం ఆయన శైలి. మారుతి దర్శకత్వంలో సాయితేజ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ప్రతిరోజూ పండగే'. బన్నీ వాస్ నిర్మాత. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ సందర్భంగా దర్శకుడు మారుతి పాత్రికేయులతో సంభాషించారు.**

# కొత్తదనం చూపించకపోతే నాకు నేనే బోర్‌కొడతా!

ఈ కథ విన్న ప్రతి ఒక్కరూఅ ద్భుతంగా ఉందని మెచ్చుకున్నారు. భావోద్వేగాలు అంతలా కదిలించాయి. అందుకే ఈ సినిమా విజయంపై మొదటి నుంచి ధీమాగా ఉన్నాం. విడుదలైన అన్ని కేంద్రాల నుంచి హిట్‌టాక్ రావడంఆ నందంగా ఉంది. వినోదాన్ని మేళవించి హృద్యమైన పాయింట్‌ను ఆవిష్కరించారనిప్రేక్ష కులు ప్రశంసిస్తున్నారు. అయితే నా శైలి వినోదాల మోతాదు ఎమోషనల్ సీన్స్‌ను కూడా డామినేట్‌చే సిందని కొందరు చెబుతున్నారు. ఏ కథను ఎంచుకున్నా దానిని వినోదాత్మకపం థాలో చెప్పాలన్నదే దర్శకుడిగా నేను నమ్మే సిద్ధాంతం.

**కొత్త అన్వేషణ ఇది..**

ఎమోషనల్ కంటెంట్‌ను కూడా నేను అద్భుతంగా తెరకెక్కించగలనని ఈ సినిమా నిరూపించింది. విభిన్న కథాంశాల్ని స్పృశిస్తూ సినిమాలు తీయాలన్నదే దర్శకుడిగా నా లక్ష్యం. ఈ ప్రయాణంలో నన్ను నేను అన్వేషించుకుంటూ నూతన మార్గాల్లో సాగిపోతున్నా. ప్రతి సినిమాలో కొత్తదనాన్ని చూపించే ప్రయత్నం చేస్తున్నా. అలా చేయలేకపోతే నాకు నేనే బోర్ కొడతాను (నవ్వుతూ). తప్పుల ద్వారా గుణపాఠాల్ని నేర్చుకుంటూ ముందుకుసాగితేనే పరిణితి వస్తుంది. ఈ సినిమాలో రావు రమేష్ పాత్రకు మంచి స్పందన లభిస్తున్నది. ఆయనపై 28రోజుల పాటు చిత్రీకరణ జరిపాం. నిజజీవితంలో చూసిన కొన్ని సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమా తీశాను. విదేశాల్లో ఉండే కొంతమంది తమ తల్లిదండ్రులు అనారోగ్యంపాలైనా బిజీలైఫ్ కారణంగా వచ్చి చూడలేకపోయామని చెబుతుంటారు. అలాంటి వారికి బాధ్యతను గుర్తుచేసే సినిమా ఇది.

**చిరంజీవి మెచ్చుకున్నారు..**

'ఆరోగ్యకరమైన హాస్యంతో మంచి పాయింట్‌ను టచ్ చేస్తూ సినిమా తీశావు. ఈ సినిమా ఎంత కలెక్ట్ చేస్తుందో చెప్పలేను కానీ అందరికి గుర్తుండిపోతుంది' అని చిరంజీవిగారు మెచ్చుకున్నారు. రిస్కీ పాయింట్‌ను బాగా డీల్ చేశావని రాఘవేంద్ర రావుగారు ఫోన్ చేసి చెప్పారు. పరిశ్రమ నుంచి ఎంతో మంది సన్నిహితులు సినిమా బాగుందని చెబుతున్నారు. ఈ సినిమా ద్వారా చరమాంకంలో ఉన్న తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం చూపించే వారు కొంతమంది మారినా నా లక్ష్యం నెరవేరినట్లేనని భావిస్తాను. పూర్తి వినోదాత్మక ప్రేమకథతో నా తదుపరి చిత్రానికి ప్లాన్ చేస్తున్నా.







